ఆదివారం
13•08•2017

హైదరాబాద్
• వెల.6 రూ.

• సంపుటి 7 • సంచిక 67
• పేజీలు : 16 + 24 + 36 పేజీల ఆదివారం అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



ప్రభుత్వ ఉద్యోగులకు మెడల్స్, ఇంక్రిమెంట్

ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులుగా బంగారు, వెండి, కాంస్య పతకాలు

నగదు ప్రోత్సాహకంగా రూ.5 లక్షలు, 3 లక్షలు, 2 లక్షలు

రాష్ట్రస్థాయిలో 12 మంది, జిల్లాస్థాయిలో 88 మంది అవార్డుకు ఎంపిక

అదనంగా ఒక ఇంక్రిమెంట్ కూడా

6

55 మందికి హరితమిత్ర అవార్డులు

12 మంది ఐఏఎస్‌లకు తెలంగాణ ఎక్సలెన్సీ పురస్కారాలు

పంద్రాగస్టు వేడుకల్లో ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'తెలంగాణకు హరిత హారం' కార్యక్రమంలో విశిష్టసేవలు అందించిన 55 మందికి హరితమిత్ర అవార్డులను అవార్డు కమిటీ చైర్మన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య శనివారం ప్రకటించారు. అదేవిధంగా రాష్ట్రంలో 12 మంది ఐఏఎస్ అధికారులకు తెలంగాణ ఎక్సలెన్సీ అవార్డులు ఇవ్వనున్నట్టు చెప్పారు. అవార్డుల ఎంపిక దాదాపు తుదిదశకు చేరుకుందని ఆదివారం జీవో విడుదల చేస్తామని పేర్కొన్నారు. వివిధ జిల్లాల్లో వివిధ హోదాల్లో ప్రజలకు

మిగతా 6వ పేజీలో



ఊపందుకోనున్న వానలు

కొనసాగుతున్న ద్రోణి ప్రభావం

చురుకుగా నైరుతి రుతుపవనాలు

చెన్నారావుపేట, ఖానాపూర్‌లో గరిష్ఠంగా 7 సెం.మీ.వర్షపాతం నమోదు

రాజధానిలో భారీ వర్షం

3

గోరఖ్‌పూర్ ఘోరకలి!



ఒడువని దుఃఖం గోరఖ్‌పూర్ ప్రభుత్వ దవాఖానలో శనివారం కన్నుమూసిన పసిబిడ్డను తీసుకెళ్తూ కన్నీరుమున్నీరవుతున్న బంధువులు

యూపీ దవాఖానలో మరణమృదంగం

63కు చేరిన శిశు మరణాలు

ఆక్సిజన్ సరఫరా లేక పిట్టల్లా రాలిన పసిపిల్లలు.. గుండెలవిసేలా విలపిస్తున్న తల్లిదండ్రులు

ప్రాణాలు కాపాడాల్సిన దవాఖాన ప్రాణాలు తీసే వధశాలగా మారింది. అది కూడా.. అప్పుడే పుట్టి కండ్లు తెరిచిన పసికందుల ప్రాణాలు తీసింది. ఒక్కరు ఇద్దరు కాదు.. 63 మంది చిన్నారులు ఆ 'దవాఖాన'లో కొన్ని గంటల వ్యవధిలో మృత్యువాత పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో బాబా రాఘవ్ దాస్ (బీఆర్డీ) ప్రభుత్వ వైద్య కళాశాల దవాఖానలో జరిగిన ఈ ఘోరకలి దేశవ్యాప్తంగా తీవ్రమైన ఆవేదనను కలిగించింది. ప్రభుత్వ దవాఖానల్లో నెలకొన్న దారుణమైన పరిస్థితులకు, నేరపూరిత నిర్లక్ష్యానికి అద్దం పట్టింది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నిన్నమొన్నటివరకు ప్రాతినిధ్యం వహించిన గోరఖ్‌పూర్ పార్లమెంటరీ నియోజకవర్గంలోనే ఈ దవాఖాన ఉంది. ఆక్సిజన్ సరఫరా చేసే సంస్థకు కొన్ని నెలలుగా 64 లక్షల బకాయిలు చెల్లించకపోవటంతో.. విజ్ఞప్తులు చేసీ చేసీ విసిగిపోయిన సరఫరాదారు దవాఖానకు ఆక్సిజన్ సిలిండర్లను సరఫరా చేయటం ఆపివేశాడు. దీంతో ప్రాణవాయువు లేకపోవటంతో.. చికిత్స విభాగంలో ఉన్న చిన్నారులు చూస్తుండగానే పిట్టల్లా రాలిపోయారు. నాలుగురోజుల వ్యవధిలో 63 మంది కన్నుమూశారు. ఈ నేపథ్యంలో, యోగి ఆదిత్యనాథ్ సర్కార్‌పై విమర్శల వర్షం కురుస్తున్నది. ఆయన వెంటనే రాజీనామా చేయాలన్న డిమాండ్లు ఊపందుకుంటున్నాయి. యూపీ ప్రభుత్వం మాత్రం.. చిన్నారుల మృతికి ఆక్సిజన్ సరఫరా నిలిచిపోవటం కారణం కాదంటూ, తమ వైఫల్యం లేదని చెప్పుకోవటానికి ప్రయత్నిస్తున్నది. ఇన్ఫెక్షన్లు, ఇతర ఆరోగ్య సమస్యల కారణంగానే పిల్లలు చనిపోయారని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. దర్యాప్తులో అసలు కారణం వెల్లడవుతుందని చెప్తున్నాయి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజీవ్‌మిశ్రాను వెంటనే సస్పెండ్ చేసినట్లు తెలిపాయి.

వివరాలు 5వ పేజీలో

రాజధాని చుట్టూ పార్కులు

అవసరమైతే వంద కోట్లు కేటాయింపు: మంత్రి జోగు రామన్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

హైదరాబాద్ నగరం చుట్టూ ఏర్పాటుచేసిన పలు అర్బన్ పార్కులకు మంచి ఆదరణ లభిస్తున్నదని అటవీ, పర్యావరణశాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. హైదరాబాద్ చుట్టూ 99 పార్కులను అభివృద్ధి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. అవసరమైతే ఈ పార్కుల కోసం వంద కోట్ల రూపాయలను వెచ్చిస్తామని తెలిపారు. హైదరాబాద్ చుట్టూ పచ్చదనాన్ని పెంచి.. ఆహ్లాదకరంగా మార్చాలన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు మంత్రి జోగురామన్న, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, కమిషనర్ జనార్దన్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు తదితరులు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్బన్ పార్కుల్లో విస్తృతంగా పర్యటించారు. మన్సూరాబాద్, మేడిపల్లి, భాగ్యనగర్ నందనవనం, వనస్థలిపురంలోని హరిణ వనస్థలి జాతీయ పార్కులను సందర్శించారు. పార్కుల్లో ఏర్పాటు చేసిన వాక్ వేలు, సైకిల్ ట్రాక్‌లు, జారుడుబండలు, పిల్లల ఆటస్థలాలను పరిశీలించి స్థానిక ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మంత్రి కే తారకరామారావు కూడా అర్బన్ పార్కుల అభివృద్ధిపై ఆసక్తిగా ఉన్నారని.. త్వరలో ఆయన స్వయంగా పర్యటిస్తారని జోగురామన్న

మిగతా 2వ పేజీలో

లోకం పోకడ



కలిసి పాదయాత్ర చేయడానికి
ఆత్మగౌరవం అడ్డొస్తున్నదట...!

ఆటోడ్రైవర్ భార్యకు 5 లక్షలు

- బీమా సొమ్ము అందజేసిన హోంమంత్రి నాయిని

అల్వాల్: ప్రమాదంలో మరణించిన డ్రైవర్ల కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం అండగా నిలుస్తున్నదని, బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల బీమా కల్పిస్తున్నదని రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి చెప్పారు. డ్రైవర్ల భద్రత కోసం ప్రభుత్వం బీమాపాలసీ పథకం రెండేండ్ల క్రితం ప్రవేశపెట్టిందని, ఏదైనా కారణంతో డ్రైవరు మరణిస్తే ఆయన కుటుంబానికి రూ.5 లక్షలు బీమా అందజేస్తున్నదని తెలిపారు. హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన ఆటోడ్రైవర్ ధర్మరాం కృష్ణ (45) రెండునెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆయన భార్య నర్సమ్మకు శనివారం తన నివాసంలో హోంమంత్రి రూ. 5లక్షల చెక్కును అందజేశారు. లారీ, ట్యాక్సీ, ఆటోడ్రైవర్లు జర్నలిస్టులు, హోంగార్డులు తదితరులకు ఈ బీమా పథకాన్ని అందజేస్తున్నామని మంత్రి నాయిని తెలిపారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, యూనియన్ నాయకులు రాంబాబు, నారాయణ, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి శాగర్ల బాల్‌రాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆటోడ్రైవర్ కృష్ణ భార్య నర్సమ్మకు రూ. 5 లక్షల బీమా చెక్కు అందజేస్తున్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

బీఎడ్‌కు పెరుగుతున్న ఆదరణ

ఎడ్‌సెట్‌కు గత ఏడాది కంటే 20 వేల మంది అధికంగా హాజరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఎడ్) కోర్సులకు ఆదరణ పెరుగుతున్నది. ఎడ్‌సెట్ కోసం గత ఏడాది 44 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 2017-18 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు 64 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది కంటే 20 వేల మంది విద్యార్థులు అధికంగా ఎడ్‌సెట్-17 పరీక్షలకు హాజరయ్యారు. 2015-16 విద్యాసంవత్సరం నుంచి బీఎడ్ కోర్సును రెండేండ్లుగా నిర్ణయిస్తూ జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్సీటీఈ) నిబంధనలు విధించింది. అంతకుముందు వరకు అభ్యర్థులు లక్షల సంఖ్యలో దరఖాస్తు చేసుకోగా, రెండేండ్ల కోర్సు నిబంధనతో వెనుకడుగు వేశారు. కానీ ప్రస్తుతం గురుకుల విద్యాలయాల్లో ఉపాధ్యాయ పోస్టులను, పాఠశాల విద్యాశాఖలో 8,792 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతుండటంతో బీఎడ్ చేసేందుకు మళ్లీ ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ప్రైవేటు పాఠశాలల్లోనూ కచ్చితంగా బీఎడ్ / డీఎడ్ కోర్సు పూర్తిచేసిన టీచర్లే ఉండాలని, దీనిపై రాష్ట్రప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. ప్రస్తుతం బీఎడ్ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం కూడా అమలవుతున్నది. ఎన్సీటీఈ ప్రకారం ఈ ఏడాదిలో బీఈ/బీటెక్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు కూడా బీఎడ్ చేయడానికి అర్హులుగా పరిగణించింది. ఈ నేపథ్యంలో ఎడ్‌సెట్‌కు దరఖాస్తులు పెరుగుతున్నాయని ఎడ్‌సెట్ కోకన్వీనర్ ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 184 కాలేజీలు ఉండగా, వాటిలో 18,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో కన్వీనర్ కోటాలో 12 వేలు, యాజమాన్య కోటాలో 4వేలు నిండాయి. గత ఏడాది సాంకేతిక కారణాల వల్ల తుదివిడుత ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ నిర్వహించలేదు. ఈ ఏడాది తొలివిడుత, చివరివిడుత కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారంలో ఎడ్‌సెట్-2017 కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెప్తున్నారు.



ప్రాతఃస్మరణీయుడు పైడిమర్రి

నేడు వెంకటసుబ్బారావు వర్ధంతి

'భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు' అంటూ నిత్యం దేశవ్యాప్తంగా విద్యార్థులు చేసే 'ప్రతిజ్ఞ'ను రచించిన పైడిమర్రి వెంకటసుబ్బారావును ఆయన వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రం స్మరించుకుంటున్నది. నల్లగొండ పట్టణశివారు అన్నెపర్తి గ్రామంలో 1916 జూన్ 10న సుబ్బారావు జన్మించారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయుర్వేద వైద్యుడు. బహుభాషా పండితుడు. అరబిక్, ఇంగ్లిష్, తెలుగు, సంస్కృత భాషల్లో నిష్ణాతుడైన సుబ్బారావు 18వ ఏట సురవరం ప్రతాపరెడ్డి వెలువరించిన గోలకొండ కవుల సంచికలో తొలికవిత రాశారు. తెలుగుభాషలో అనేక రచనలు చేశారు. కాలభైరవుడు ఆయన ప్రసిద్ధరచన. ట్రెజరీ ఉద్యోగిగా నిజామాబాద్, నెల్లూరు, ఖమ్మం, నల్లగొండ,విశాఖపట్నంలో వివిధ హోదాల్లో పనిచేశారు. విశాఖపట్నంలో ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్నపుడు 1962లో భారత్-చైనా యుద్ధం సందర్భంగా దేశభక్తిని రగిలించే 'ప్రతిజ్ఞ'ను ఆయన రాశారు. విశాఖకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత తెన్నేటి విశ్వనాథంకు ఈ రచనను చూపించగా అప్పటి విద్యాశాఖమంత్రి పీవీజీ రాజుకు పంపించారు. మంత్రి ఆదేశంతో ఈ గీతం పాఠ్యపుస్తకాల్లో 'ప్రతిజ్ఞ'గా చోటుచేసుకుంది. 1964లో బెంగళూరులో జరిగిన భారత ప్రభుత్వ విద్యాశాఖ సలహా కమిటీ సమావేశం జాతీయ స్థాయిలో అన్ని స్కూళ్లలో 'ప్రతిజ్ఞ' చేయించాలని నిర్ణయించింది. ఈ మేరకు 'ప్రతిజ్ఞ'ను అన్ని భాషల్లోకి అనువదించారు. 1965 జనవరి 26నుంచి దేశవ్యాప్తంగా పాఠశాలల్లో 'ప్రతిజ్ఞ' అమల్లోకి వచ్చింది. గొప్ప గీతాన్ని రచించిన పైడిమర్రికి నాటి ఆంధ్రప్రభుత్వం గౌరవం ఇవ్వలేదు. పాఠ్యపుస్తకాల్లో 'ప్రతిజ్ఞ' గీతానికి పైడిమర్రి పేరు వేయలేదు. పుస్తకాల్లో దశాబ్దాలపాటు 'ప్రతిజ్ఞ' రచయిత పేరు అనామకంగానే ఉండిపోయింది. 'ప్రతిజ్ఞ'ను పాఠ్యపుస్తకాల్లో చేర్చిన విషయం పైడిమర్రికి తెలియదు. ఉద్యోగ విరమణ అనంతరం 70 ఏండ్ల వయస్సులో తన మనుమరాలి పుస్తకాన్ని చదువుతూ ఆ విషయాన్ని గుర్తించారు. 1988లో పైడిమర్రి మరణించారు. కేంద్ర మానవవనరుల శాఖ రికార్డుల్లో 'ప్రతిజ్ఞ' రచయితగా పైడిమర్రిని గుర్తించారు. ప్రాతఃస్మరణీయుడు అని చాలామందిని అలంకారప్రాయంగా పిలుస్తారు కానీ పైడిమర్రి నిజంగానే ప్రాతఃస్మరణీయుడు. దేశవ్యాప్తంగా పాఠశాలల్లో ఉదయం ప్రతిధ్వనించే 'ప్రతిజ్ఞ' ద్వారా దేశం ఆయనను స్మరించుకుంటూనే ఉంది.

ముహూర్తం



సూర్యోదయం: 6.02 గంటలకు

సూర్యాస్తమయం: 6.39 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, షష్ఠి రాత్రి 9.34 వరకు, తదుపరి సప్తమి. నక్షత్రం: రేవతి తె. 5.51 వరకు తదుపరి అశ్విని. అమృత ఘడియలు: తె. 3.30 నుంచి 5.06 వరకు, రాహుకాలం: సాయంత్రం 5.05 నుంచి 6.39 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.58 నుంచి 5.49 వరకు, వర్జ్యం: లేదు

జిగేల్‌మనేలా ఉజాలా

రాష్ట్రంలో శరవేగంగా ఎల్ ఈడీ బల్బుల పంపిణీ

- దేశవ్యాప్తంగా 25.49 కోట్లు అందజేత.. తెలంగాణలో 13.54 లక్షలు..
- తగ్గిన విద్యుత్ వినియోగం.. రూ.కోట్లలో ఆదా
- తగ్గుతున్న కార్బన్‌డైఆక్సైడ్ ఉద్గారాలు
- వెబ్‌సైట్‌లో వెల్లడించిన కేంద్ర ఇంధన శాఖ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రాన్ని ఎల్ఈడీ వెలుగులతో జిగేల్ మనిపించే పనుల్లో వేగం పుంజుకున్నది. దేశవ్యాప్తంగా లెడ్ బల్బుల విప్లవం కొనసాగుతున్నది. శనివారంనాటికి దేశవ్యాప్తంగా 25.49 కోట్ల ఎల్ఈడీ బల్బులను సరఫరా చేసినట్టు కేంద్ర ఇంధనశాఖ ఆధ్వర్యంలోని జాతీయ ఉజాలా డ్యాష్‌బోర్డులో పొందుపర్చిన వివరాలను బట్టి తెలుస్తున్నది. తెలంగాణవ్యాప్తంగా 13.54 లక్షల లెడ్ బల్బుల పంపిణీ పూర్తి చేశారు. కేంద్రం 2015 జనవరిలో ప్రారంభించిన ఉజాలా (ఉన్నత్ జీవన్ బై అఫోర్డెబుల్ లెడ్స్ అండ్ అప్లయెన్సెస్ ఫర్ ఆల్) పథకం కింద విద్యుత్ ఆదాతోపాటు మెరుగైన విద్యుత్ కోసం ఈఈఎస్ఎల్ (ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్) ద్వారా దేశవ్యాప్తంగా లెడ్ బల్బుల పంపిణీని ప్రారంభించింది. ఈ పథకం కింద 9 వాట్ల లెడ్ బల్బును రూ.70లకే అందిస్తారు. 20 వాట్ల ట్యూబ్‌లైట్‌ను రూ.220లకు, బీఈఈ 5 స్టార్ ఎనర్జీ ఎఫిషియెంట్ ఫ్యాన్‌ను రూ.1200లకు అందజేస్తారు. లెడ్ బల్బులు, ట్యూబ్‌లైట్లకు మూడేండ్ల గ్యారంటీ ఉంటుంది. లెడ్ బల్బుల జీవితకాలం 25వేల గంటలు కాగా, సాధారణంగా మనం ఉపయోగించే బల్బుల జీవితకాలం ఇందులో పదోవంతు (సుమారు 2,500 గంటలు) వరకు ఉంటుందని నిపుణుల అంచనా. 20 వాట్ల లెడ్ ట్యూబ్‌లైట్ 40 వాట్ల సాధారణ ట్యూబ్‌లైట్ కన్నా 50 శాతం సమర్థంగా పనిచేస్తుంది.

అగ్రస్థానంలో గుజరాత్

77 కోట్ల సాధారణ బల్బుల స్థానంలో ఎల్ఈడీ బల్బులను పంపిణీ చేయాలనే లక్ష్యంతో ఉజాలా పథకాన్ని ప్రారంభించిన కేంద్రం.. శనివారానికి 25.49 కోట్ల లెడ్ బల్బులను పంపిణీ చేసింది. ఇందులో 3.62 కోట్లతో గుజరాత్ అగ్రస్థానంలో ఉంది. 2.16 కోట్ల బల్బులను పంపిణీ చేసి ఆంధ్రప్రదేశ్ రెండోస్థానంలో, 2.13 కోట్ల బల్బులను సరఫరా చేసి మహారాష్ట్ర మూడోస్థానంలో నిలిచింది. తెలంగాణవ్యాప్తంగా 13.54 లక్షల బల్బులను సరఫరా చేశారు. దేశవ్యాప్తంగా 25.49 కోట్ల లెడ్ బల్బులను పంపిణీ చేయడం వల్ల దేశానికి ఏటా రూ.13,242 కోట్ల మేర ఆదా అవుతున్నట్టు ఇంధన మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. 33,104 మిలియన్ కేడబ్ల్యూహెచ్ (కిలోవాట్ అవర్) మేర విద్యుత్‌ను ఏటా ఆదా చేసినట్టేనని పేర్కొన్నారు. సాధారణ బల్బుల స్థానంలో లెడ్ బల్బులను వాడటం వల్ల సుమారు 6,628 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ భారాన్ని, సంవత్సరానికి 2.68 కోట్ల టన్నుల కార్బన్‌డైఆక్సైడ్ ఉద్గారాన్ని తగ్గించుకోగలిగినట్టు వెబ్‌సైట్లో పొందుపర్చారు.

ఆగస్టు 12 నాటికి తెలంగాణవ్యాప్తంగా ఎల్ ఈడీ బల్బుల పంపిణీ

జిల్లా	పంపిణీ చేసినవి
ఆదిలాబాద్	2,35,000
నిజామాబాద్	9,285
మెదక్	3,853
రంగారెడ్డి	2,04,463
హైదరాబాద్	2,88,385
కరీంనగర్	32,882
వరంగల్	20,518
ఖమ్మం	19,997
నల్లగొండ	32,223
మహబూబ్‌నగర్	0
రైల్వేలు	39,530
డిస్కంలు	4,67,937
మొత్తం	13,54,073

రాష్ట్రానికి ప్రయోజనమెంతో..

- శనివారం సాయంత్రానికి తెలంగాణ రాష్ట్రంలో 13,54,073 లెడ్ బల్బులు, 1,25,271 లెడ్ ట్యూబ్‌లైట్లు, 26,420 ఎనర్జీ ఎఫిషియెంట్ ఫ్యాన్లను సరఫరా చేశారు.
- ఇప్పటివరకు రాష్ట్రంలో లెడ్ బల్బుల పంపిణీతో సంవత్సరానికి 1,75,855 ఎండబ్ల్యూహెచ్ (మిలియన్ వాట్అవర్) విద్యుత్‌ను ఆదా చేసినట్టయింది. దీనివిలువ ఏటా సుమారు రూ.70 కోట్ల వరకు ఉంటుంది.
- లెడ్ బల్బులను వాడటం వల్ల సుమారు 35 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తగ్గించగలిగాం.
- లెడ్ బల్బులను ఉపయోగించడంతో ఏడాదికి 1,42,442 టన్నుల కార్బన్‌డైఆక్సైడ్‌ను తగ్గించుకోగలిగాం.

గ్రంథాలయ ఉద్యోగులకు త్వరలో శుభవార్త

- సీఎం పరిశీలనలో వేతనాల పెంపు ఫైలు
- గ్రంథాలయ పితామహుడి జయంతి సభలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి వెల్లడి
- ఈ-లైబ్రరీ ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రంథాలయ ఉద్యోగులు కోరుకుంటున్న పద్ధతిలో త్వరలోనే వేతనాలు లభిస్తాయని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. గ్రంథాలయ శాఖలోని ఉద్యోగులకు 010 కింద వేతనాల చెల్లింపు ఫైలు సీఎం కేసీఆర్ పరిశీలనలో ఉన్నదని, ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి ఉత్సవాన్ని శనివారం రవీంద్ర భారతిలో ఘనంగా నిర్వహించారు (ఆయన జయంతినే గ్రంథపాలకుల దినోత్సవంగా నిర్వహించడం సంప్రదాయం). రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ అయాచితం శ్రీధర్ అధ్యక్షత జరిగిన సభలో ఈ-లైబ్రరీ విధానాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ ఎంపవర్‌మెంట్ ప్రాజెక్ట్ ద్వారా గ్రంథాలన్నింటినీ డిజిటలైజ్ చేస్తున్నామని చెప్పారు. ఆధునిక టెక్నాలజీ వచ్చాక అన్నింటినీ డిజిటల్ పద్ధతిలో నిక్షిప్తంచేసేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. ఏ టెక్నాలజీ కూడా గ్రంథాలయాలకు ప్రత్యామ్నాయం కాలేదని స్పష్టంచేశారు. గ్రంథాలయ ఉద్యమానికి భారత స్వాంతత్ర్యోద్యమానికి విడదీయరాని అనుబంధం ఉన్నదని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో గ్రంథాలయాల పాత్ర మరువలేనిదని గుర్తుచేశారు. గ్రంథాలయాల పూర్వవైభవానికి పరిషత్ చైర్మన్ సారథ్యంలో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రోజూ ఒక కొత్త పుస్తకాన్ని చదువుతారని చెప్పారు. గ్రంథాలయాల రూపురేఖలు మార్చాలని సీఎం ఆదేశించారని, ఆమేరకు అన్ని జిల్లాకేంద్రాల్లో గ్రంథాలయ భవనాలను నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. మహాత్మాగాంధీ వంటి నాయకులు గ్రంథాలయాల ద్వారానే విజ్ఞానాన్ని సముపార్జించారని అధికారభాషా సంఘం అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకర్‌రావు చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాకే చారిత్రాత్మక తెలంగాణ గ్రంథాలయాలకు మంచిరోజులు వచ్చాయని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గుండవరపు దేవీప్రసాద్ పేర్కొన్నారు. గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి నివేదిస్తామని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి తెలిపారు. గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అయోధ్య కోరారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, సీఎం కార్యాలయం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు ముజీబ్, ప్రొఫెసర్ మురళీకృష్ణ, తెలుగు అకాడమీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, నగర కేంద్ర గ్రంథాలయం అధ్యక్షురాలు ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. ముందుగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



శనివారం రవీంద్రభారతిలో నిర్వహించిన గ్రంథపాలకుల దినోత్సవంలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరికి జ్ఞాపిక అందజేస్తున్న గ్రంథాలయ పరిషత్ చైర్మన్ అయాచితం శ్రీధర్. చిత్రంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



హైదరాబాద్ శివారు హిమాయత్‌సాగర్ సమీపంలో చెట్టును ఢీకొట్టడంతో మృతిచెందిన ఎస్సై ఖలీల్‌పాషా. (ఇన్‌సెట్‌లో) ఫైల్ ఫొటో

చెట్టును ఢీకొట్టిన కారు

వికారాబాద్ ఎస్బీ ఎస్సై, ట్రైనీమహిళా కానిస్టేబుల్ దుర్మరణం

మరో ట్రైనీ మహిళా కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు.. హిమాయత్‌సాగర్ సర్వీస్ రోడ్‌లో ప్రమాదం

రాజేంద్రనగర్: వర్షంలో శనివారం రాత్రి వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రహదారి పక్కనున్న చెట్టును ఢీకొట్టడంతో వికారాబాద్ ఎస్బీ ఎస్సై మహ్మద్ ఖలీల్‌పాషా(35), ట్రైనీ మహిళా కానిస్టేబుల్ కీర్తి(25) దుర్మరణం చెందారు. మరో ట్రైనీ మహిళా కానిస్టేబుల్ మమత తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ హిమాయత్‌సాగర్ సమీపంలోని సర్వీసు రోడ్డుపై ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి మండలం గుండుమాల్‌కు చెందిన మహ్మద్ సాహెబ్ కుమారుడు మహ్మద్ ఖలీల్‌పాషా వికారాబాద్‌లో ఎస్బీ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన కొన్ని రోజులుగా తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. అంబర్‌పేటకు చెందిన కీర్తి, రామంతాపూర్‌కు చెందిన మమత కూడా మహిళా కానిస్టేబుళ్లుగా అక్కడే శిక్షణలో ఉన్నారు. శనివారం అకాడమీలో సెలవులు ఇవ్వటంతో ట్రైనీ మహిళా కానిస్టేబుళ్లు.. ఎస్సైని లిఫ్ట్ అడిగినట్టు సమాచారం. ట్రైనీ మహిళా కానిస్టేబుళ్లతో కలిసి ఖలీల్‌పాషా.. తన స్విఫ్ట్ డిజైర్ కారులో రాత్రి 7.30 గంటల సమయంలో నగరానికి బయలుదేరారు. హిమాయత్‌సాగర్ సమీపంలోని లార్డ్స్ కాలేజీ గేటు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును వేగంగా ఢీకొట్టింది. కారు నడుపుతున్న ఖలీల్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక సీట్లో కూర్చున్న మహిళా కానిస్టేబుళ్లు కీర్తి, మమతకు తీవ్రగాయాలయ్యాయని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వీ ఉమేందర్ తెలిపారు. వర్షం పడుతుండటం తో ప్రమాదం జరిగాక ఎవరూ అటు వెళ్లలేదని, కొద్దిసేపటి తర్వాత అటుగావెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారని చెప్పారు. ఘటనాస్థలికి చేరుకుని.. కీర్తి, మమతను చికిత్సకోసం దవాఖానకు తరలించినట్టు ఉమేందర్ వివరించారు. ఖలీల్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదుచేసినట్టు తెలిపారు. కేర్ దవాఖానలో చికిత్సపొందుతూ కీర్తి మృతిచెందింది. ఖలీల్‌పాషా చేవెళ్ల, దోమ, పరిగి తాండూర్ పోలీస్‌స్టేషన్లలోనూ విధులు నిర్వహించారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



శనివారం సిద్దిపేట జిల్లా ఇర్కోడులో చెత్త సేకరణ ఆటోను నడుపుతున్న భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు

గోదావరి జలాలతో భూములన్నీ సస్యశ్యామలం

వచ్చే ఏడాదిలో సిద్దిపేట జిల్లాకు సాగునీరు అందిస్తా

భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, నమస్తే తెలంగాణప్రతినిధి: గోదావరి జలాలతో రాష్ట్రంలోని బీడు భూములన్నీ పచ్చబడుతాయని, ఇందుకోసం ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రాజెక్టులు కట్టాలంటే ఏండ్లు పట్టేదని, అటువంటిది సీఎం కేసీఆర్ ప్రభుత్వం రెండేండ్లలోనే ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయించడానికి కృషి చేస్తున్నదని అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లాలోని ఇర్కోడు, చిన్నగుండవెల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో మాట్లాడుతూ రాష్ట్రంలో తరచు వర్షాభావ పరిస్థితుల వల్ల చేన్లు ఎండిపోతున్నాయన్నారు. ఇంత కరువుకాలంలో సైతం కాళేశ్వరం నుంచి 220 టీఎంసీల నీళ్లు వృథాగా సముద్రంలోకి పోతున్నాయని, ఆ జలాలతో 22 లక్షల ఎకరాలను సాగుచేయవచ్చని చెప్పారు. అందుకే ఆ నీళ్లను తీసుకొనిరావడానికి సీఎం కేసీఆర్ భగీరథ ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఇక రైతులు మొగులుకు ముఖం పెట్టి చూసే రోజులు పోతాయని, కరువు శాశ్వతంగా తొలగిపోతుందన్నారు. వచ్చే ఏడాది కల్లా సిద్దిపేట జిల్లాకు సాగునీరు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేస్తున్నామని, సిద్దిపేటలో రూ.700 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణమవుతుందని చెప్పారు. రైతాంగానికి 24 గంటల కరెంట్‌ను ఇస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్రంలో మొట్టమొదట ప్రభుత్వం తరపున సామూహిక గొర్రెలపాకను ప్రారంభించుకోవడం అదృష్టంగా భావిస్తున్నా మన్నారు. హరితహారంలో ప్రతి ఒక్కరు పాల్గొని మొక్కలు నాటడమే కాక వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

భూసేకరణను త్వరగా పూర్తి చేయాలి..

రంగనాయకసాగర్ రిజర్వాయర్ తదితర ప్రాజెక్టుల భూసేకరణపై కలెక్టర్ కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావు సమీక్షించారు. సిద్దిపేట జిల్లాలో అతి ముఖ్యమైన రిజర్వాయర్లు ఉన్నాయని, వాటికి భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. రైతులతో మాట్లాడి వారి ఆమోదంతో నోటిఫికేషన్ చెల్లింపులు పూర్తి చేయాలని, ఈ నెలాఖరులోగా అసైన్డ్ ల్యాండ్ భూసేకరణ జరుగాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ పీ వెంకట్రామ్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ పద్మాకర్, కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ, ఎస్ఈలు, ఈఈలు పాల్గొన్నారు.



భాగ్యనగర్ నందనవనంను పరిశీలిస్తున్న అటవీశాఖమంత్రి జోగు రామన్న. చిత్రంలో జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు జనార్దన్‌రెడ్డి, చిరంజీవులు

రాజధాని చుట్టూ పార్కులు

మొదటిపేజీ తరువాయి...

వెల్లడించారు. అనంతరం నారపల్లి, మేడిపల్లిలోని నందనవనం పార్కులను సందర్శించారు.

ఎల్బీ నగర్‌లో మేయర్ పర్యటన: ఎల్బీనగర్ ప్రాంతంలో శనివారం మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్, బాబా ఫసియుద్దీన్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు జనార్దన్‌రెడ్డి, చిరంజీవులుతో కలిసి పర్యటించారు. నాగోలు జంక్షన్ సమీపంలోని పెట్రోల్ బంక్ రహదారిని, పీఎమ్మార్ ఫంక్షన్ హాలు మీదుగా ఉన్న ప్రస్తుత రహదారిని విస్తరించాలని అధికారులకు మేయర్ సూచించారు. అనంతరం కామినేని జంక్షన్ వద్ద ఫ్లైవర్ పనులను పరిశీలించారు. ఎల్బీ నగర్ జాతీయ రహదారి కోర్టు కార్యాలయం నుంచి మన్సూరాబాద్ మీదుగా వెళ్లే రోడ్డు మార్గంలో కామినేని జంక్షన్ వద్ద అండర్‌పాస్‌ను నిర్మించాలని సీఎం చేసిన ప్రతిపాదనను పరిశీలించారు. ఈ మార్గాల్లో అండర్‌పాస్ నిర్మాణం వల్ల ఎల్బీ నగర్ నుంచి వనస్థలిపురం వరకు ట్రాఫిక్ సులువుగా వెళ్తుందన్నారు. ఫలితంగా జాతీయ రహదారిపై ఒత్తిడి తగ్గుతుందని మేయర్ అన్నారు.



హైదరాబాద్‌లోని పంజాగుట్ట సర్కిల్‌లో శనివారం రాత్రి కురుస్తున్న వాన

మరింత పుంజుకోనున్న వర్షాలు



హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో శనివారం రాత్రి భారీ వర్షానికి జలమయమైన రోడ్డు

- కొనసాగుతున్న ద్రోణి ప్రభావం.. చురుకుగా నైరుతి రుతుపవనాలు
- చెన్నారావుపేట, ఖానాపూర్‌లో గరిష్ఠంగా 7 సెం.మీ.వర్షపాతం
- రాజధానిలో భారీ వర్షం.. లోతట్టుప్రాంతాలు, రోడ్లు జలమయం

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మంగళవారం నుంచి వర్షాలు మరింత పుంజుకుంటాయని అంచనా వేస్తున్నారు. ఈ నెల 16న రాష్ట్రంలో చాలాప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని చెప్పారు. ప్రస్తుతం ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు విస్తరించిన అల్పపీడన ద్రోణి కొనసాగుతున్నదని, దీనికి తోడు కోస్తాంధ్ర తీరం వెంట సముద్రతీరానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని తెలిపారు. ఈ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా చాలాప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయని వివరించారు. శనివారం హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు చెన్నారావుపేట, ఖానాపూర్‌లో అత్యధికంగా 7 సెం.మీ.వర్షపాతం నమోదైంది. నాగిరెడ్డిపేట, లక్సెట్టిపేటలో 5 సెం.మీ., ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాలలో 4 సెం.మీ, ఇల్లెందు, సారంగపూర్, అశ్వాపురం, మహబూబాబాద్, దోమకొండలో 3 సెం.మీ చొప్పున వర్షం కురిసినట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

మరో 24 గంటలు వర్షసూచన

అల్పపీడన ద్రోణి ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఓ మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. రాజేంద్రనగర్, అత్తాపూర్, మెహిదీపట్నం, ఖైరతాబాద్, బంజారాహిల్స్, బేగంపేట, ప్యాట్నీ, నాంపల్లి, అబిడ్స్, పాతబస్తీ, అంబర్‌పేట, కోఠి, ఉప్పల్, హబ్సిగూడ, మేడ్చల్, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో భారీవర్షం కురిసింది. దీంతో లోతట్టుప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల రోడ్లపై వాన నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ట్రాఫిక్‌జాం కారణంగా వాహనదారులు ఇబ్బందిపడ్డారు. వచ్చే 24 గంటల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీవర్షం కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం 5.30 గంటల వరకు నమోదైన వివరాల ప్రకారం గ్రేటర్ పరిధిలో గరిష్ఠంగా 1.2 సెం.మీ వర్షపాతం నమోదైంది.

రైతు రాజవ్వాలన్నదే లక్ష్యం

- వచ్చే సంవత్సరం వ్యవసాయ బడ్జెట్
- పునర్జన్మ ఉండదనే కాంగ్రెస్ అవాకులు
- కాంగ్రెస్‌ది.. కోదండరాంది ఒకే మాట..
- వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- కేసీఆర్ సామాజిక ఇంజినీర్: ప్రశాంత్‌రెడ్డి
- కాంగ్రెసోళ్లది పవర్‌పోయిన పరేషాన్: జీవన్‌రెడ్డి



శనివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, హన్మంతు షిండే కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీరాంసాగర్ పునర్జీవం పథకం పూర్తయితే ఇక పునర్జన్మ ఉండదన్న భయంతోనే కాంగ్రెస్‌నాయకులు అవాకులు చెవాకులు పేలుతున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. ప్రాజెక్టుల మీద కాంగ్రెస్ చేసిన విమర్శలను ఆయన తిప్పి కొట్టారు. కాంగ్రెస్ నాయకులు ప్రాజెక్టుల పేరుతో జేబులు నింపుకొన్నారేగాని నీరివ్వలేదని, ఉద్యమకారుడైన తమ ముఖ్యమంత్రి వట్టిపోయిన శ్రీరాంసాగర్‌కు కూడా పునర్జీవం కల్పించి 18 లక్షల ఎకరాలకు రెండుపంటలకు నీరివ్వడానికి కృషి చేస్తున్నారని అన్నారు. కోటి ఎకరాలకు నీరందించి రైతును రాజుగా చేయడమే కేసీఆర్ లక్ష్యమని, ఆ దిశగా పాత ప్రాజెక్టులు- చెరువుల పునరుద్ధరణ, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం అనే మూడంచెల విధానాన్ని అమలుచేస్తున్నారని చెప్పారు. శనివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, హన్మంతు షిండేలతో కలిసి మీడియాతో మాట్లాడారు. గోదావరి నదిపై నిర్మించిన ఎస్సారెస్పీకి ఇప్పటి వరకు చుక్క నీరు రాలేదని, ఇదే సమయంలో మేడిగడ్డ నుంచి దిగువకు 255 టీఎంసీల నీళ్లు వృథాగా పోయాయని తెలిపారు. అందుకే మేడిగడ్డ నీటిని అతి తక్కువ ఖర్చుతో, అతి తక్కువ సమయంలో, ముంపు సమస్య లేకుండా శ్రీరాంసాగర్‌కు తరలించేందుకు పునర్జీవ పథకం చేపట్టామన్నారు. రోజుకు ఒక టీఎంసీ చొప్పున 90 టీఎంసీల సాగర్‌ను నింపి ఈ ప్రాజెక్టు పరిధిలో 18లక్షల ఆయకట్టుకు రెండుపంటలకు నీరిస్తామని అన్నారు. రైతాంగం సాధకబాధకాలు తెలిసిన తమ ముఖ్యమంత్రి ఉద్యమస్ఫూర్తితో రిటైర్డ్ ఇంజినీర్లు, అధికారులు, నిపుణులతో చర్చించి కోటి ఎకరాలకు నీరందించేలా ప్రాజెక్టులను రీడిజైన్ చేశారని తెలిపారు. వచ్చే సంవత్సరం రాష్ట్రంలో వ్యవసాయానికి ప్రత్యేకంగా బడ్జెట్ ప్రవేశపెడుతామని ప్రకటించారు. వచ్చే సంవత్సరం డిండి, పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం పూర్తి చేసి ప్రతి ఎకరానికి నీరిస్తామని తెలిపారు.

సామాజిక ఇంజినీర్ మా కేసీఆర్..

మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ను సామాజిక ఇంజినీర్‌గా అభివర్ణించారు. కేసీఆర్ ఇంజినీరా? అన్న కాంగ్రెస్ ప్రశ్నకు 'అవును ఇంజినీరే.. ఆయన సామాజిక ఇంజినీరు' అని బదులిచ్చారు. తెలంగాణలో ప్రతి నది, చెరువు, కుంట సహా భౌగోళిక పరిస్థితులన్నీ కేసీఆర్‌కు తెలుసునన్నారు. ఆ అవగాహనతోనే రోజుకు 18గంటల పాటు నిపుణులు, ఇంజనీర్లతో సమావేశాలు నిర్వహించి కోటి ఎకరాలకు నీరు అందించే విధంగా ప్రాజెక్టులను రీడిజైన్ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రాజెక్టులన్నీ కాగితాల్లోనే ఉన్నాయని..వాళ్లు ప్రతిపాదించిన తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీయే నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. అయినా ఒక్క ఎకరానికి కూడా నీరివ్వకుండానే ప్రాణహిత-చేవెళ్ల పేరుతో రూ.8వేల కోట్లు గంగ పాలు చేశారన్నారు. వాళ్ల హయాంలో కాకతీయ కాలువ ద్వారా 9.11లక్షల ఎకరాలకు నీరివ్వాల్సి ఉంటే ఏనాడూ 6 లక్షలకు మించలేదని అన్నారు. పునర్జీవ పథకం ద్వారా 5.36లక్షల ఎకరాలకు అదనంగా కలుపుకొని మొత్తం 9లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు.

పవర్ లేకనే ఆ పరేషాన్..

ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు పవర్‌పోయి పరేషాన్‌లో ఉన్నారన్నారు. అందుకే సోయి తప్పి మాట్లాడుతున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిందని, ఇందులో ముఖ్యమైన నీళ్లు అందించడానికే సీఎం కేసీఆర్ ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సభల్లో చెప్పిన విధంగానే కోటి ఎకరాలకు నీరందించటంలో భాగంగా పునర్జీవం పథకం చేపట్టారని తెలిపారు.

రైతులను రెచ్చగొట్టడానికే....

రైతులను రెచ్చగొట్టడానికే కోదండరాం యాత్రలు చేస్తున్నట్టుగా ఉందని మంత్రి పోచారం అన్నారు. కోదండరాం మాటలు.. కాంగ్రెస్ నాయకుల మాటలు ఒకే తీరుగా ఉంటున్నాయన్నారు. ప్రాజెక్టులను అడ్డుకుంటే రైతులు ఊరుకోరని, అందుకే స్వచ్ఛందంగా వచ్చి యాత్ర తమ ప్రాంతంలో అవసరంలేదని అడ్డుకున్నారని అన్నారు.



మహిళా సంఘాలకు ట్యాబ్‌లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే మొబైల్ ద్వారా మహిళా సంఘాలకు సేవలను అందిస్తున్న సెర్ప్.. ట్యాబ్‌లను కూడా అందజేయాలని సూత్రాప్రాయంగా నిర్ణయించింది. ఒక్కోగ్రామ సమాఖ్య సంఘానికి ఒక ట్యాబ్ చొప్పున ఇవ్వనున్నారు. ఈ ట్యాబ్‌లను గ్రామ సమాఖ్య సంఘం సహాయకులు (వీవోఏ)లకు అప్పగించనున్నారు. సంఘానికి సంబంధించిన అన్ని రకాల వివరాలు, సమాచారం, సేవలను ట్యాబ్ ద్వారా వినియోగించాలని సెర్ప్ అధికారులు ప్రతిపాదించారు. దీంతో త్వరలోనే సంఘాలకు ట్యాబ్‌లు అందనున్నాయి. ట్యాబ్‌లకు ఇంటర్నెట్ కనెక్షన్ ఇచ్చిన తర్వాత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన వెబ్‌సైట్‌లను అనుసంధానం చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వీవోఏలకు రూ.3 వేలు గౌరవ వేతనాన్ని ప్రకటించింది. గ్రామస్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ చేపట్టే ప్రతి కార్యక్రమంలో వీవోఏలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించింది. ఉపాధి హామీ, హరితహారం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వంటి పథకాల్లో వీవోఏల సేవలు వినియోగించుకోవాలని ఇప్పటికే సెర్ప్ ఆదేశాలు జారీచేసింది.

విదేశీ విద్యాపథకానికి 20 మంది ఎంపిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ద్వారా వివేకానంద విదేశీ విద్యాపథకానికి శుక్ర, శనివారాల్లో నిర్వహించిన ఇంటర్వ్యూలలో 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, అమెరికా తదితర దేశాల్లో ఎమ్మెస్ చదువుకునేందుకు విద్యార్థులు పెట్టుకున్న దరఖాస్తులు, సర్టిఫికెట్లను పరిశీలించారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్ కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ పురాణం సతీశ్, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి సముద్రాల వేణుగోపాలాచారి, డాక్టర్ సువర్ణ సుమలత, పరిషత్తు సీఈవో చంద్రమోహన్‌తోపాటు పలువురు నిపుణులు దేవాదాయశాఖ కమిషనరేట్‌లో విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన 20 మంది విద్యార్థులకు రూ.4కోట్ల వరకు ట్యూషన్ ఫీజును పరిషత్తు చెల్లిస్తుంది. ఈ ఫీజులు ఒకేకోర్సుకు ఆస్ట్రేలియాలో ఓ రకంగా, జర్మనీలో మరో రకంగా ఉన్నందున, ఆయా దేశాల లెక్కల ప్రకారం ట్యూషన్ ఫీజులు చెల్లించనున్నారు.

అమెరికా కాన్సుల్ జనరల్‌లో ఉద్యోగాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో తొమ్మిది క్యాటగిరీల్లో కొలువుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. గచ్చిబౌలిలో నిర్మిస్తున్న నూతన ఓవర్సీస్ బిల్డింగ్ ఆపరేషన్స్ కార్యాలయంకోసం ఎనిమిది క్యాటగిరీల్లో కొలువులను భర్తీ చేయనున్నారు. రవాణా సేవలకు సంబంధించిన క్లర్క్, మెకానికల్ ఇంజినీర్, ఎలక్ట్రికల్ ఇంజినీర్, సివిల్ ఇంజినీర్, ఫారిన్ సర్వీస్ నేషన్ ఇన్వెస్టిగేటర్లలో ఒకటి చొప్పున, రెండు డ్రైవర్, మరో రెండు అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ఖాళీలు ఉన్నాయి. ఒడియా భాష సేవలకు సంబంధించిన ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ ఖాళీ ఒకటి ఉంది. దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 16 చివరి తేదీ. విద్యార్హతలు, ఇతర అంశాల గురించి https://in.usembassy.gov/embassy-consulates/jobs లింక్‌లో చూడవచ్చని అమెరికా కాన్సులేట్ అధికారులు తెలిపారు.

కాంగ్రెస్ నాయకులకు మతిపోయింది

- క్షమాపణ యాత్రలు చేయండి
- ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ హితవు
- సీఎం కేసీఆర్.. సమాజాన్ని మార్చే ఇంజినీర్ అని వ్యాఖ్య



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎస్సారెస్పీ పునర్జీవ సభ విజయవంత కావడంతో కాంగ్రెస్ నాయకుల మతిపోయిందని, అందుకే అడ్డగోలుగా మాట్లాడుతున్నారని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. గతంలో చేసిన పాపాలకు కాంగ్రెస్ నాయకులు ముందుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్తూ పాదయాత్రలు చేయాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఏనాడూ ప్రజలు, సమాజం గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కానీ, సీఎం కేసీఆర్ సమాజాన్ని మార్చే సోషల్ ఇంజినీర్‌గా ఉన్నారని చెప్పారు. శనివారం టీఆర్ ఎస్ ఎల్పీ కార్యాలయంలో ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఎస్సారెస్పీ కింద ఏనాడూ మూడు, నాలుగు లక్షల ఎకరాలకు కూడా నీరు అందలేదన్నారు. పునర్జీవ సభకు ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి కాంగ్రెస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. పునర్జీవంతో ఎస్సారెస్పీ ద్వారా 16 లక్షల ఎకరాలకు నీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఉత్తర, దక్షిణ తెలంగాణ పేరుతో రైతుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం కాంగ్రెస్ నాయకులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. డిండి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులపై కాంగ్రెస్ నాయకుల వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. వారి వైఖరి చూస్తుంటే వంద ఆవులను తిన్న పులి గోయజ్ఞం చేసినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు.

375 కోట్లతో రైతు మీటింగ్ హాళ్లు

- రాష్ట్రవ్యాప్తంగా 2,500 హాళ్ల నిర్మాణం
- ఒక్కోదానికి రూ.15 లక్షల కేటాయింపు
- ఈ ఏడాది నుంచే స్థలాల సేకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయరంగాన్ని లాభాలబాటలో నడిపించేందుకు ఇప్పటికే అనేక వినూత్న కార్యక్రమాలు ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నది. రైతులకు వ్యవసాయ రంగంపై విస్తృత అవగాహన కల్పించేందుకు రూ.375 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 2,500 రైతు సమావేశ మందిరాలను నిర్మించాలని తలపెట్టింది. రూ.15 లక్షల వ్యయంతో ప్రతిమూడు నాలుగు గ్రామాలకు ఒకహాలు చొప్పున నిర్మించాలని నిర్ణయించింది. అరెకరంలో దాదాపు ఐదారు వందల మంది రైతులు కూర్చునేలా వీటి నిర్మాణాలు జరుగనున్నాయి. ఈ ఏడాది నుంచే స్థలాల సేకరణ జరిపి, వీలైనంత త్వరగా నిర్మించాలని ప్రణాళిక రచించింది. వ్యవసాయ విస్తరణాధికారి(ఏఈవో) పరిధిని యూనిట్‌గా నిర్ణయించి, వారి కేంద్రంగా ఉండే గ్రామంలో ఈ మందిరాలు నిర్మిస్తారు. సాధారణంగా ఒక ఏఈవో మూడునాలుగు గ్రామాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. రైతులకు సంబంధించిన ప్రతీ కార్యక్రమాన్ని, పథకాలను ఏఈవో కేంద్రంగానే అమలుచేస్తారు. దీంతో ఏఈవో యూనిట్ గ్రామాల్లో అరెకరం స్థలాన్ని గుర్తించాలని వ్యవసాయశాఖ ఇప్పటికే క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేసింది. గ్రామాల్లో స్థల సేకరణ సులువు కానుండటంతో త్వరలోనే గుర్తించి నిర్మాణాలు చేపడుతారు. ప్రతీరైతుకు రెండు సీజన్లకు కలిపి ఎకరానికి రూ.8వేల చొప్పున వ్యవసాయ పెట్టుబడిగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి రైతు సమాఖ్యలు ఏర్పాటుకానున్నాయి. తాజాగా రైతు సమావేశ మందిరాల్లో శిక్షణతోపాటు ధాన్యం సేకరణ కూడా జరుగనున్నది. రైతుకు కష్టమొచ్చినా నష్టమొచ్చినా అధికారులు అక్కడే చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. గ్రామ, మండల రైతు సమాఖ్యలు ఏర్పాటయ్యాక వాటి కార్యకలాపాలు కూడా ఈ రైతు సమావేశ మందిరాల్లోనే ఉంటాయని అధికారులు చెప్తున్నారు. అందువల్ల వచ్చే ఆర్థికసంవత్సరంలోనే వీటి నిర్మాణాలు పూర్తిచేయాలని వ్యవసాయశాఖ భావిస్తున్నది.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం, 13 ఆగస్టు 2017
WWW.NTNEWS.COM

రైతు రాజ్యమంటే ఇదే.. ఇదే..

వ్యవసాయం



రవి పూరేటి

పూర్వం వ్యవసాయం ఒక వ్యాపారం కాదు, అదొక జీవన సరళి. సమాజంలో గౌరవానికి వ్యవసాయం ఒక ఉదాహరణ. ఎప్పుడూ డబ్బులకు వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకునేవారు కాదు. వస్తు, పంట మార్పిడితోనే జీవనం సాగించారు. పూర్వకాలంలో 'ఉత్తంకేతి మద్యంవాన్ కరె చాకిరి కుకర్ నినాన్' అనే హిందీ నానుడి ప్రచారంలో ఉండేది. దీనికి అర్థం.. 'వ్యవసాయం ఉత్తమం, వ్యాపారం మధ్యమం, ఉద్యోగం అధమం'. అలాంటి ఉత్తమమైన అన్నదాత కాల క్రమేణా స్వార్థ రాజకీయాల వల్ల అడుక్కునే పరిస్థితికి వచ్చాడు. గతంలో రైతులను రాళ్ళతో కొట్టించారు కొందరు, వ్యవసాయం దండుగ అన్నారు మరికొందరు. కానీ రైతును రాజును చేయాలని, వ్యవసాయాన్ని పండుగ చేయాలని వ్యూహాలు రచిస్తున్నారు ముఖ్యమంత్రి కేసీఆర్. రైతులు గర్వపడే విధంగా బతుకాలె అని భావించి రైతు సమాఖ్యలకు బీజం పోశారు. ఇప్పుడు అందరి దారి వ్యవసాయం వైపు, అందరి చూపు తెలంగాణ వైపు.

రైతు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి రావాలంటే పరిపాలనా వ్యవస్థలో మార్పు రావాలె. అందుకు రైతు కష్టం తెలిసిన ఆయన ముఖ్యమంత్రిగా ఉండటం మన తెలంగాణ రైతులు చేసుకున్న అదృష్టం. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు, రైతు దేశానికి వెన్నెముక అని చెప్పుకోవడానికి మాత్రమే పనికొచ్చే సామెతలు. ఎందుకంటే అంత ముఖ్యమైన గ్రామాలను, రైతులను పట్టించుకున్న దాఖాలాలు గతంలో లేవు. అందుకే గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించాలి. వ్యవసాయం లాభసాటిగా మారాలంటే పంటల ధరలను నిర్ణయించే శక్తి రైతులకే ఉండాలి. ఈ విషయాలను రైతు కోణంలో ఆలోచించిన మొట్టమొదటి రైతు ముఖ్యమంత్రి మన కేసీఆర్.

రైతుల సంక్షేమం కోసం దూరదృష్టితో రైతు రుణమాఫీ చేశారు ముఖ్యమంత్రి కేసీఆర్. చెరువులకు మిషన్ కాకతీయ ద్వారా జలకళ తెప్పించి పంట పొలాలకు మళ్ళించారు. గతంలో రైతులు కరెంట్ కోసం పొలాల గట్టున కటిక చీకట్లో కునుకుతీసి కరెంటు షాక్ వల్ల లేదా పాము కాటుకు ప్రాణాలు కోల్పోయేవారు. నేడు రైతన్నలకు సమృద్ధిగా, నాణ్యమైన కరెంటు ను అందిస్తున్నారు. రైతన్నలు భార్యాపిల్లలతో ఇంటికాడనే హాయిగా పడుకునే రోజు లు వచ్చాయి. అంతేకాదు పంటల పెట్టుబడికి రైతన్నలు అప్పులపాలు కాకూడదని సంవత్సరానికి పంటలకు కావలసిన ఎరువులు, విత్తనాలకు ఎకరానికి 8 వేల రూపాయలు ప్రభుత్వమే అందించడం కేసీఆర్ రైతు హృదయానికి దర్పణం.

రైతు శక్తిమంతుడు కావాలంటే మొదట రైతులు సంఘటితం కావాలనేది గొప్ప ఆలోచన. ఈ సంకల్పంతో రైతు సంఘాలను ఏర్పాటుకు దిశానిర్దేశం చేస్తున్న మన ముఖ్యంత్రికి రాజకీయాలకతీతంగా అందరూ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉన్నది. ఎందుకంటే సాధారణంగా స్వార్థ రాజకీయ నాయకులు రైతులను పార్టీల పరంగా, కులాల పరంగా, నీళ్ళపరంగా, నేల పరంగా వేరుచేసి ఓట్లకు వాడుకున్నారే తప్ప వారిని సంఘటితం చేసి ప్రగతి బాటలో నడిపించలేదు. ఒక రైతే ముఖ్యమంత్రిగా ఉండి రైతులకు పెద్దన్నగా వ్యవహరిస్తున్నారు. కేసీఅర్ నిజాయితీగా నిష్పక్షపాతంగా అవినీతి లేకుండా, రైతుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నారు.

రైతులకు పంట తోడ్పాటు ఇవ్వాలంటే, వారి లెక్క తేలాలె. కేసీఆర్ రైతు సమాఖ్యలను ఏర్పాటు చేయడానికి కూడా రైతుల వివరాలు ఉండాలె. అందువల్ల మొదట సర్వేలను నిర్వహించారు. దీనిలో భాగంగా మొదట గ్రామస్థాయిలో ఉన్న రైతులను గుర్తించి గ్రామ రైతు సంఘాలను ఏర్పాటుచేస్తారు. అదేవిధంగా వీరికి ఎప్పటికప్పుడు సహకారం అందించడానికి గ్రామ స్థాయిలో ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తారు. గ్రామ రైతు సంఘాల ప్రతినిధులతో మండల స్థాయిలో ఒక మండల రైతుసంఘాన్ని ఏర్పాటుచేస్తారు. ఈ మండల రైతు సంఘం ఆ మండలంలోని అన్ని గ్రామ రైతు సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తూ జవాబుదారీగా ఉంటుంది. ఈ విధంగా ఒక జిల్లాలోని అన్ని మండలాల రైతు సంఘాలు కలిసి జిల్లా రైతు సంఘంగా ఏర్పడుతాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని రైతుసంఘాల ప్రతినిధుల సమాహారంగా రాష్ట్రస్థాయిలో రైతు సమాఖ్యను ఏర్పాటుచేస్తారు.

ఈవిధంగా రైతుసంఘాల ఏర్పాటు దేశ చరిత్రలో నూతన ఒరవడిగా చెప్పవచ్చు. ఎందుకంటే దేశంలోని ఇతర రాష్ర్టాల్లో కానీ లేక గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కానీ బ్యాంకు రుణాల కోసం మాత్రమే రైతుసంఘాలను ఏర్పాటుచేశారు. దాని లో కూడా రైతులందరు సభ్యులుగా లేరు. గ్రామ స్థాయిలో మాత్రమే రైతు సంఘం ఉండేది. అది పరిమితమైన పాత్ర పోషించేది.

రాష్ట్రస్థాయిలో ఏర్పడే రాష్ట్ర రైతు సమాఖ్యకు 500 కోట్లతో మూలనిధి ఏర్పాటుచేస్తామని సీఎం కేసీఆర్ చెప్పారు. ఇది కూడా ప్రశంసనీయమైన చర్య. దీన్నిబట్టి రైతు సమాఖ్యల ఏర్పాటులో, వాటి విధి నిర్వహణలో, రైతుల అవసరాలు తీర్చడంలో ముఖ్యమంత్రికి ఎంత దూరదృష్టి, స్పష్టత ఉన్నదో తెలిసిపోతున్నది. రాష్ట్రస్థాయిలోని రాష్ట్ర రైతు సమాఖ్యకు ముఖ్యమంత్రి స్థాయి పరపతి ఉంటుందని స్వయంగా కేసీఆర్ చెప్పడం రైతులపై ఆయనకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తున్నది.

అన్ని స్థాయిల్లోని రైతు సంఘాలు వ్యవసాయానికి సంబంధించిన ప్రతి దశలోనూ ఎక్కడికక్కడ అంకితభావంతో పనిచేయాలె. అన్నదాతకు మేలు చేసే కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ వ్యవసాయానికి సంబంధించి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను అమలుచేసి రైతుల అభివృద్ధికి పాటు పడాలి. అప్పుడే కేసీఆర్ కలలుగన్న రైతు రాజ్యం సిద్ధిస్తుంది. రాష్ట్ర రైతు సమాఖ్యకు 500 కోట్లతో మూ నిధి ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర రైతు సమాఖ్యను ఆర్థికశక్తిగా మార్చితే, రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. సరైన గిట్టుబాటు ధర రానిపక్షంలో రైతు సంఘాలకే పర్మిట్లు ఇచ్చి ప్రాసెసింగ్ చేసే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమ ప్రత్యేకత.

రైతుకు ఎకరానికి రెండు పంటలకుగాను ఎనిమిది వేల పెట్టుబడిని అందించడం వల్ల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం తప్పుతుంది. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా రైతుసంఘాలు, ఇతర అధికారులు అంకితభావంతో పని చేస్తే రాను న్న రోజుల్లో రైతులు ఆశించేస్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదుగుతారనడంలో సందేహం లేదు.

రైతులు కూడా పాత మూస పద్ధతులను వీడి ఆధునిక శాస్త్రీయ పద్ధతులను అలవాటు చేసుకోవడం ఈ సమయంలో ఎంతైనా అవసరం. రైతులంతా ఓకే పంట వేయడంతో ఉత్పత్తి పెరిగి సరైన ధర రాక నష్టపోతున్నారు. కాబట్టి మనకు ఏది అవసరమో, ఎంత అవసరమో ఏ పంటకు డిమాండ్ ఉన్నదో అదే వేసేవిధంగా ప్రతి గ్రామంలో రైతులు తమ భూములను క్రాప్ కాలనీలుగా మార్చుకోవాలి. అసంఘటితంగా ఉన్న రైతులను సంఘటితంగా చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరు ఆహ్వానించాలి. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు ముఖ్యమంత్రి నిర్దేశించిన మార్గాన్ని అనుసరించాలె. ఇందుకు అధికారులు కూడా ఎప్పటికప్పుడు తగిన కార్యాచరణను రైతులకు సూచించాలె. వ్యవసాయంలో నూతన పద్ధతులను అనుసరిస్తే లాభసాటిగా మారుతుంది. దశాబ్దాల తరబడి రైతులు ఎదుర్కొంటున్న దోపిడీ నుంచి విముక్తి లభిస్తుంది.

రైతు సంఘాలను శక్తివంతమైన సంస్థలుగా చేయాలంటే పక్కా ప్రణాళికతో కార్యక్రమాలను నిర్వహించాలి. సంక్షేమ పథకాలపై సమావేశాలు ఏర్పాటుచేసి రైతులకు అవగాహన కలిగించాలి. క్రాప్ కాలనీలు, ఎకరానికి 8 వేల రూపాయల పెట్టుబడి, వాతావరణ పరిస్థితులు, పంటల రకాలు, సేంద్రియ పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాలు, మూలనిధి వినియోగం, పంటల బీమా, పంటల స్టోరేజీ, సాగునీటి వాడకం, వ్యవసాయంలో నూతన పద్ధతులు, శాస్త్రీయ విధానాలు, భూమి రకాలు, సొంత విత్తనాల ఏర్పాటు, దళారీ వ్యవస్థ నిర్మూలన మొదలైన అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలె. ప్రతికూల పరిస్థితుల్లో రైతు నిబ్బరంగా ఉండటం ఎట్లనో వివరించాలె. ఎగుమతి చేసే పంటలు, పండ్లు, కూరగాయల సాగు, హార్టికల్చర్ సాగు పద్ధతులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి. ఈ అవగాహనా కార్యక్రమాల్లో రైతు సంఘాలది కీలక పాత్ర చేయాలె.

తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి తమ మాట నిలబెట్టుకుంటున్నారనడానికి అనేక ఉదాహరణలు ఇవ్వొచ్చు. ఈ యాసంగిలో రికార్డు స్థాయిలో వచ్చిన పంట దిగుబడులే సర్కారు పనితీరుకు నిదర్శనం. 36 లక్షల మంది రైతులకు 17 వేల కోట్ల రుణాలు మాఫీ చేసిన ఘనత దేశంలో మరే రాష్ర్టానికి లేదు. రైతుల సంక్షేమం కోసం ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారు. పురుగు మందుల కల్తీని అరికట్టారు. కరెంటు బాధలు లేకుండా చేశారు. నీటి పారుదల రంగాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈ విధంగా రైతు సంక్షేమం కోసం అన్ని విషయాల్లో పెద్దన్నలాగా ఆలోచిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దేశానికే కాదు, ప్రపంచానికే ఆదర్శం.

> తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి తమ మాట నిలబెట్టుకుంటున్నారనడానికి అనేక ఉదాహరణలు ఇవ్వొచ్చు. ఈ యాసంగిలో రికార్డు స్థాయిలో వచ్చిన పంట దిగుబడులే సర్కారు పనితీరుకు నిదర్శనం. 36 లక్షల మంది రైతులకు 17 వేల కోట్ల రుణాలు మాఫీ చేసిన ఘనత దేశంలో మరే రాష్ర్టానికి లేదు. రైతుల సంక్షేమం కోసం ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారు. పురుగు మందుల కల్తీని అరికట్టారు. కరెంటు బాధలు లేకుండా చేశారు. నీటి పారుదల రంగాన్ని తీర్చిదిద్దుతున్నారు.

పరిహసించడం మానండి

ఉద్యమం



ప్రొఫెసర్
ననుమాస స్వామి

'ఉద్యమం ఏ ఒక్కని సొత్తో గాదు' అంటూ మేచినేని కిషన్‌రావు పత్రికలకెక్కి నిప్పులు పోయడం బాధాకరం. ప్రజల భావాలను పరికించి పరిపాలించేవారే ప్రభువులు. ఉద్యమంలో కేసీఆర్ ఆమరణదీక్ష చేపట్టి రాష్ట్ర సాధనకు కారణమయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రజల కోసం ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ప్రజా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారు. తన మనశ్శాంతిని కోల్పోయి రైతులకు మనశ్శాంతిని కలుగజేస్తున్న మానవతావాది. కాంగ్రెసేతర పార్టీలతో 1977లో జనతా ప్రభుత్వం ఏర్పడ్డప్పు డు మొదలైంది రుణమాఫీ ప్రక్రియ. దీన్ని ఆ తర్వాత జనతాదళ్ ప్రభుత్వం చేపట్టి రైతాంగాన్ని ఆదుకోలేదా? వ్యవసాయం దండుగన్న నారా చంద్రబాబునాయుడు, ఒక్క పైసా తెలంగాణ అభివృద్ధికి ఇవ్వనుగాక ఇవ్వనన్న కిరణ్‌కుమార్‌రెడ్డి కంటే ఉత్తమ ముఖ్యమంత్రి కేసీఆర్.

గత పాలనలో రాజధాని నగర ప్రజలదాహం తీర్చని పరాయి పాలనకంటే ఎక్కువగా నగరాన్ని జలమయం చేసి భగీరథ మిషన్ ద్వారా పల్లెపల్లెకు మంచినీటిని అందిస్తున్నా, మిషన్‌కాకతీయ పథకంతో వేలాది చెరువులు నింపి సస్యశ్యామలం చేసినా, ధృతరాష్ట్రుల్లా మిగిలారే మీరు! మీరా తెలంగాణ ముఖ్యమంత్రిని విమర్శించేది? అదీ 1969 ఉద్యమాన్నిఅడ్డం పెట్టుకొని బరితెగిస్తారా! ఆత్మవిమర్శ చేసుకోకుండా పరనిందకు పాల్పడుతారా! టీఆర్‌ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శినంటూ సాక్షాత్తూ స్థాపక-అధ్యక్షుల మీదనే రాళ్లేస్తారా? ఈ విమర్శలు కేసీఆర్‌నే కాదు, ప్రజల గుండెలను కూడా గాయపరుస్తాయి. ప్రజల విజ్ఞతను కించపరుచడం లేకితనానికి నిదర్శనం.

1969 ఉద్యమానికి మీకేం సంబంధం? 1969 తొలి తెలంగాణ ఉద్యమ చరిత్రను విశ్లేషిస్తే అందులో మీ పాత్ర ఏమిటో ప్రజలకు తెలుస్తుంది. 1969 ఉద్యమం ఉవ్వెత్తున సాగుతుంటే నీవు అప్పుడు తెలంగాణలోనే లేవు కదా! ఉంటే ఏ జైలులో శిక్ష అనుభవించావు? 369 ఉద్యమకారులు ప్రత్యేక తెలంగాణ కోసం ప్రాణాలర్పిస్తే స్పందించని నీకు 1969 ఉద్యమానికి సంబంధం ఎక్కడిది? కేసీఆర్ 1969 తొలి తెలంగాణ పోరాట యోధులను గుర్తిస్తున్నారు. కానీ వారికి లబ్ధి చేకూర్చకుండా ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని నీవు మంటగలుపడం లేదా!

మీలాగా తెలంగాణ నాయకునిగా ముసుగేసుకొని కేసీఆర్ తెరపైకి రాలేదు. టీఆర్‌ఎస్ పార్టీని స్థాపించి 13 ఏండ్లుగా ఎదుగుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ఎన్నికలకు లెక్కకుమించి అభ్యర్థులను నిలబెట్టి, 63 అసెంబ్లీ సీట్లను గెలిపించుకున్న ధీరోదాత్త నాయకుడు కేసీఆర్. పంచతంత్రంలో నీలి నక్కలాగా 1969 ఉద్యమకారుల సంస్థకు నాయకుడివైనావు. 2013లో తెలంగాణ మూవ్‌మెంట్ డిటెన్యూస్ ఫోరం రిజిష్టర్ చేసుకొని ఆ సంస్థ నాయకులు పింఛన్ కోసం పోరాడుతుంటే ఎక్కడ వెనుకబడి పోతానేమోనని 2015లో నీవు స్థాపించుకున్న సంస్థను రిజిష్టర్ చేసుకున్నావనేది గుర్తుంచుకోండి.

1987 మాదిరిగానే 1991లో అన్నివర్గాలను ఏకతా టిమీదికి తేవడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రధాన గ్రంథాలయంలో సదస్సు నిర్వహిస్తే కుయుక్తులతో కలిసిరాకుండా ఐక్యతను దెబ్బతీసిందెవరు? ఇతర పార్టీల, సంఘాల నాయకులు ఎంత ప్రచారం చేసినా తెలంగాణ ప్రజలు వారి వెంట నడువలేదెందుకు?

2001లో ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర సాధన కోసం స్థాపించిన పార్టీ తరపున దిగిన అభ్యర్థులు గెలువడం రాష్ట్ర, కేంద్రస్థాయిల్లో తెలంగాణవాదాన్ని బలవత్తరం చేసింది స్వార్థం కోసమేనా? ట్యాంక్ బండ్ మీది విగ్రహాల కూల్చివేతలో కేసీఆర్ లేకపోతే ఆయన నాయకత్వం ఏమైనా బలహీనమైందా?

తెలంగాణ ఉద్యమం క్విట్ ఇండి యా ఉద్యమంలా సాగింది. నాడు భగత్‌సింగ్‌లా తెలంగాణ శ్రీకాంతాచారి బలిదానమయ్యారు. నాటి మహాత్మునిలా అహింసావాదంలో కేసీఆర్ తెలంగాణ పోరాటాన్ని నడిపారని ఎంపీ జితేందర్‌రెడ్డి బుధవా రం (9-8-2017) లోక్‌సభలో చెప్పినప్పుడు హౌజ్‌లో ఉన్న ఎంపీ లందరూ ఉద్విగ్నులయ్యారు. తెలంగాణ సెంటిమెంట్ అంటే అది. కేసీఆర్ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్టుగానే అమరుల కుటుంబాలకు 10 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించారు.1969 ఉద్యమంలో తుపాకీ తూటాలకు దెబ్బతిని బతుకుచితికిన యోధులకు 5 లక్ష లు ఇచ్చి ఆదుకున్నారు. జాగృతి సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కూడా బతుకుచితికిన కొందరు యోధులకు 5 లక్షలు ఇచ్చి ఆదుకున్నారు.

అంతర్జాతీయస్థాయిలో అమరులకు స్మృతి కేంద్రం, స్తూపం నిర్మించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లో స్థలాన్ని కేటాయించి పనులు ప్రారంభించారు. పోరాట యోధుల వీరత్వం మరో పోరాటయోధుడు, త్యాగశీలి కేసీఆర్‌కే తెలుస్తుంది. ఆయన తెలంగాణ కోసం త్యాగాలుచేసిన వారిని తప్పకుండా గుర్తిస్తారు. ప్రజలకు న్యాయంచేస్తారు. తొలి, మలి ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకొన్న త్యాగధనులు, ఉద్యమకారులు కలలుగన్న తెలంగాణ రాష్ర్టాన్ని కేసీఆర్ సాధించారు. ఇప్పుడు బంగారు తెలంగాణను సాధించేకాలం ఎంతో దూరం లేదు. బంగారు తెలంగాణ స్వప్నం నెరవేరాలంటే మన ముఖ్యమంత్రి అంతులేని పోరాటం చేయాల్సి ఉన్నది. ప్రగతిరథం రాష్ట్రంలో బలంగానే ఉన్నది. రథానికి పూనిన కేసీఆర్ ఆలోచనల అశ్వాల జవసత్వాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. అవాంతారాలన్నీ దూది పింజాల్లా గాలికి ఎగిరిపోతున్న తరుణంలో దుమ్మూధూళి సృష్టించి శిఖండిలా అడ్డుపడకండి.

> తొలి, మలి ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకొన్న త్యాగధనులు, ఉద్యమకారులు కలలుగన్న తెలంగాణ రాష్ర్టాన్ని కేసీఆర్ సాధించారు. ఇప్పుడు బంగారు తెలంగాణను సాధించేకాలం ఎంతోదూరం లేదు. బంగారు తెలంగాణ స్వప్నం నెరవేరాలంటే మన ముఖ్యమంత్రి అంతులేని పోరాటం చేయాల్సి ఉన్నది. ప్రగతిరథం రాష్ట్రంలో బలంగానే ఉన్నది. రథానికి పూనిన కేసీఆర్ ఆలోచనల అశ్వాల జవసత్వాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. అవాంతారాలన్నీ దూది పింజాల్లా గాలికి ఎగిరిపోతున్న తరుణంలో దుమ్మూధూళి సృష్టించి శిఖండిలా అడ్డుపడకండి.



జబ్ హారీ మెట్ సెజల్
- అనుష్క శర్మ ఉంగరం పోయింది!
- ఇంతియాజ్ అలీ స్క్రిప్టు పోయింది!
- షారూక్ ఖాన్ పరువు పోయింది!
- ప్రేక్షకులకు మతిపోయింది!

ఆర్నాబ్ గోస్వామి



గోరఖ్‌పూర్ బీఆర్‌డీ వైద్య కళాశాలలో గత ఆరేండ్లలో మూడువేల మందికి పైగా పిల్లలు మరణించారనేది హిందుస్థాన్ టైమ్స్ పత్రికలో వచ్చిన వార్త. ఈ పిల్లల మరణాల సంఖ్య మనను కొంచెమైనా కదిలించాలె. ఈ మరణాల తరువాతనైనా మౌలిక మార్పు వస్తుందని ఆశిద్దాం.

స్మిత బరూవా



అయోధ్య వివాదం తేలాలనే నా మౌలిక లక్ష్యం నెరవేరుతున్నది. వివాదంపై విచారణ ప్రారంభమైంది. తదుపరి తేదీ: డిసెంబర్ ఐదు. న్యాయస్థానం చివరికి నా వాదన వింటుంది.

సుబ్రమణ్యస్వామి



అందరి దృష్టి వందేమాతరం మీద ఉన్నప్పుడు, గోరఖ్‌పూర్ మరణాల మీదికి ఎందుకు దృష్టి మళ్ళిస్తున్నారు అని ఒక న్యూస్ యాంకర్ అన్నారు. ఇక మీడియాను దేవుడే కాపాడాలె!

రాజ్‌దీప్ సర్దేశాయి

అధ్యయన, అధ్యాపనశీలి

సాహిత్యం



ఆచార్య
పిల్లలమర్రి రాములు

తెలుగు సాహిత్య ప్రపంచంలో తమకంటూ విశిష్ట స్థానాన్ని సముపార్జించుకున్న పండిత పరిశోధక వతంసులు ఆచార్య రవ్వా శ్రీహరిగారు. తెలుగు, సంస్కృత సాహిత్య అధ్యయన, అధ్యాపనలతో పాటు 'శ్రీహరి నిఘంటు' నిర్మాణం, పాణినీయ అష్టాధ్యాయికి విపుల వ్యాఖ్యానం సమకూర్చడం ద్వారా ఇరుభాషల సాహిత్యాధ్యయనానికి ఉదాత్త బాటలు వేసిన ఉత్తమ అధ్యాపకులు.

ప్రారంభించిన అధ్యయనం సంస్కృతమే అయినా, తెలుగు సాహిత్యంలో భాస్కర రామాయణం-సవిమర్శక పరిశీలనం అనే అంశంపై ఆచార్య బిరుదురాజు రామరాజుగారి పర్యవేక్షణలో సిద్ధాంత వ్యాసాన్ని రూపొందించి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందిన మాతృభాషాభిమాని. ఆచార్య రవ్వా శ్రీహరి సాహితీ జీవనం త్రివేణి సంగమంలా కొనసాగింది. సంస్కృత సాహిత్యాధ్యయనం, తెలుగు సాహిత్య పరిశోధన, బోధనానుభవం ఆచార్య రవ్వా శ్రీహరి జీవితంలో అవిభాజ్య అంశాలు.

1943 మే 5న యాదాద్రి జిల్లాలోని వలిగొండ మండలం వెల్వర్తి గ్రామంలో వేంకటనరసమ్మ, రవ్వా నరసయ్య దంపతులకు శ్రీహరి జన్మించారు. చిన్న వయసులోనే తల్లి మరణించడం జీవితానికి ఆశనిపాతం. శ్రీహరి ఆమె కోసమే ప్రత్యేకంగా సంస్కృతంలో మాతృగీతం అనే శతక రచన చేసి ఆ మాతృమూర్తిని చిరస్మరణీయం చేశారు.

శ్రీహరి ప్రాథమిక విద్య పూర్తయ్యేకాలం (1952) నాటికి పూర్వ నల్లగొండ జిల్లా మొత్తంలో మూడే ఉన్నత పాఠశాలలుండేవట. నల్లగొండ, సూర్యాపేట, భువనగిరిలలో. ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోవడం వల్ల, తల్లి చిన్ననాడే పరమపదించడం వల్ల చదువుకు అంతరాయం ఏర్పడుతుందని భయపడ్డారు. ఇంతలో ఫీజులు లేకుండా భోజనా సౌకర్యంతో చదువు చెబుతామని శ్రీ యాదగిరి లక్ష్మీనృసింహస్వామి సంస్కృత విద్యాపీఠం వారి ప్రకటన తెలియవచ్చింది. శ్రీహరి తమ సహచరులతో కలిసి యాదగిరిగుట్టలో సంస్కృత విద్యాపీఠంలో ప్రవేశించి సంస్కృతంలో ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. అక్కడి నుంచి ప్రారంభమైన సంస్కృతాధ్యయనం సికింద్రాబాద్‌లోని మున్నాలాల్ సంస్కృత కళాశాలలో ఒక రూపాన్ని సంతరించుకున్నది. సీతారాం బాగ్లోని వేదాంత వర్ధినీ సంస్కృత కళాశాలలో కోయిల్‌కందాడై శఠగోప రామానుజాచార్యుల వద్ద 1958-62 వరకు జరిపిన అధ్యయనం తమ జీవితానికే వెలుగును ప్రసాదించిందని పలుమార్లు గుర్తుచేసుకున్నారు. తదనంతరం ఎం.ఏ. సంస్కృతం రాసి, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై బంగారు పతకాన్ని సాధించారు.

హైదరాబాద్‌లోని వివేకవర్ధినీ కళాశాలలో అధ్యాపకునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన శ్రీహరి సారస్వత పరిషత్తు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ విశ్వవిద్యాలయాలలో ఆచార్యులుగా వ్యవహరించి, కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా తమ విశేష సేవలు అందించారు. విశ్వవిద్యాలయ బోధన కొనసాగుతున్న సమయంలోనే నిరంతర పరిశోధనతో అనేక గ్రంథాలను రచించారు. లఘు సిద్ధాంత కౌముదికి వ్యాఖ్య, వ్యాకరణ పదకోశం, సంకేత పదకోశం, అలబ్ధ కావ్యపద్య ముక్తావళి, ముకుంద విలాసం, సంస్కృతసూక్తి ముక్తావళి, తెలుగు కవుల సంస్కృతానుకరణలు, వాడుక తెలుగులో అపప్రయోగాల లాంటి రచనలతో తమ పరిశోధనా సక్తి నిరుపమానమని నిరూపించారు.

తెలుగు సాహిత్య పరిశోధకుల్లో వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, మానవల్లి రామకృష్ణ కవిగారు, నిడుదవోలు వేంకటరావుగారు ప్రాత:స్మరణీయులు అని భావిస్తారు రవ్వా శ్రీహరి. తొలిదశలో వీరి రచనలను అధికంగా అధ్యయనం చేయడం వల్ల ఆ రచనల స్ఫూర్తితో సాహిత్య చరిత్రకు ఉపకరించే రీతిలో 'అలబ్ధ కావ్య ముక్తావళి' అనే గ్రంథాన్ని సంకలనం చేశారు. తెలుగు సాహిత్యంలో నేటికీ లభ్యం కాని ఎర్రన రామాయణం, అధర్వణ భారతం మొదలైన గ్రంథాలకు చెందిన పద్యాలను వివిధ ఆకరాల ఆధారంగా సేకరించి ఈ గ్రంథంలో కూర్చారు. సుమారు వంద గ్రంథాల నుంచి పద్యాలు సేకరించి రూపొందించిన ఈ గ్రంథాన్ని తమ గురువైన ఆచార్య బిరుదురాజు రామరాజుకు అంకితంచేసి అభిమానాన్ని చాటుకున్నారు.

16 ఏండ్ల చిరుప్రాయంలోనే ధూర్జటి కాళహస్తీశ్వర శతకాన్ని సంస్కృతంలోకి అనువదించాలని సంకల్పించి కొన్ని పద్యాలను అనువదించారు. ఆ తర్వాత సృజన సాహిత్యాన్ని అనువదించడానికి ఈ ప్రాథమిక కృషి పునాది వేసింది. రవ్వా శ్రీహరి మహాకవి గుర్రం జాషువాగారి ఫిరదౌసి కావ్యాన్ని ఫిరదౌసి పేరుతోనూ, గబ్బిలం కావ్యా న్ని తైలపాయికా అనే పేరుతోనూ, సినారెగారి ప్రపంచపదులను ప్రపంచపదీ పేరుతో, వేమన, నృసింహ శతకాలనూ సంస్కృతంలోకి అనువదించారు. ప్రపంచపదీ అనువాదానికి కేంద్ర సాహిత్య అకాడమీ బహూమానాన్ని పొందారు.

రవ్వా శ్రీహరి 1973లోనే రూపొందించిన సంకేతపదకోశం వివిధ శాస్త్రాల సాంకేతిక పదాలను వివరించే విలక్షణ నిఘంటువు. శ్రీహరి రూపొందించిన గ్రంథాల్లో వ్యాకరణ పదకోశం ఒకటి. ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తంతో కలిసి ఈ పదకోశాన్ని తెలుగు అకాడమీ కోసం తయారుచేశారు. తెలుగు, సంస్కృత వ్యాకరణాల్లోని అనే క పదాలకు వివరణలు సమకూరుస్తూ ఆయన ఈ గ్రంథాన్ని అందించారు.

సంస్కృతాధ్యయనశీలురు అయినా రవ్వా శ్రీహరి మాండలిక పదాల పట్ల, జన వ్యవహారంలోని అభివ్యక్తుల పట్ల ప్రత్యేక మమకారం కలిగినవారు. అందులోనూ తెలంగాణ మాండలికాలంటే శ్రీహరి గారికి అమితాసక్తి. వివిధ వృత్తులకు సంబంధించిన మాండలికాలను సాహిత్య అకాడమీ తయారుచేయించినా ఏ వృత్తులకు సంబంధంలేని మాండలికాలను ఉపేక్షించడం సరైనది కాదని భావించారు. మొత్తం సాహిత్యంలో ఒకే ఒక్కచోట, ఒక్కసారి మాత్రమే ప్రయోగించిన పదాన్ని కూడా నిఘంటువుల్లో చేర్చిన నిఘంటుకారులు లక్షలాది ప్రజల నాలుకల్లో నిత్యమూ వ్యవహారంలో ఉన్న మాండలిక పదాలను ఉపేక్షించడం యుక్తం కాదని భావించి నల్లగొండ జిల్లా మాండలిక పదకోశాన్ని రూపొందించారు. కోశకర్తకు ఉండవలసిన శాస్త్రీయ దృష్టితో కూర్చిన మాండలిక పదకోశమిది.


శ్రీహరి గారి నిరంతర శ్రమకు 'శ్రీహరి నిఘంటువు' నిలువెత్తు సాక్ష్యం. ఈ నిఘంటు నిర్మాణం సమకాలీన సాహితీ ప్రపంచంలో అరుదైన ఘటనగా పేర్కొనాలి. ఏనాడో సాహిత్య అకాడమీ సూర్యరాయాంధ్ర నిఘంటువును నిర్మించి వదిలిన స్థితి నుంచి నిఘంటువులోకి ఎక్కని కొన్నివేల పదాలను తమ శ్రీహరి నిఘంటువులోకి ఎక్కించడం, అన్నమయ్య సాహిత్యంలోని కొన్నివేల పదాలను ఈ నిఘంటువులోకి తీసుకురావడం శ్రీహరిగారి నిరుపమాన పరిశోధనా పాటవానికి నిదర్శనం.

పదవీవిరమణ చేసిన తర్వాత శ్రీహరిగారు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల ప్రధాన సంపాదకత్వ బాధ్యతలు నిర్వర్తించి మహాభారతానికి, మహాభాగవతానికి పలువురు పండితుల చేత వ్యాఖ్యానం సంతరింపజేసి సమన్వయం చేశారు. తాళ్ళపాక అన్నమాచార్య, పెదతిరుమలాచార్య తిరువేంగళనాథాది కవుల సంకీర్తనలకు సమగ్రమైన నిఘంటువును రూపొందించారు. ఈ క్రమంలోనే మారుమూల తెలుగు పదాల మూలాలను వెతకడానికి అవకాశం కలుగడం వల్ల తెలుగు పలుకుబళ్ళ సోయగం, తాళ్ళపాక కవుల కవితా వైదగ్ధ్యమూ, ఆ ప్రాంత ప్రజల వాడుక భాషలోని విలక్షణతా విశదపరుచడానికి తాళ్ళపాక కవుల పదకోశాన్ని రూపొందించారు.

ఇవన్నీ సాగుతుండగానే సంస్కృతంలో పాణిని రచించిన అష్టాధ్యాయికి సుమారు 2 వేల పేజీల్లో వ్యాఖ్యాన్యం సంతరించి సంస్కృత భాషాధ్యయనానికి మార్గం సుగమం చేయడం వారి శిఖరాయమాన పాండిత్యానికి నిదర్శనం. ఇంతటి పరిశోధనా ప్రజ్ఞను ప్రదర్శించినందువల్లే తిరుపతిలోని కేంద్రీయ సంస్కృత విద్యాపీఠం వారు 2011లో మహామహోపాధ్యాయ బిరుదునిచ్చి సత్కరించారు. నేటికాలంలో ఇంతటి విద్వత్తును సంపాదించడం ఒక ఎత్తయితే నిరంతర రచనా వ్యాసంగంతో తమ అధ్యయనశీలతకు సార్థకతను సమకూర్చడం మరొక ఎత్తు.

వయసు పైబడుతున్నా, ఆరోగ్యం సహకరించకపోయినా తరగని ఉత్సాహంతో నిరంతర సాహితీ వ్యాసంగంతో స్ఫూర్తిదాయక తేజోమయ జీవితాన్ని గడుపుతున్న ఈ అసాధారణ అధ్యయన, అధ్యాపనశీలి మరింత ఉత్సాహభరితంగా రచనావ్యాసంగం కొనసాగించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. జీవిక కోసమే తంటాలు పడే దశ నుంచి విద్యారంగంలో అత్యున్నత స్థానాన్ని అధిరోహించి, అత్యుత్తమ గౌరవాలను పొంది తెలుగు జాతికి, తెలంగాణ వైభవానికి నిరుపమాన సేవలందించిన ఆచార్య రవ్వా శ్రీహరి గారి సాహితీ కృషి నిత్యస్ఫూర్తిదాయకం, నిరంతర చైతన్యవాహకం.

(ఆచార్య రవ్వా శ్రీహరి పంచసప్తతి మహోత్సవ సందర్భంగా..)



> ఈ అసాధారణ అధ్యయన, అధ్యాపనశీలి మరింత ఉత్సాహభరితంగా రచనావ్యాసంగం కొనసాగించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. జీవిక కోసమే తంటాలు పడే దశ నుంచి విద్యారంగంలో అత్యున్నత స్థానాన్ని అధిరోహించి, అత్యుత్తమ గౌరవాలను పొంది తెలుగు జాతికి, తెలంగాణ వైభవానికి నిరుపమాన సేవలందించిన ఆచార్య రవ్వా శ్రీహరిగారి సాహితీ కృషి నిత్యస్ఫూర్తిదాయకం, నిరంతర చైతన్యవాహకం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

కన్నడ హీరో ఉపేంద్ర కొత్త రాజకీయ పార్టీ


- పేరు, ఇతర వివరాలు తరువాత వెల్లడిస్తానని ప్రకటన



బెంగళూరు, ఆగస్టు 12: కన్నడ హీరో ఉపేంద్ర కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్టు శనివారం బెంగళూరులో విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన సందేశంతో కూడిన ఆడియో క్లిప్పును విడుదల చేశారు. ఆయన గతకొద్ది రోజులుగా తన రాజకీయ రంగ ప్రవేశంపై పలు సూచనలు చేస్తూనే వస్తున్నారు. ఖాకీ రంగు చొక్కా ధరించి వచ్చిన ఉపేంద్రను ఉద్దేశించి ఆయన అభిమానులు 'రియల్ స్టార్' అంటూ నినాదాలు చేశారు. తాను జన నాయకుడిని, జన సేవకుడిని కాదని.. జన కార్మికుడిననే అర్థం వచ్చేలా ఖాకీ చొక్కా వేసుకున్నానని ఉపేంద్ర తెలిపారు. తాను పూర్తిస్థాయి పారదర్శక ప్రత్యామ్నాయ వేదికను ఏర్పాటు చేస్తున్నానని పేర్కొన్నారు. 'ఇదొక బహిరంగ వేదిక.. దీనికి డబ్బు, కులం లాంటివి అవసరం లేదు. ఎవరైనా చేరవచ్చు' అని ఉపేంద్ర అన్నారు. పార్టీలో చేరే ప్రతినిధులతో సంప్రదింపులు జరిపిన తర్వాత పార్టీ పేరు, ఇతర వివరాలు ప్రకటిస్తానని చెప్పారు. పేదలకు మంచి ఆరోగ్య సదుపాయాలు, విద్యావకాశాలు కల్పించవచ్చని, కానీ ప్రస్తుత పార్టీల నుంచి ఏమీ ఆశించలేమని ఆయన అభిప్రాయపడ్డారు. తనకు చాలా పార్టీల నుంచి ఆహ్వానాలు వచ్చాయని, కానీ వాటిలో చేరితే తాను అందులోని నాయకుల్లా మారిపోవాల్సి వస్తుందని చేరలేదని ఉపేంద్ర వివరించారు.

మంచి మార్పులు తీసుకొస్తా

- సెన్సార్ బోర్డు కొత్త చైర్మన్ ప్రసూన్‌జోషి



న్యూఢిల్లీ, ఆగస్టు 12: తన విధులను నిర్మాణాత్మకంగా సానుకూలంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తానని సెన్సార్ బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రసూన్‌జోషి అన్నారు. వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్న మాజీ చైర్మన్ నిహలానీ స్థానంలో జోషీని కేంద్రప్రభుత్వం నియమించింది. మంచి ఉద్దేశంతో విధులను ప్రారంభిస్తున్నానని, సానుకూల మార్పును సాధించేందుకు అనుభవజ్ఞుల సహకారం తీసుకుంటానని ఆయన తెలిపారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) చైర్మన్‌గా నియమితులైన ప్రసూన్ జోషి రెండు జాతీయ అవార్డులు గెలుచుకున్న ప్రసిద్ధ సినీ గీతరచయిత. ఆయన మూడేండ్లపాటు లేదా ప్రభుత్వ తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ పదవిలో కొనసాగుతారు. ప్రభుత్వం కొత్త సభ్యులతో బోర్డును ఏర్పాటు చేసింది. ఇందులో విద్యాబాలన్, వివేక్ అగ్నిహోత్ర, గౌతమి తడిమళ్ల, నరేంద్ర కోహ్లి, నరేశ్ చంద్రలాల్, నీల్ హెర్బెర్ట్, వామన్ కెంద్రె, టీఎస్ నాగభరణ, రమేశ్ పటాంజే, వాణి త్రిపాఠి, జీవిత రాజశేఖర్, మిహిర్ సభ్యులుగా ఉన్నారు. బోర్డు సభ్యుల వివరాలను ప్రకటించిన అనంతరం జోషి ముంబైలో మీడియాతో మాట్లాడుతూ 'బోర్డులో మంచి వ్యక్తులు సభ్యులుగా ఉండటం శుభపరిణామం. మేమంతా కలిసి గతంలో జరిగిన తప్పులను పునరావృతం కాకుండా చూస్తాం. కొత్త మార్పును తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం. అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు తీసుకుంటాం' అని చెప్పారు. జోషి ఉత్తరాఖండ్‌లోని అల్మోరాలో జన్మించారు. ఆయన రాసిన 'తారే జమీన్ పర్' చిత్రంలోని 'మా', 'చిట్టగాంగ్'లోని 'బోలో నా', 'బాగ్ మిల్కా బాగ్' చిత్రంలోని 'జిందా' పాటలు ప్రసిద్ధి పొందాయి. 2015లో జోషి పద్మశ్రీ అందుకున్నారు.

ఇరోమ్ పెండ్లికి అభ్యంతరాల్లేవ్

- స్పష్టం చేసిన సబ్‌రిజిస్ట్రార్



కొడైకెనాల్, ఆగస్టు 12: ఉక్కు మహిళ, మణిపూర్ పౌరహక్కుల కార్యకర్త ఇరోమ్ షర్మిల, బ్రిటిష్ వాసి డెస్మండ్ కౌటినో పెండ్లికి ఎలాంటి అభ్యంతరాలు లేవని సబ్‌రిజిస్ట్రార్ స్పష్టంచేశారు. వారి పెండ్లిపై సామాజిక కార్యకర్త వీ మహేంద్రన్ అభ్యంతరం వ్యక్తంచేస్తూ.. పెండ్లి తర్వాత దంపతులు కొడైకెనాల్ ప్రాంతంలో ఉంటే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ అభ్యంతరాలను సబ్‌రిజిస్ట్రార్ తోసిపుచ్చారు. ఇరోమ్, డెస్మండ్.. ప్రత్యేక వివాహచట్టం ప్రకారం గత జూలై 12వ తేదీనే పెండ్లి కోసం దరఖాస్తు చేసుకున్నారని, 30 రోజుల వరకు అభ్యంతరాలకు అవకాశం కల్పించామన్నారు. ప్రత్యేక వివాహచట్టం ప్రకారం.. ఇప్పటికే పెండ్లయిన వ్యక్తి అయినా, పెండ్లి వయసు రాకున్నా, ఇద్దరిలో ఒకరికి మానసిక ఆరోగ్యం బాగోలేకపోవడం వంటి వాటికే అభ్యంతరాలు తెలుపాలని సబ్‌రిజిస్ట్రార్ స్పష్టంచేశారు.

శరద్‌యాదవ్‌పై వేటు!

- జేడీ(యూ) రాజ్యసభాపక్ష నేత పదవి నుంచి తొలిగించిన పార్టీ అధ్యక్షుడు నితీశ్‌కుమార్
- పార్టీ ఎంపీ అలీ అన్వర్ అన్సారీపై సస్పెన్షన్
- త్వరలో ఎన్డీఏలో జేడీ(యూ) చేరిక.. నితీశ్‌కు కన్వీనర్ పదవి?



శరద్‌యాదవ్

న్యూఢిల్లీ/ పాట్నా, ఆగస్టు 12: బీహార్‌లో బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్న సీనియర్ నాయకుడు శరద్‌యాదవ్‌ను రాజ్యసభాపక్ష నేత పదవి నుంచి జేడీ(యూ) పార్టీ అధ్యక్షుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ తొలిగించారు. ఆయన స్థానంలో పార్టీకి చెందిన మరో సీనియర్ నేత ఆర్సీపీ సింగ్‌ను నియమించారు. తమ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు అలీ అన్వర్ అన్సారీపై కూడా వేటు వేశారు. ఆయనను పార్లమెంటరీ పార్టీ నుంచి శుక్రవారం రాత్రి సస్పెండ్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రతిపక్షాల సమావేశానికి హాజరైనందుకు ఆయనపై ఈ చర్య తీసుకున్నారు. జేడీ(యూ) ఎంపీల ప్రతినిధి బృందం శనివారం రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును కలిసి తమ పార్టీ రాజ్యసభాపక్ష నేతను మార్చుకున్న విషయం తెలియజేసింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు ఇచ్చిన లేఖను ఆయనకు అందజేసింది.

అసలైన జేడీ(యూ) నాదే: శరద్‌యాదవ్

అసలైన జేడీ(యూ) పార్టీ తన వెంటే ఉన్నదని, జేడీ(యూ) ప్రభుత్వం మాత్రమే నితీశ్‌కుమార్ వెంట ఉన్నదని శరద్‌యాదవ్ వ్యాఖ్యానించారు. జేడీ(యూ) కేవలం 'నితీశ్‌కుమార్ పార్టీ మాత్రమే కాదు, నా పార్టీ కూడా' అని అన్నారు. 'బీహార్‌లో రెండు జేడీ(యూ)లున్నాయి. వాటిలో ఒకటి సర్కారీ జేడీ(యూ) అయితే మరొకటి ప్రజల జేడీ(యూ). పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నాయకుల్లో నితీశ్‌కుమార్‌కు సన్నిహితంగా ఉంటూ వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించే వారు ప్రభుత్వం వెంట ఉన్నారు. ప్రజలకు సన్నిహితంగా ఉండే పార్టీ నాయకులు, కార్యకర్తలు నావెంట ఉన్నారు' అని శరద్‌యాదవ్ చెప్పారు. రాజ్యసభాపక్ష నేత పదవి నుంచి తనను తొలిగించడంపై ఆయన నేరుగా స్పందించలేదు. కానీ 'నేను ఇందిరాగాంధీకే భయపడలేదు. ఇతరుల సంగతి లెక్కేమిటి?' అన్నారు. తాను సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని, సత్యం మాట్లాడుతానని చెప్పారు. బీహార్‌లోని 11కోట్ల మంది ప్రజల తీర్పు మేరకు తాను ఇంకా కాంగ్రెస్ నాయకత్వంలోని మహాకూటమిలోనే ఉన్నానని తెలిపారు.

కేంద్రంలో చేరనున్న జేడీ(యూ) ..

ఎన్డీఏలో చేరాలని నితీశ్‌కుమార్‌ను బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా కోరారు. శుక్రవారం ఢిల్లీలో నితీశ్‌కుమార్ తనను కలుసుకున్నపుడు ఈ మేరకు ఆహ్వానం పలికారు. అందుకు సమ్మతించిన నితీశ్‌కుమార్ ఈ నెల 19న జరిగే జేడీ(యూ) జాతీయకార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం ప్రకటించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్డీఏలో చేరితే జేడీ(యూ)కు కేంద్రమంత్రివర్గంలో రెండు మంత్రి పదవులు దక్కే అవకాశాలున్నాయని, నితీశ్‌కుమార్‌కు ఎన్డీఏ కన్వీనర్ పదవి ఇస్తారని అంటున్నారు.

తప్పుడు హామీలతోనే మోదీ పాలన

- కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపణ

న్యూఢిల్లీ, ఆగస్టు 12: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం తప్పుడు హామీలతోనే కాలం గడుపుతున్నదని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. రైతులు, నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో వెనుకబడిన హైదరాబాద్ – కర్ణాటక ప్రాంతానికి ప్రత్యేక హోదా కల్పిస్తూ రాజ్యాంగంలో 371 (జే) అధికరణానికి సవరణలో కీలక పాత్ర పోషించిన రాహుల్‌గాంధీని శనివారం కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పంట రుణాల మాఫీ తమ ప్రభుత్వ పాలసీ కాదని, రైతులను సోమరులను చేయదల్చుకోలేదని అన్నారని రాహుల్ గుర్తు చేశారు. ఇదే ప్రభుత్వం పారిశ్రామిక రుణాలు మాఫీ చేసినప్పుడు 10 మంది అత్యంత సంపన్న పారిశ్రామికవేత్తలు సోమరులు కానప్పుడు రైతులు ఎలా సోమరులవుతారని రాహుల్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గె తదితరులు పాల్గొన్నారు.



కర్ణాటకలోని రాయచూర్‌లో జరిగిన 'సమానత సమావేశ'లో రాహుల్, ఇతర కాంగ్రెస్ నేతలు

గోరఖ్‌పూర్ ఘోరకలి!

63కు చేరిన శిశువుల మరణాలు

- దేశవ్యాప్తంగా తీవ్ర ఆవేదన కలిగించిన విషాదం
- ఆక్సిజన్ సరఫరా లేకే పిట్టల్లా రాలిపోయిన చిన్నారులు
- ఆక్సిజన్ సరఫరాదారుకు నెలలుగా బకాయిలు చెల్లించని ప్రభుత్వ దవాఖాన
- పేరుకుపోయిన బకాయిలు రూ.64 లక్షలు
- గంటల వ్యవధిలోనే చిన్నారుల మృత్యువాత
- పలుమార్లు చెప్పినా ఫలితం లేకపోవడంతో ఆక్సిజన్ సిలిండర్లను నిలిపివేసిన సరఫరాదారు



గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ దవాఖానలో చికిత్స పొందుతున్న చిన్నారులు

గోరఖ్‌పూర్, ఆగస్టు 12: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లా బాబా రాఘవ్‌దాస్ (బీఆర్‌డీ) ప్రభుత్వ వైద్య కళాశాల దవాఖానలో ఆక్సిజన్ అందకపోవడం వల్లే పసికందులు మరణించినట్టు తెలుస్తున్నది. నాలుగురోజుల వ్యవధిలో ఆ దవాఖానలో మరణించిన చిన్నారుల సంఖ్య 63కు చేరుకున్నది. నవజాత శిశువుల మరణాలు ఆక్సిజన్ అందకపోవడం వల్ల కాదని ప్రభుత్వం బుకాయిస్తున్నప్పటికీ, గత పక్షం రోజులుగా దవాఖానలోని ఎమర్జెన్సీ విభాగానికి ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయినట్టు స్థానిక పత్రికలు పేర్కొన్నాయి. ఆక్సిజన్ కొరత వల్ల ఆ దవాఖానలో 21 మంది పిల్లలు మృతిచెందినట్టు జిల్లా ఎస్పీ నుంచి సమాచారం అందిందని కేంద్ర హోం శాఖ తెలిపింది. ఘటనపై దర్యాప్తుకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. దవాఖానను సందర్శించి ఒక నివేదిక రూపొందించాలని సీఎం ఆదిత్యనాథ్ తన మంత్రివర్గ సహచరులు ఇద్దరిని పురమాయించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో 63 కుటుంబాలకు గర్భశోకం మిగిల్చిన ఈ దారుణ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆవేదనను కలిగించింది. దవాఖాన నుంచి తనకు రూ.64 లక్షల వరకు బకాయిలు రావలసి ఉన్నదని, 30 మంది పసిపిల్లలు మరణించిన తరువాతనే ఆగమేఘాల మీద రూ.20.84లక్షలు తనకు చెల్లించారని దవాఖానకు ఆక్సిజన్ సరఫరా చేస్తున్న కాంట్రాక్టు సంస్థ పుష్పా సేల్స్ తెలిపింది. మరోవైపు బీఆర్‌డీ దవాఖానలో తమ పిల్లలకు వైద్యులు సరైన చికిత్సనందించడం లేదని, కనీసం మందులు కూడా ఇవ్వడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇదిలాఉండగా, ప్రభుత్వ అధికారులు లక్నోలోని ఆక్సిజన్ సరఫరా యూనిట్‌పై శనివారం దాడులు జరిపారు. దవాఖానకు ఆక్సిజన్ సరఫరా నిలిపివేయడం పట్ల ఆ సంస్థపై కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

చిన్నారుల మృతికి ఆక్సిజన్ కొరత కాదు: యూపీ సీఎం

గోరఖ్‌పూర్‌లోని ప్రభుత్వ దవాఖానలో ఆక్సిజన్ కొరత వల్ల చిన్నారులు మరణించలేదని ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ఈ ఘటనపై విచారణకు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారథ్యంలో కమిటీని నియమించిన తర్వాత ఆయన ఆదివారం హడావుడిగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 'గోరఖ్‌పూర్‌లో చిన్నారులను బలిగొంటున్న మెదడువాపు వ్యాధి ప్రభావం గురించి ఎంతోకాలంగా అధికారులతో మాట్లాడుతున్నా. ఇది నాకు చాలా భావోద్వేగాలతో కూడిన అంశం. ఈ నెల 9న దవాఖాన అధికారులతో జరిగిన భేటీలో చిన్నారులకు సంబంధించిన పలు వ్యాధులు, వాటికి అందిస్తున్న చికిత్స గురించి అధికారులు నాతో చర్చించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తానని హామీ ఇచ్చాను. కానీ, దవాఖానలో ఆక్సిజన్ కొరత ఉన్న విషయాన్నే చెప్పలేదు. అయితే, ఆక్సిజన్ సిలిండర్లకు అవసరమైన నిధుల కోసం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సంబంధిత ఉన్నతాధికారికి లేఖ రాశారు. ఈనెల 5న నిధులను కూడా విడుదల చేశాం. కానీ, ఆక్సిజన్ సిలిండర్ల సరఫరాదారుకు ఆ నిధులను ప్రిన్సిపాల్ చెల్లించలేదు. ఆయన బాధ్యతారహితంగా వ్యవహరించారు' అని సీఎం చెప్పారు. చిన్నారుల మృతికి ఆక్సిజన్ కొరతే కారణమని వచ్చిన వార్తలు నిజమైతే అది అత్యంత హేయమైన విషయం అని పేర్కొన్నారు. పసికందుల మరణాలపై ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించామని వైద్య విద్యా శాఖ మంత్రి అశుతోష్ టాండన్ చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజీవ్ మిశ్రాను వెంటనే సస్పెండ్ చేస్తున్నామని తెలిపారు.

ఆక్సిజన్ సరఫరాలో అంతరాయం నిజమే

దవాఖానలో ఆక్సిజన్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన మాట నిజమేనని గోరఖ్‌పూర్ జిల్లా యంత్రాంగం అంగీకరించింది. అయితే పిల్లల మరణాలకు ఆక్సిజన్ సరఫరా నిలిచిపోవటానికి సంబంధం లేదని తెలిపింది. 800 పడకలు ఉన్న ఈ దవాఖానలో గురువారం రాత్రి రెండుగంటల పాటు ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయిన మాట వాస్తవమేనని, అయితే ఆ సమయంలో ఎవరూ చనిపోలేదని హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. ఈ నెల 7వ తేదీ నుంచి వేర్వేరు వ్యాధుల కారణంగా 60 మంది పసికందులు మరణించినట్టు దవాఖాన పీడియాట్రిక్ విభాగం నుంచి తనకు సమాచారం అందిందని ఆరోగ్య మంత్రి సిద్దార్థ్‌నాథ్‌సింగ్ చెప్పారు. గోరఖ్‌పూర్‌లో పసికందుల మరణాలపై ప్రధాని నరేంద్రమోదీ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) తెలిపింది.

యూపీ సీఎం రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్

గోరఖ్‌పూర్ ప్రభుత్వ దవాఖానలో 60 మందికిపైగా పసిపిల్లల మరణాలకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆరోగ్య శాఖ మంత్రి సిద్దార్థ్‌నాథ్‌సింగ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గులాంనబీ ఆజాద్, మరికొందరు నేతలు శనివారం గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ మెడికాల్ కాలేజీ దవాఖానను సందర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే పసికందులు ప్రాణాలు కోల్పోయారని ఆజాద్ ఆరోపించారు. గోరఖ్‌పూర్‌లో పసికందుల మరణాలను ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంగా సమాజ్‌వాదీ, బీఎస్పీ పార్టీలు అభివర్ణించాయి.

అది నరమేధం : కైలాశ్ సత్యార్థి

గోరఖ్‌పూర్ ప్రభుత్వ దవాఖానలో పసిపిల్లల మరణాలపై నోబెల్ బహుమతి గ్రహీత, బాలల హక్కుల ఉద్యమకారుడు కైలాశ్ సత్యార్థి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆక్సిజన్ సరఫరా లేని కారణంగా చిన్నారులు మరణించడం విషాదం కాదు, నరమేధం అని ఆయన ట్విట్టర్‌లో మండిపడ్డారు.



దవాఖాన కాదు వధశాల!

నాలుగురోజుల కొడుకును కోల్పోయిన ఓ తండ్రి ఆవేదన

అది తమ ప్రాంతం (గోరఖ్‌పూర్)లోనే అతిపెద్ద దవాఖాన అని, ఆ రోజు తన కండ్ల ముందే తన కొడుకుతో పాటు కొందరు పసిపిల్లలు పిట్టల్లా రాలిపోయారని కిషన్ గుప్తా వాపోయారు. తన కొడుకు అనారోగ్యం పాలవడంతో వెంటనే బీఆర్‌డీ దవాఖానకు తీసుకొచ్చానని ఆయన చెప్పారు. వైద్యులు వెంటనే తన చిన్నారిని అడ్మిట్ చేసుకొని, ఐసీయూలో పెట్టారని తెలిపారు. అయితే నవజాత శిశువులకు పెట్టేందుకు తమ వద్ద వెంటిలేటర్లు (ఆక్సిజన్ అందించే యంత్రం) లేవని డాక్టర్లు చెప్పారని అన్నారు. నాలుగైదు గంటలపాటు ఆక్సిజన్ అందించే పంపును తాను చేతితోనే నొక్కానని ఆయన తెలిపారు. అయినప్పటికీ తన చిన్నారిని తనకు దక్కలేదని అన్నారు. దవాఖానలో ఆక్సిజన్ లేనందునే డాక్టర్లు తన కొడుకుకు వెంటిలేటర్ పెట్టలేదని స్పష్టం చేశారు. ఆ రోజు (గురువారం) ఆ దవాఖాన మెడికల్ కాలేజీలా కాకుండా వధశాల లాగా కనిపించిందని కిషన్‌గుప్తా పేర్కొన్నారు. పసిపిల్లలను బతికించేందుకు వైద్య సిబ్బంది ఎటువంటి ప్రయత్నం చేయలేదని ఆయన ఆరోపించారు. తన ముందే ఇద్దరు చిన్నారుల మృతదేహాలను ఆ వార్డు నుంచి బయటకు తరలించారని చెప్పారు.

బకాయిలు చెల్లించనందునే ఆక్సిజన్ సరఫరా నిలిపివేత?




బీఆర్‌డీ దవాఖానకు కొత్తగా వచ్చిన ఆక్సిజన్ సిలిండర్లు

బీఆర్‌డీ వైద్య కళాశాల యాజమాన్యం తమకు కొన్ని నెలలుగా బకాయిలు చెల్లించడం లేదని, అందుకే ఆక్సిజన్ సరఫరా నిలిపివేస్తామని చెప్పామని పుష్పాసేల్స్ సంస్థ పేర్కొన్నది. ఆక్సిజన్ లేకపోవడం వల్లే 30 మంది పిల్లలు మరణించినట్టు వార్తలు వెలువడిన మరుక్షణం తమకు రావాల్సిన బకాయిల్లోంచి రూ.20.84 లక్షలు విడుదల చేశారని పుష్పాసేల్స్ అధిపతి దీపాంకర్ శర్మ చెప్పారు. బకాయిలు చెల్లించాలని తాము అడిగినప్పుడల్లా ప్రిన్సిపాల్ రాజీవ్ మిశ్రా నిధులు లేవని చెప్పేవారని అన్నారు. ఆయన చుట్టూ తిరుగలేకే లీగల్ నోటీసు పంపించామని దీపాంకర్ చెప్పారు. ఇప్పుడు ఒకేసారి రూ.20 లక్షలు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. రెండు రోజుల్లో మరో రూ.30 లక్షలు కూడా చెల్లిస్తామని చెప్పారని ఆయన తెలిపారు. పుష్పా సేల్స్ సంస్థ ఈ నెల ఒకటో తేదీన వైద్య కళాశాల యాజమాన్యానికి రాసిన లేఖలో, తమకు రావాల్సిన రూ.64 లక్షల బకాయిలు చెల్లించకపోతే ఆక్సిజన్ సరఫరాను నిలిపివేస్తామని హెచ్చరించింది. ఈ లేఖ ఇప్పుడు మీడియాకు లభించింది. దవాఖానలోని ఆక్సిజన్ స్టోరేజ్ ప్లాంట్ ఉద్యోగులు ప్రధాన వైద్యాధికారికి రాసిన లేఖ కూడా బట్టబయలైంది. తమవద్దనున్న ఆక్సిజన్ సిలిండర్లు గురువారం సాయంత్రం వరకే సరిపోతాయని, వెంటనే కొత్త సిలిండర్లను తెప్పించాలని స్టోరేజ్‌ప్లాంట్ ఉద్యోగులు ఆ లేఖలో కోరారు. వారు చెప్పినట్లే గురువారం రాత్రి 11.30 గంటలకు దవాఖానలో ఉన్న మొత్తం ఆక్సిజన్ అయిపోయినట్లు తెలిస్తున్నది. రాత్రి 1.30 గంటలకు ఆక్సిజన్ సిలిండర్ల కొత్త స్టాకు వచ్చినట్టు రికార్డులు తెలుపుతున్నాయి.

స్థానికుల ఆగ్రహం

చిన్నారుల మరణంపై గోరఖ్‌పూర్ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్వాస (ఆక్సిజన్) అందక పసికందులు కుప్పకూలుతుంటే సీనియర్ అధికారులు ఒక్కరు కూడా వచ్చి చూడలేదని భగవతి యాదవ్ అనే వ్యక్తి చెప్పారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ఈ దవాఖానలో ఉత్తమ వైద్య సేవలందుతాయని ఆదిత్యనాథ్ ఎన్నికల ముందువ వాగ్దానం చేశారని గౌరీ నిషాద్ అనే చిన్నారి తండ్రి చెప్పారు. మంత్రులను పంపడానికి బదులుగా స్వయంగా ముఖ్యమంత్రే వచ్చి దవాఖానలో పరిస్థితులను చక్కదిద్దాలని ఆదిత్య కుమార్ అనే విద్యార్థి సూచించారు. గోరఖ్‌పూర్‌లో పసిపిల్లలు మరణించే విషయాన్ని ఎంపీగా యోగి ఆదిత్యనాథ్ లోక్‌సభలో ప్రస్తావించారని వినోద్‌కుమార్ సింగ్ అనే సామాజిక కార్యకర్త గుర్తు చేశారు. 'గత 36 ఏండ్లలో లక్ష మంది వరకు పసిపిల్లలు గోరఖ్‌పూర్‌లో మరణించారు. ప్రాణాలతో బయటపడిన వారు దివ్యాంగులుగా మారారు. కేంద్రం నిధులు ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది' అంటూ ఆదిత్యనాథ్ నాటి సమాజ్‌వాదీ ప్రభుత్వంపై విమర్శలు సంధించారు.



చిన్నారిని కోల్పోయి విలపిస్తున్న తల్లిదండ్రులు

మూడో కన్ను తెరుస్తా

- అణ్వాయుధాలు గురిపెట్టి సిద్ధంగా ఉంచాం
- కనుసైగ చేస్తే సైనిక చర్య ప్రారంభమవుతుంది
- ఉత్తరకొరియా అధ్యక్షుడిని హెచ్చరించిన ట్రంప్

వాషింగ్టన్, ఆగస్టు 12: అమెరికా, ఉత్తరకొరియా మధ్య ఉద్రిక్త పరిస్థితులు తారాస్థాయికి చేరుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌పై నిప్పులు చెరిగారు. కిమ్ వల్ల అమెరికాతోపాటు తమ మిత్రదేశాలకు ఎలాంటి హాని జరిగినా సైనిక చర్య తప్పదని తీవ్రంగా హెచ్చరించారు. ఉత్తరకొరియావైపు అణ్వాయుధాలు గురిపెట్టి ఉన్నాయని, కనుసైగ చేస్తే చాలు దాడి చేసేందుకు తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. 'గ్వామ్‌పై దాడికి దిగినా.. అమెరికాతోపాటు, మా మిత్రదేశాలకు ఉత్తరకొరియా వల్ల ఏ రూపంలోనైనా, ఎలాంటి హాని జరిగినా కిమ్ తీవ్రంగా పశ్చాత్తాపపడాల్సి వస్తుంది' అని శనివారం ట్వీట్ చేశారు. కిమ్, అతడి కుటుంబం దశాబ్దాలుగా అరాచకపాలన సాగిస్తున్నదని విమర్శించారు. అమెరికా సైనిక వ్యూహాల్లో కీలక స్థావరమైన గ్వామ్ ద్వీపంపై క్షిపణి దాడి చేస్తామని కిమ్ ప్రకటించిన నేపథ్యంలో జాతీయ భద్రతా అధికారులతో ట్రంప్ మరోమారు సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ సమస్యకు శాంతియుత పరిష్కారం లభిస్తుందని ఆకాంక్షించారు. ఉత్తరకొరియాతో తెరవెనుక చర్చల ప్రసక్తే లేదన్నారు. మానవత్వాన్ని మంటగలుపుతూ దశాబ్దాలుగా అరాచకపాలన సాగిస్తున్నవారితో చీకటి ఒప్పందాలు ఉండబోవని తేల్చి చెప్పారు. కిమ్ వెనుకడుగు వేసేవరకు తాను ముందుకే వెళ్తానని స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా బలగాలు రాత్రికి రాత్రే ఉత్తరకొరియాపై దాడి చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని పెంటగాన్ వర్గాలు తెలిపినట్టు 'ఫాక్స్ న్యూస్' పేర్కొన్నది.



ట్రంప్‌తో మాట్లాడిన జిన్‌పింగ్

ఉత్తరకొరియా, అమెరికా మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరడంతో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేశారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని కోరారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు శాంతియుత పరిష్కారం ఒక్కటే మార్గమని చెప్పారు. అవసరమైతే ఈ విషయంలో తాము సహకరిస్తామన్నారు. ఈ విషయంలో ముందుగా ఉత్తరకొరియా అధ్యక్షుడితో మాట్లాడాలని ట్రంప్ చైనా అధ్యక్షుడికి సూచించినట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ తీరుపై ఇరు దేశాల అధినేతలు మాట్లాడుకున్నారు. కిమ్ దూకుడు తగ్గించుకోవాలని, అనవసరమైన రెచ్చగొట్టే ప్రకటనలు మానుకుంటేనే శాంతియుత పరిష్కారం సాధ్యమవుతుందని ఇద్దరూ అభిప్రాయపడ్డారు. చైనా మొదటి నుంచీ ఉత్తరకొరియాను వెనుకేసుకొస్తున్న సంగతి తెలిసిందే.

అప్రమత్తమైన జపాన్

అమెరికాలోని గ్వామ్ ద్వీపంపై దాడి చేస్తామని కిమ్ హెచ్చరించడంతో జపాన్ అప్రమత్తమైంది. క్షిపణి ప్రయాణించే మార్గంలో తమ దేశం ఉన్నందున రక్షణ వ్యవస్థలను అప్రమత్తం చేస్తున్నది. పశ్చిమ జపాన్, హిరోషిమా, కొచి, షిమ్నే తదితర ప్రాంతాల్లో 'పీఏసీ–3' రక్షణ వ్యవస్థను మోహరించింది. ఉత్తరకొరియాకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లో క్షిపణి విధ్వంసక వ్యవస్థను సిద్ధం చేసింది.

భారత్ సహాయం చేస్తుంది

అమెరికా–ఉత్తర కొరియా మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించడంలో భారత్ కీలక పాత్ర పోషించాలని అమెరికా సైనిక ఉన్నతాధికారి అభిప్రాయపడ్డారు. 'భారత్ స్వరం పెద్దది. అందరినీ తన వైపు తిప్పుకోగలదు. కాబట్టి అణ్వాయుధాల తయారీతో కలుగుతున్న నష్టాలను ఉత్తరకొరియా ప్రభుత్వానికి అర్థమయ్యేలా వివరించగలుతుంది' అని పసిఫిక్ కమాండ్‌కు చెందిన అడ్మిరల్ హ్యారీ హ్యారిస్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో భారత్ నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

వెనెజులాపై సైనిక చర్యకు దిగుతాం: ట్రంప్

వెనెజులాపై సైనిక చర్యకు దిగే అవకాశాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. వెనెజులా చట్టసభలో ప్రతిపక్షాన్ని తొలిగించేందుకు జూలై 30న ఎన్నిక జరుపడంపై ఆ దేశ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్లపైకి వచ్చారు. రెండు వారాలుగా రాజధానితోపాటు, పలు పట్టణాల్లో అల్లర్లు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ పై విధంగా స్పందించారు.

అవార్డు గ్రహీతలకు మెడల్స్, ఇంక్రిమెంట్లు

ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులుగా బంగారు, వెండి, కాంస్య పతకాలు

రాష్ట్రస్థాయిలో 12 మంది, జిల్లాస్థాయిలో 88 మందికి పురస్కారాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ స్టేట్ ఎంప్లాయీస్ ఇన్సెంటివ్ స్కీం నిబంధన ప్రకారం ఎంపికైన ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవపూర్వకంగా మెడల్స్ ప్రదానం చేయనున్నది. ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులు అందుకుంటున్న ఉద్యోగులకు వరుసగా బంగారు, వెండి, కాంస్య పతకాలను ఇచ్చి సత్కరించనున్నది. దీంతోపాటు నగదు ప్రోత్సాహకంగా రూ. 5 లక్షలు, రూ. 3 లక్షలు, రూ. 2 లక్షలు ఇవ్వనున్నది. రాష్ట్రస్థాయిలో నాలుగు విభాగాల్లో ఎంపికైన 12 మంది ఉద్యోగులను పంద్రాగస్టు వేడుకల్లో మెడల్స్‌తోపాటు నగదు ఇచ్చి సన్మానించనున్నట్లు అవార్డు కమిటీ చైర్మన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య శనివారం 'నమస్తే తెలంగాణ ప్రతినిధి'కి చెప్పారు. జిల్లాస్థాయిలోనూ మరో 88 మంది ఉద్యోగులను అవార్డులకు ఎంపికచేసినట్టు ఆయన పేర్కొన్నారు. వీరికి అదనంగా ఒక ఇంక్రిమెంట్ ఇవ్వనున్నట్టు చెప్పారు. రాష్ట్రస్థాయిలో తొలిసారి ఉద్యోగులకు ప్రోత్సాహకరంగా అవార్డులు ఇచ్చే విధానాన్ని రూపొందించినట్టు ఆయన వెల్లడించారు. ఉమ్మడిరాష్ట్రంలో అవార్డులు ఇచ్చే విధానం ఉన్నప్పటికీ అశాస్త్రీయంగా ఎంపిక జరిగేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో శాస్త్రీయంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉద్యోగ ప్రోత్సాహక అవార్డుల ఎంపిక జరిగిందని ఆచార్య చెప్పారు. గ్రూప్-1 క్యాటగిరీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు వరుసగా సీహెచ్ మధుసూదన్, సురేశ్‌బాబు, పీడబ్ల్యూ జాన్సన్, గ్రూప్-2 క్యాటగిరీలో ఖానాపూర్ చంద్రకళ, విశ్వనాథం గుప్తా, రమీజుద్దీన్ అహ్మద్, గ్రూప్-3 క్యాటగిరీలో ఎం జయమ్మ, కే ప్రకాశ్, డీ శంకర్‌కుమార్, గ్రూప్-4 క్యాటగిరీలో బీ దశరథ, కే గంగయ్య, కే కిష్టయ్య ఎంపికైనట్టు ఆయన వివరించారు.



పంద్రాగస్టునాడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పురస్కారాలు అందుకునే ఉద్యోగులు వీరే..

డాక్టర్ సీహెచ్ మధుసూదన్ (గ్రూప్ 1 క్యాటగిరీ)
సురేశ్‌బాబు (గ్రూప్ 1 క్యాటగిరీ)
జీ విశ్వనాథం గుప్తా (గ్రూప్ 2 క్యాటగిరీ)
రమీజుద్దీన్ అహ్మద్ (గ్రూప్ 2 క్యాటగిరీ)
ఖానాపూర్ చంద్రకళ (గ్రూప్ 2 క్యాటగిరీ)
పీడబ్ల్యూ జాన్సన్ (గ్రూప్ 1 క్యాటగిరీ)
ఎం జయమ్మ (గ్రూప్ 3 క్యాటగిరీ)
కే ప్రకాశ్ (గ్రూప్ 3 క్యాటగిరీ)
బీ దశరథ (గ్రూప్ 4 క్యాటగిరీ)
డీ శంకర్‌కుమార్ (గ్రూప్ 3 క్యాటగిరీ)
కే గంగయ్య (గ్రూప్ 4 క్యాటగిరీ)
కే కిష్టయ్య (గ్రూప్ 4 క్యాటగిరీ)

20న జేసీజే స్క్రీనింగ్ టెస్ట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని దిగువ న్యాయస్థానాల్లో జూనియర్ సివిల్ జడ్జి (జేసీజే) పోస్టుల భర్తీ కోసం ఈ నెల 20వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహించనున్నారు. హైదరాబాద్, వరంగల్‌తోపాటు ఏపీ రాష్ట్రంలోని మూడునగరాల్లో పరీక్షలను నిర్వహించనున్నట్టు ఉమ్మడి హైకోర్టు రిజిస్ట్రార్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇప్పటికే హాల్‌టికెట్లను పోస్టు ద్వారా పంపించామని, హాల్‌టికెట్లు అందని అభ్యర్థులు ఈనెల 16 నుంచి హైకోర్టు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జేసీజే -2017 నోటిఫికేషన్ ప్రకారం 23 జూనియర్ సివిల్ జడ్జి పోస్టులను భర్తీ చేయనున్నారు.

మైనారిటీ విద్యార్థులకు రోబోటిక్స్‌లో శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆధునిక సాంకేతిక శిక్షణలో భాగంగా రాష్ట్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థులు రోబోటిక్స్‌లో శిక్షణ పొందనున్నారు. ఇప్పటికే ఎనిమిది స్కూళ్లలో ప్రయోగాత్మకంగా ఇటీవల నిర్వహించిన ఈ శిక్షణతో మంచి ఫలితాలు రావడంతో తొలి విడుత కింద ఈ నెల 12, 13, 20 తేదీల్లో రాష్ట్రంలోని 42 గురుకులాలలో శిక్షణకు వర్క్‌షాపులను ఏర్పాటుచేస్తున్నారు. తెలంగాణ మైనారిటీల రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ(టెమ్రీస్) ఆధ్వర్యంలో ఈ శిక్షణ జరుగుతుంది. ఇందుకు టెమ్రీస్ హైదరాబాద్‌కు చెందిన ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీతో ఒప్పందం కుదుర్చుకున్నది. 42 గురుకులాల్లోని సుమారు 4200 మంది ఏడో తరగతి విద్యార్థులకు ముఫకంజా కాలేజ్‌లోని రోబోటిక్స్ సెంటర్‌కు చెందిన విద్యార్థులు శిక్షణ ఇస్తారు. త్వరలోనే మిగతా మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని టెమ్రీస్ కార్యదర్శి బీ షఫిఉల్లా తెలిపారు.

55 మందికి హరితమిత్ర అవార్డులు

మొదటిపేజీ తరువాయి...

విశేష సేవలందిస్తున్న సివిల్ అధికారులను అవార్డులకు ఎంపికచేసినట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థలు, ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక స్వపరిపాలనా సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు, కార్పొరేట్ సంస్థలు.. ఇలా క్యాటగిరీలవారీగా ఎంపికచేసిన 55 హరిత మిత్ర అవార్డులను ఈ నెల 15న పంద్రాగస్టు వేడుకల్లో బహూకరించనున్నట్టు ఆయన వివరించారు. ఇందులో రాష్ట్రస్థాయిలో ఐదు అవార్డులు కాగా మిగతావి జిల్లాస్థాయిలో కేటాయించినట్టు బీపీ ఆచార్య చెప్పారు. రాష్ట్రస్థాయి అవార్డులను గోల్కొండ వేదికగా జరిగే స్వాతంత్ర వేడుకల్లో సీఎం కేసీఆర్, జిల్లా స్థాయి అవార్డులను ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రదానం చేస్తారని ఆయన వెల్లడించారు.

రాష్ట్ర స్థాయిలో

క్యాటగిరీ	అవార్డుకు ఎంపికైన వారిపేరు/హోదా	జిల్లా
ప్రభుత్వ అధికారి	వై శేఖర్‌రెడ్డి, డ్వామా పీడీ	వరంగల్ (రూరల్)
ప్రజాప్రతినిధి	పెద్ది సుదర్శన్‌రెడ్డి నల్లబెల్లి	వరంగల్ (రూరల్)
అటవీ అధికారి	సీ శ్రీధర్‌రావు, డీఎఫ్‌వో	సిద్దిపేట
ప్రభుత్వ సంస్థ	ఎంపీపీఎస్, మురపల్లి, జగిత్యాల మండలం	జగిత్యాల
సంస్థ	అటవీశాఖ రామగుండం-1 ఎస్సీసీఎల్ జీఎం	పెద్దపల్లి

జిల్లాస్థాయిలో

జనరల్	టీ రవి సీఐ గూండాల పోలీస్‌స్టేషన్	కొత్తగూడెం
జనరల్	గోపాల కృష్ణారావు, ఎంపీడీవో యాదగిరిగుట్ట	యాదాద్రి-భువనగిరి
జనరల్	గంగుల సంతోష్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్, డీఆర్‌డీఏ	జగిత్యాల
జనరల్	సంతోష్ రీజనల్ ఆఫీసర్, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు	వరంగల్ రూరల్
జనరల్	అలీ రాములు, కాచారం గ్రామం, తూప్రాన్ మండలం	మెదక్

ప్రజాప్రతినిధులు

దాడి నగేశ్, బుద్ద కలాన్, గ్రామం, బెల్లంపల్లి	మంచిర్యాల
కొండల రంగారెడ్డి, మహబూబ్‌పేట్, యాదగిరిగుట్ట	యాదాద్రి-భువనగిరి
పానుగోటి కృష్ణారావు, పీఏసీఎస్ చైర్మన్, హిమ్మత్‌రావుపేట	జగిత్యాల
ఎం రవీందర్‌రావు, వర్ధన్నపేట, ఎంపీపీ	వరంగల్ (రూరల్)

అటవీశాఖ అధికారులు

శంకరయ్య, బీట్ ఆఫీసర్, మవాలా	ఆదిలాబాద్
జీ రామ్‌సింగ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్,	కొత్తగూడెం
ఆర్ విజయ్‌కుమార్, ఏబీవో, కేసముద్రం	మహబూబాబాద్
కే సుదర్శన్‌రెడ్డి, డీఎఫ్‌వో,	నల్లగొండ
వీ కృష్ణ, డీఎఫ్‌వో	మేడ్చల్
జీ రవికుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్	జగిత్యాల
శ్రీనివాసరావు, జిల్లా అటవీ అధికారి	యాదాద్రి-భువనగిరి
డీ సతీశ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, పరకాల	వరంగల్(రూరల్)
కే చంద్రశేఖర్, రేంజ్ ఆఫీసర్, తూప్రాన్	మెదక్
ఆర్ రాజేందర్‌రెడ్డి, ఎఫ్‌బీవో, ధారూర్‌రేంజ్	వికారాబాద్
వీ సౌజన్య, ఎఫ్‌బీవో, సోమ్రాన్‌పల్లి	మంచిర్యాల

ప్రభుత్వరంగ సంస్థలు

జెడ్పీఎస్ఎస్, గిమ్మ- కే మండలం	ఆదిలాబాద్
తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, బెల్లంపల్లి.	మంచిర్యాల
జెడ్పీ హెచ్ఎస్ఎస్, మడ్డివంచ, మహబూబాబాద్	మహబూబాబాద్
జిల్లా హార్టికల్చర్, సెరికల్చర్ అధికారి	ఖమ్మం
జెడ్పీ, బాలికల ఉన్నత పాఠశాల, నడిగూడెం	సూర్యాపేట
ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ	నిజామాబాద్
పీహెచ్‌సీ, హమ్మాజీపేట, బాన్సువాడ	కామారెడ్డి
ఎంపీడీవో, కుత్బుల్లాపూర్	మేడ్చల్
జెడ్పీహెచ్ఎస్, మల్లన్నపేట, గొల్లపల్లి మండలం	జగిత్యాల
హన్మకొండ పోలీస్ కమిషనరేట్	వరంగల్ (అర్బన్)
ఎంపీపీ స్కూల్, సీతారాంపురం, దామెర	వరంగల్ (రూరల్)
బాలికల ప్రాథమికోన్నత పాఠశాల, శంకరంపేట	మెదక్
కేజీబీవీ, కొలుతకోట, అమ్మభక్తా	వనపర్తి
మార్కెట్ కమిటీ, మర్పల్లి	వికారాబాద్

ప్రభుత్వేతర సంస్థలు

లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, గర్లొడ్డు	ఖమ్మం
జర్నలిస్ట్ అండ్ ప్రెసిడెంట్ రోటరీ క్లబ్	జగిత్యాల
వందేమాతరం ఫౌండేషన్ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్	వరంగల్ (రూరల్)
అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ, రామాయంపేట	మెదక్
ప్రతిభ స్కూల్, పరిగి	వికారాబాద్

కార్పొరేట్ సంస్థలు

ఇన్ఫోసిస్	మేడ్చల్
సొనాలియా క్యాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ఆటోమేటివ్ పార్క్	మెదక్

పట్టణ స్థానిక సంస్థలు

పురపాలక పరిపాలనా విభాగం	జగిత్యాల
నర్సంపేట నగర పంచాయతీ, వరంగల్	వరంగల్ (రూరల్)
మెదక్ మున్సిపాలిటీ, వార్డునంబర్-1	మెదక్

పట్టణ గ్రామీణ పరిపాలనా సంస్థలు

రాంనగర్ గ్రామ పంచాయతీ, కొడిమ్యాల్ మండలం	జగిత్యాల
చిప్పలపల్లి, గ్రామపంచాయతీ	సిరిసిల్ల రాజన్న
కన్నారావు పేట గ్రామ పంచాయతీ, నల్లబెల్లి	వరంగల్(రూరల్)
భజ్రాన్‌పల్లి గ్రామం, శంకరంపేట	మెదక్
పెద్దగూడెం గ్రామ పంచాయతీ	వనపర్తి
మాలేగావ్, కుబీర్ మండలం	నిర్మల్

19 నుంచి బజరంగ్‌దళ్ జాతీయ సమావేశాలు



మీడియాతో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు తదితరులు

ఖైరతాబాద్: అఖిలభారత బజరంగ్‌దళ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈ నెల 19, 20 తేదీల్లో గుజరాత్‌లోని ఘన్‌శ్యాంభవన్‌లో నిర్వహించనున్నట్టు విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సమావేశాలకు ముఖ్య అతిథులుగా వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్‌భాయ్ తొగాడియా, సంయుక్త కార్యదర్శి సురేంద్రజైన్, బజరంగ్‌దళ్ అఖిలభారత కన్వీనర్ మనోజ్‌వర్మ, కోకన్వీనర్ సోనాల్‌జీ తదితరులు హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో బజరంగ్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్, ఉపాధ్యక్షుడు సుభాష్‌చందర్, వీహెచ్‌పీ రాష్ట్ర సహప్రచార ప్రముఖ్ పీ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి సంధ్యా కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన రిటైర్డ్ ప్రొఫెసర్ గాజుల శ్రీరాములు కుమార్తె సౌమ్యశ్రీ-కృష్ణచైతన్య వివాహానికి హాజరైన గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, టీ న్యూస్ ఎండీ జోగినపల్లి సంతోష్‌కుమార్ తదితరులు కూడా ఉన్నారు.



శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి నివాసంలో ఆయన చిన్న కుమారుడు క్రాంత్‌కుమార్, నవ్య దంపతులను ఆశీర్వదిస్తున్న గవర్నర్ నరసింహన్ దంపతులు. క్రాంత్‌కుమార్, నవ్యల వివాహం శుక్రవారం శంషాబాద్‌లో జరిగిన విషయం తెలిసిందే.

తెలుగు భాషకు ప్రాధాన్యమివ్వాలి

- పాఠశాలల్లో తప్పనిసరి చేయాలి
- కేంద్రమంత్రి దత్తాత్రేయ సూచన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ :

ప్రభుత్వ ఉత్తరప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే జరుగాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగును తప్పనిసరిగా బోధించాలని కేంద్ర ఉపాధి, కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఆచార్య రవ్వా శ్రీహరి పంచసప్తతి మహోత్సవం సందర్భంగా నిర్వహించిన 'శ్రీహరి సమగ్ర రచనల సాహితీ సమాలోచనం' సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. రవ్వా శ్రీహరి ఆదర్శవంతమైన సాహితీవేత్త అంటూ కొనియాడారు. నిఘంటువులు, పదకోశాలు, అనువాదాలతో సాహిత్యాన్ని జన సామాన్యానికి చేరువ చేశారన్నారు. ఇంగ్లిష్ ప్రభావం పెరుగుతున్న ప్రస్తుతం తరుణంలో పత్రికలే తెలుగును సజీవంగా ఉంచుతున్నాయని పేర్కొన్నారు. విశిష్ట అతిథి తెలుగుయూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ అనే పేరెత్తలేని కాలంలోనే రవ్వా శ్రీహరి నల్లగొండ మాండలిక పదకోశాన్ని రూపొందించారని చెప్పారు. కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు కోవెల సుప్రసన్నాచార్యులు మాట్లాడుతూ సాహితీరంగంలో ఒకప్పటి స్థాయి పండితులు ఇపుడు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్కృత విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రజ్యోతి సంపాదకుడు కే శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీహరి శాస్త్రీయదృష్టి గల వ్యక్తి అని కొనియాడారు. నిఘంటువు రూపకల్పనలో మౌఖిక సాహిత్యం మొదలు అన్ని రకాల సాహితీ పద ప్రయోగాలను స్వీకరించాల్సి ఉంటుందని, అలాంటి ప్రయత్నమే శ్రీహరి చేశారన్నారు. ఇంగ్లిషు పదాలకు సమానార్థాలకోసం సంస్కృతంపై ఆధారపడాల్సి వస్తుందని, అందుకోసమైనా సంస్కృత అభ్యాసం కొనసాగించాలని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖ మాజీ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకటరెడ్డి సభకు అధ్యక్షత వహించగా తెలుగు అకాడమి పూర్వ సంచాలకుడు యాదగిరి, పిల్లలమర్రి రాములు తదితరులు పాల్గొన్నారు. రవ్వా శ్రీహరి విమర్శ - పరిశోధన గ్రంథాలపై, భాషా వ్యాకరణాలపై శ్రీరంగాచార్య, మసన చెన్నప్ప, వైద్యం వేంకటేశ్వరాచార్యులు, జీ చెన్నకేశవరెడ్డి పత్రాలను సమర్పించారు.



శనివారం హైదరాబాద్‌లోని తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో ఆచార్య రవ్వా శ్రీహరి పంచసప్తతి మహోత్సవంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి దత్తాత్రేయ. చిత్రంలో యూనివర్సిటీ వీసీ సత్యనారాయణ తదితరులు కూడా ఉన్నారు.



తమ పదోన్నతుల అంశాన్ని డిప్యూటీ సీఎం మహమూద్ అలీకి విన్నవిస్తున్న డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్‌ఏల సంఘం సభ్యులు



శనివారం హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డికి తన చిత్రపటాన్ని బహూకరిస్తున్న డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్‌ఏల సంఘం సభ్యులు


డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్‌ఏల పదోన్నతులకు కృషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీపీఎస్సీ ద్వారా నియమితులైన డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించేందుకు ప్రయత్నిస్తామని ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ హామీ ఇచ్చినట్లు సంఘం అధ్యక్షుడు వింజమూరి ఈశ్వర్ తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్‌ఏల సంఘం సభ్యులు శనివారం డిప్యూటీ సీఎంతోపాటు ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డిని కలిశారు. ఆరునెలల్లోగా పదోన్నతులు కల్పిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని విన్నవించారు. సమావేశంలో సంఘం జనరల్ సెక్రటరీ కరుణాకర్, ఉపాధ్యక్షుడు కోమండ్ల రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నిజాం, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న, వైష్ణవి, రాజేశ్వరి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూహెచ్‌ను తొలిస్థానంలో నిలుపాలి

త్వరలో 186 అధ్యాపక పోస్టుల భర్తీ

పీజీ హాస్టల్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం కడియం ప్రకటన



శనివారం హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జేఎన్టీయూహెచ్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

కేపీహెచ్‌బీకాలనీ: దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీ, నిట్‌లతో జేఎన్టీయూహెచ్ పోటీపడి ప్రథమస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని డిప్యూటీ సీఎం, ఉన్నత విద్యాశాఖమంత్రి కడియం శ్రీహరి కోరారు. శనివారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో జేఎన్టీ యూహెచ్‌లో రూ. 22 కోట్ల వ్యయంతో నిర్మించిన పీజీ హాస్టల్ భవనాన్ని వీసీ ఏ వేణుగోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎన్ యాదయ్య, ప్రిన్సిపాల్ కే గోవర్ధన్‌తో కలిసి ప్రారంభించారు. తర్వాత హాస్టల్ ప్రాంగణంలో మొక్కలను నాటి మాట్లాడారు. ఖాళీగా ఉన్న 186 అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తామని హామీఇచ్చారు. సింగపూర్ యూనివర్సిటీ తరహాలో ప్రణాళికాబద్ధంగా జేఎన్టీయూహెచ్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. వర్సిటీ అధికారుల సలహాలతోనే రాష్ట్రంలో ప్రధాన భవన నిర్మాణాలు జరుగుతాయని, వర్సిటీలో మాత్రం ప్రణాళికబద్ధంగా వసతులు లేవని అధికారులకు చురకలంటించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరూర్‌లో లక్ష క్యూసెక్కుల ప్రవాహం

సముద్రంలోకి 255 టీఎంసీలు ● ఈ ఏడాది వాడేది 11.32 టీఎంసీలే

వచ్చే ఏడాదితో నిస్సహాయతకు స్వస్తి ● పునర్జీవంతో గోదావరికి కొత్త నడుక

కృష్ణా బేసిన్‌లోని ఆల్మట్టికీ తగ్గుతున్న ఇన్‌ఫ్లో

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో గోదావరి ప్రవాహం ముగిసి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించే పేరూర్ వద్ద ఈ క్షణాన గోదావరిలో ఉన్న ప్రవాహం లక్ష క్యూసెక్కులు. కానీ తెలంగాణ భూభాగంలో గోదావరిపై ఉన్న ప్రాజెక్టుల్లోకి వస్తున్న ఇన్‌ఫ్లో మాత్రం 1252 క్యూసెక్కులు. ఒకవైపు ఒక్క టీఎంసీ వరద లేక ప్రాజెక్టులన్నీ పడిగాపులు కాస్తుంటే, మరోవైపు కండ్ల ముందునుంచి రోజుకు 10 టీఎంసీలు దిగువన సముద్రంలోకి పోతున్నాయి. పేరూర్ ప్రాంతంలో గోదావరి 74.69 మీటర్ల ఎత్తులో దిగువకు పోతున్నది. ఇందులో కొంతమేర దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోస్తున్నా నిల్వ చేసుకునేందుకు అక్కడ రిజర్వాయర్లు లేవు. ఈ ఒక్క ఏడాది ఇలాంటి దుస్థితి తప్పదని, వచ్చే సంవత్సరానికి శ్రీరాంసాగర్ పునర్జీవ పథకం పూర్తి చేస్తే మేడిగడ్డనుంచి గోదావరిని తరలించవచ్చని జలరంగ నిపుణులు చెప్తున్నారు. ఈ ఏడాది జూన్ ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు పేరూర్ మీదుగా 255 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. గత ఏడాది 2896.057 టీఎంసీలు వెళ్లిపోయాయి. సరాసరి 2 నుంచి 3వేల టీఎంసీలు ప్రతియేటా ఇలా సముద్రంలోకి పోతున్నాయి.

ఏ నెలలో ఎన్ని నీళ్లు...

43 ఏండ్ల కేంద్ర జలసంఘం లెక్కలను తీస్తే కాళేశ్వరం మీదుగా మే నెలలో సరాసరిన 3.1 టీఎంసీల ప్రవాహం, జూన్‌లో 50.9 టీఎంసీలు, జులైలో 299.9 టీఎంసీలు, ఆగస్టులో 607.1 టీఎంసీల ప్రవాహం ఉంటున్నది. అంటే పునర్జీవ పథకం పూర్తయితే జూన్ ఒకటో తేదీ నుంచే నీటిని లిఫ్టు చేయడం మొదలుపెట్టేందుకు ఇక్కడ అవకాశాలున్నాయన్న మాట. ఇప్పటికే లిఫ్ట్ పూర్తి చేశామనుకుంటే దిగువకు పోయిన 255 టీఎంసీల్లోంచి గరిష్ఠంగా ఎత్తి పోసుకొని జలాశయాలు నిండేవి. చెరువుల్లోనూ నిల్వ చేసుకొనే వాళ్లం.

దయనీయం కృష్ణాతీరం..

గోదావరి పరిస్థితి ఇలా ఉంటే మరోవైపు కృష్ణానది పరిస్థితి దయనీయంగా తయారైంది. ఈ ఏడాదిలో ఆల్మట్టికి 153 టీఎంసీల ఇన్‌ఫ్లో రాగా కర్ణాటక ఒడిసి పట్టింది. జూరాలకు ఇపుడు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే ఉంది. ఈ నీటిని లిఫ్టుల ద్వారా ప్రభుత్వం విడుదల చేస్తున్నది. అయితే నల్లగొండ పట్టణంతో పాటు 200 ఫ్లోరైడ్ గ్రామాలకు తాగునీటిని అందించే ఉదయ సముద్రంలో నిల్వలు మరో వారంరోజుల వరకు మాత్రమే వచ్చే అవకాశముంది. దీనితో నారాయణపూర్ నుంచి 15 టీఎంసీలను దిగువకు విడుదల చేయించేందుకుగాను కర్ణాటకతో ముమ్మర సంప్రదింపులు జరుగుతున్నాయి. అయితే శనివారం సాయంత్రంవరకు ఆ అంశంలో స్పష్టత రాలేదని నీటిపారుదలశాఖ వర్గాలు తెలిపాయి.

కోల్‌కతా కేంద్రంగా సెక్స్‌రాకెట్

ఏడుగురిని అరెస్టుచేసిన సైబరాబాద్ పోలీసులు



రాజేశ్ పర్వాల్, ఎండీ అఫ్సర్, అజయ్‌కుమార్ చౌదరి, గురురాజు శెట్టి, కల్లూరి శ్రావణ్‌రెడ్డి, కల్లూరి కిరణ్‌కుమార్‌రెడ్డి


హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఆర్థిక ఇబ్బందులు, అవకాశాలు లేని జూనియర్ ఆర్టిస్టులు, మోడల్స్‌ను డబ్బులతో ఎరవేసి విలాసాలకు బానిసలను చేసి అనేక రాష్ట్రాలు తిప్పుతూ వ్యభిచారం చేయించే ఓ ముఠా గుట్టును సైబరాబాద్ పోలీసులు రట్టుచేశారు. ఈ నెల 9న మాదాపూర్ సైబర్ హిల్స్ మైకాన్స్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో వ్యభిచారం జరుగుతున్నదనే సమాచారంతో మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు ఆకస్మికంగా దాడులు చేసి కొందరిని అరెస్టుచేశారు. వీరిచ్చిన సమాచారంతో కర్ణాటక, ముంబై, ఢిల్లీ, కోల్‌కతా పోలీసుల సహకారంతో ఆయారాష్ట్రాల్లో దాడులుచేసి మొత్తం ఏడుగురు నిర్వాహకులను అరెస్టుచేసి శనివారం హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. నిందితుల్లో దంపతులు రాజేశ్ పర్వాల్, ఆర్తి పర్వాల్‌తోపాటు ఎండీ అఫ్సర్, అజయ్‌కుమార్ చౌదరి, గురురాజు శెట్టి, సోదరులు కల్లూరి శ్రావణ్‌రెడ్డి, కల్లూరి కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. వీరి నుంచి రెండు మూడు కార్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారి సంజయ్ కోసం గాలింపు చేపట్టారు. నలుగురు బాధిత మహిళలను రక్షించారు.

ఖరీదైన ప్రాంతాల్లో దందా: కోల్‌కతాకు చెందిన సంజయ్ ఢిల్లీ, ముంబై, తెలంగాణ, కోల్‌కతా ప్రాంతాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని వ్యవస్థీకృతంగా మహిళలను అక్రమంగా రవాణా చేస్తూ వ్యభిచార దందాను నడిపిస్తున్నాడు. వ్యభిచారం అంతా ఖరీదైన ప్రాంతాలు, స్టార్ హోటళ్లలోనే జరుగుతుంది. ఒక్కరోజు కిరాయి కోసమే రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చుచేస్తారు. మహిళలను తరలించేందుకు విమానాలు, హై ఎండ్ కార్లనే ఉపయోగిస్తారు. వీరి నెట్‌వర్క్‌లోని వాట్సప్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్‌లో మహిళ ఫొటో, ఫోన్‌నంబర్, ధరను పోస్టు చేస్తారు. ఏడు రాష్ట్రాల్లో ఉన్న ముఠా సభ్యులకు ఎక్కడ చిక్కినా మిగతా రాష్ట్రాల్లో తిప్పుతూ దందా నిర్వహిస్తున్నారు. విటులను ఆకర్షించేందుకు 50 వెబ్‌సైట్లు రూపొందించారు. పదిరోజులపాటు సైబరాబాద్ మాదాపూర్ ఎస్వోటీ జోన్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ సారథ్యంలో చేసిన దర్యాప్తుతో పలు రాష్ట్రాల్లో నడుస్తున్న ఈ దందా గుట్టు బహిర్గతమైంది. పట్టుబడ్డ నిందితుల్లో ఆర్తి కూడా ఒకప్పుడు బాధితురాలే. దందాలో పరిచయమైన రాజేశ్‌ను వివాహం చేసుకుని దందాలో భాగమైంది.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
ఆదివారం 13 ఆగస్టు 2017

WWW. NTNEWS.COM



ప్రియమైన దర్శకులారా.. పుడమితల్లికి పచ్చచీర కట్టినట్లుండే పసిడి సిరుల పంటపొలాలు..
కనులను కనువిందుచేస్తూ ఆహ్లాదపరిచే అందమైన గుట్టలు.. ఎగుడు దిగుడుగా ఉండి ఎల్లలను సూచించే ఎత్తయిన కొండలు..
జలజల పారుతూ ఝరీవేగంతో సుయ్(మని దుంకే జలపాతాలు.. నల్లరేగడి నారు మడుల్లో నాట్యం చేసే నాగటి సాళ్లు.. చూస్తే ఏమనిపిస్తుంది?
తెలంగాణ అందాలు తీసిన కనువిందురో అనిపించదూ?!
ఆదిలాబాద్ అడవి తల్లిని.. ఖమ్మం సెలయేళ్లను.. రంగారెడ్డి నల్లరేగడిని..నిజామాబాద్ పచ్చని పైర్లను చూస్తే..
ఏ అమెరికా అందాలు.. కోనసీమ హొయలు అవసరం లేదంటున్నారు ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల.
కల్మషం లేని తెలంగాణ మనుషుల మధ్య.. చూస్తే కడుపునిండిపోయే తెలంగాణ అందాలతో ఎన్ని సినిమాలైనా తీయొచ్చంటున్నారు.!
ఫిదా అనుభవాలు.. భవిష్యత్ తెలంగాణ సినిమా గురించి శేఖర్ కమ్ముల ఏమంటున్నారో.. ఆయన మాటల్లోనే..

తెలంగాణ అందాలు.. తీసిన కనువిందురో!

Photo Courtesy: DSN Films

మధ్యతరగతి అనుబంధాలతో తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో సాధారణ కథాంశాలతో సినిమాలు వచ్చాయా? లేదా? అని పరిశోధిస్తే అలాంటి సినిమాలు రాలేదని అర్థమైంది. ఆ నేపథ్యంలో సన్నివేశాలను రాయడం మొదలుపెట్టాం. అప్పటికీ ఈ కథతో సినిమా చేయాలని గానీ, దిల్‌రాజు నిర్మాతగా అనుకోలేదు. లొకేషన్స్ కోసం తెలంగాణ ప్రాంత వాతావరణం ఎలా ఉంటుందో చూడాలని రంగారెడ్డి జిల్లా పరిసర ప్రాంతాలు తిరిగాం. అక్కడి గుట్టలు, పచ్చటి పొలాలు, చెట్లు, ప్రకృతి చాలా నచ్చాయి. దాంతో తెలంగాణ కథాంశంతో సినిమా చేస్తే వర్కవుట్ అవుతుందని భరోసా రావడంతో పూర్తి కథను సిద్ధం చేసుకున్నాను. తెలుగు సినిమాల్లో పల్లెటూరు అనగానే కోనసీమను ఎక్కువగా చూపిస్తుంటారు. మేము మాత్రం ఆ పంథాకు భిన్నంగా చాలారోజుల క్రితమే అడుగులు వేశాం. అనీష్ కురువిల్లా దర్శకత్వంలో నేను నిర్మించిన 'ఆవకాయ్‌బిర్యానీ' సినిమా తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. ఆ సినిమా సక్సెస్ కాకపోవడంతో దాని గురించి ఎవరికీ పెద్దగా తెలియకపోవచ్చు. వికారాబాద్‌లో ఆ సినిమాను చిత్రీకరించాం. నల్లటి మట్టితో కూడిన అక్కడి భూములు, అటవీ ప్రాంతాన్ని చూడగానే భౌగోళికంగా మా సినిమాకు అదే అనుకూల ప్రాంతమనిపించింది. మా ఊహలకు భిన్నంగా చాలా అందంగా అక్కడి లొకేషన్స్ ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత వాటికి గుర్తింపు వచ్చింది.

తొలుత ఫిదా సినిమాకు ముసురు అనే పేరు పెడదామని అనుకున్నాను. దిల్‌రాజు 'పల్లకి' పేరయితే బాగుంటుందని సలహా ఇచ్చారు. హఠాత్తుగా ఓ రోజు 'ఫిదా' అనే పదం మనసులో మెదిలింది. దివంగత రచయిత సి.నారాయణ రెడ్డి తన రచనల్లో ఉర్దూ మేళవింపుతో కూడిన ఇలాంటి పదాలను తరుచుగా వాడేవారు. కాబట్టి మా సినిమాకు ఫిదా టైటిల్ బాగుంటుంది. ఈ సినిమాలో తెలంగాణ సంస్కృతులు సంప్రదాయాలపై అవగాహన పెంచుకుంటూ ప్రతి సన్నివేశాన్ని సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశాం. పెండ్లి సన్నివేశాలతో పాటు పాత్రల పేర్లు, బతుకమ్మ పండుగ, పోలు పోయడం... ఇలా ప్రతీదీ ఉన్నది ఉన్నట్లుగానే చూపించాం. నాగబాబు గారు చెప్పినట్లు ఈ సినిమా కలల ప్రపంచంలో విహరించిన అనుభూతిని కలిగిస్తుంది. చాలా రోజుల పాటు ప్రతి ఒక్కరినీ వెంటాడుతుంది. ఈ సినిమా విషయంలో నేను అనుకున్న లక్ష్యాన్ని సాధించినందుకు గర్వపడుతున్నాను. సృష్టిలో ఇప్పటివరకూ ఎప్పుడు, ఎక్కడ జరుగని అంశాల పట్ల నాకు ఆసక్తి ఎక్కువ. ఈ సినిమా కథ నాలో అలాంటి ఆసక్తినే రేకెత్తించింది. తండ్రీకూతుళ్ల అనుబంధం, వారి మధ్య వచ్చే సంభాషణలు హృదయాన్ని సృశిస్తాయి. నాకున్న అవగాహన మేరకు హైదరాబాదీ మాండలికంలోనే స్వచ్ఛమైన తెలంగాణ సినిమాను తీశా.

అంకాపూర్‌కు చికెన్ కోసం..

ట్రావెలింగ్ అంటే నాకు చాలా ఇష్టం. అంకాపూర్‌లో చికెన్ బాగుంటుందని తెలియడంతో తినడానికి అక్కడకు వెళ్లాం. పచ్చదనంతో నిండిపోయిన అక్కడి నర్సరీల అందాలు నన్ను ఆకట్టుకున్నాయి. దాంతో ఆ ప్రాంతంలోనే 'ఫిదా'ను తెరకెక్కించాలని నిర్ణయించుకున్నాను. నా సినిమాల్లో సెట్స్ వేయడం అలవాటు లేదు. సహజంగా ఉండాలని హీరోయిన్ ఇంటి కోసం అన్వేషిస్తూ బాన్సువాడ వెళ్లాం. ఆ ఊరిలో విఠల్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన పురాతన కాలం నాటి ఇళ్లు చాలా నచ్చింది. స్వతంత్ర సమరయోధుల ఫొటోలతో పాతకాలం నాటి డిజైన్‌తో వైవిధ్యంగా ఉంది. నా ఆలోచనలకు అనుగుణంగా ఆ ఇంటిని, పరిసరాల్ని తీర్చిదిద్దాం. దాదాపు యాభై రోజుల పాటు బాన్సువాడలో చిత్రీకరణ జరిపాం. అక్కడ షూటింగ్ ఓ బ్యూటీఫుల్ ఎక్స్‌పీరియన్స్. అమెరికా కంటే బాన్సువాడే నాకు బాగా నచ్చింది. ఆ ప్రాంతం వారు మా సినిమాలో భాగమయ్యారు. ప్రతి రోజు పిల్లలను స్కూళ్లకు పంపించిన తర్వాత ఆడవాళ్లంతా సెట్స్‌కు వచ్చేవారు. సినిమాలో కీలకమైన పెండ్లి సన్నివేశాలను అక్కడి ప్రజల మధ్యే చిత్రీకరించాం. షూటింగ్‌కు అనుగుణంగా వారు ఎలాంటి బట్టలు ధరించాలో, ఏ వయస్సు వారు అవసరమో... ఇలా ప్రతి విషయంలో మా డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ చాలా హార్డ్‌వర్క్ చేసింది. బాన్సువాడలో షూటింగ్ జరుగుతున్నన్నాళ్లు మాకు అవసరమైన ఆరిస్టుల కోసం ప్రతిరోజు ఆ ప్రాంతం వారిని ఆడిషన్స్ చేసేవాళ్లం. చిత్రీకరణకు అవసరమైన వారిని పట్టుకోవడం, సంభాషణల విషయంలో వారికి శిక్షణను ఇప్పించడంపైనే రాత్రింబవళ్లు నిమగ్నమయ్యాం. కొన్నిసార్లు అనవసరంగా తమను పిలిచారని అక్కడి వారు కోపగించుకున్న సందర్భాలు ఉన్నాయి. అలాంటి వారిని సముదాయించడం, వారి పాత్రలను మార్చకుండా మాకు అనుగుణంగా సర్దుబాటు చేసుకోవడం ఇలా ప్రతిదీ ఓ అనుభవంగా మిగిలిపోయింది. ఏడు గంటలకు షూటింగ్ అంటే ఉదయం ఐదు గంటలకే సిద్ధమై మా కసరత్తులు మొదలుపెట్టేవాళ్లం. మా షూటింగ్‌కు అవసరమైన చిన్న చిన్న వస్తువులను ఇంటింటికి తిరిగి సేకరించాం. ప్యాకప్ చెప్పేరోజు బాన్సువాడ ప్రజలు భావోద్వేగానికి లోనయ్యారు. వారితో ఉన్న అనుబంధాన్ని దృష్టిలో పెట్టుకొని ఆడియో వేడుకకు అందరిని ఆహ్వానించాం.

పక్కా హైదరాబాదీని..

నేను పక్కా హైదరాబాదిని. నా మాటతీరు మిక్స్‌డ్‌గా ఉంటుంది. అన్ని భాషలను కలిపి మాట్లాడుతుంటాను. ఇక్కడే పుట్టిపెరిగాను. నా చదువంతా హైదరాబాద్‌లోనే సాగింది. ఆ ప్రభావం నా రచనా శైలిపై పడింది. తెలంగాణ మాండళికంలో ఏదైనా తొందరగా రాయగలను. ఆ రాయడంలో నవ్వించడం, గేలిచేయడం కాకుండా ప్రేమ దాగి ఉంటుంది. అందుకే అందరూ నా మాటలతో తొందరగా ప్రేమలో పడుతారు. 'ఫిదా' సినిమాను బాధ్యతతో చేశాను. ఇక్కడి సంస్కృతులు, సంప్రదాయాలు, భాష, ప్రాంతాలపై ఇష్టం పెంచుకొని ఈ సినిమాను తెరకెక్కించాను.

- సినిమా డెస్క్



మా సినిమా అని గర్వపడ్డారు...

బాన్సువాడలో షూటింగ్ చేసిన ఇల్లు నిర్మాత దిల్ రాజు తమ్ముడైన శిరీష్ బంధువులది. సినిమా చిత్రీకరణ సమయంలో రాష్ట్ర మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి మాకు అన్ని విధాలుగా సహకరించారు. లొకేషన్స్‌తో షూటింగ్‌కు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. మా సినిమా ప్రారంభోత్సవ వేడుకకు ఆయన వచ్చారు. తెలంగాణ సినిమా తీస్తున్నామని తెలియగానే గర్వపడ్డారు. సినిమా తర్వాత బాన్సువాడ పేరు మారుమోగిపోతుందనే నమ్మకముంది. అక్కడ షూటింగ్ చేసిన అనుభవాల్ని పదే పదే చెప్పాలనిపిస్తుంది. భవిష్యత్తులో బాన్సువాడలో చాలా సినిమాల షూటింగ్‌లు జరుగుతాయనే నమ్మకముంది. తెలంగాణ ప్రాంతాలు కొత్త ట్రెండ్‌గా సృష్టిస్తాయని అనుకుంటున్నాను. బాన్సువాడలో ఓ పాటను చిత్రీకరించే సమయంలో వేసవి రావడంతో పచ్చదనం కోసం చాలా రోజులు వేచిచూశాం. వేరే ప్రాంతంలో తీద్దామని యూనిట్ చెప్పినా నేనే వద్దన్నాను. ఆ ప్రాంతంపై ఉన్న ప్రేమ మమ్మల్ని కట్టిపడేసింది. సినిమా చూస్తున్న వారు మన ఇంట్లో జరుగుతున్న కథే అన్న అనుభూతికి లోనవుతారు. పాత్రల తీరుతెన్నుల, వారు మాట్లాడే మాటలు ప్రతి ఒక్కరినీ అలరిస్తాయి. నా దృష్టిలో సినిమాను సహజత్వానికి దగ్గరగా ఆవిష్కరించడంలోనే ఎక్కువ కష్టం దాగి ఉంది. ఆ శ్రమే మా సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టింది.



మూసధోరణిని బ్రేక్ చేశాం...

'ఫిదా' చిత్రంలో పాత్రల పరంగా మూసధోరణిలో కాకుండా అంతా కొత్తవారిని తీసుకోవాలని భావించాం. ఆ ఆలోచనతోనే తండ్రి పాత్ర కోసం సాయిచంద్‌ను సంప్రదించాం. పాటల విషయంలో 'వచ్చిండే.. అనే గీతాన్ని గాయని మధుప్రియతో పాడించాం. తెలంగాణ బాణీలో సాగే ఈ గీతం పెద్ద హిట్టయింది. భాష, సంభాషణలను బట్టే ఈ సినిమా పెద్ద విజయాన్ని సాధిస్తుందనే చిత్రీకరణ మొదలైన కొద్ది రోజులకే అర్థమైపోయింది. తెలంగాణ నేపథ్యం 'ఫిదా' సినిమాకు చాలా ఎస్సెట్. ఈ సినిమాతో ఇదొక కొత్త ట్రెండ్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. ఆ నమ్మకమైతే నాకు ఉంది. అందుకే జాగ్రత్తగా, బాధ్యతతో సినిమా చేశాం. చాలా అందంగా వచ్చింది. హీరో హీరోయిన్ల మాటలు, వారి ప్రేమకథ రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా ఉంది. ప్రాంతీయ భేదాలకు తావు లేకుండా తెలంగాణ కుటుంబంలో ఉండే అనుబంధాలను, ఆప్యాయతలను మనసుల్ని హత్తుకునేలా తెరపై దృశ్యమానం చేశాం. గతంలో తెలంగాణ నేపథ్యంలో గౌతమ్‌ఘోష్ 'మాభూమి' సినిమా తీశారు. ఆ సినిమాతో పోలిస్తే 'ఫిదా' భిన్నంగా ఉంటుంది. తెలంగాణ సినిమాలంటే పటేల్‌దారుల పెత్తనాలు, దోపిడీలు, దౌర్జన్యాలే కనిపిస్తాయి. ఆ మూసధోరణిని ఈ సినిమాతో బ్రేక్ చేశాం.



హ్యాపీడేస్ రోజులు గుర్తొచ్చాయి...

'ఫిదా'తో పాటు గోదావరి సినిమా నా ఆలోచన దృక్పథాన్ని మార్చాయి. నాలో మార్పుల్ని తీసుకొచ్చాయి. 'ఫిదా' విషయంలోనూ అదే జరిగింది. తెలంగాణలో పెండ్లి తంతు, భాషలు, వాటి మధ్య ఉండే సారూప్యతను అర్థం చేసుకున్నాం. మాకున్న పరిధుల్లో కమర్షియల్ అంశాలను దృష్టిలో పెట్టుకొని అందరికి అర్థమయ్యే భాషనే సినిమాలో చూపించాం. 'ఫిదా' టీమ్‌ను చూడగానే 'హ్యాపీడేస్' రోజులు గుర్తొచ్చాయి. ఆ రోజుల్లో హాస్టల్‌లో ఉంటూ 70 రోజుల్లో ఆ సినిమాను పూర్తిచేశాం. అలాగే ఫిదా సినిమాలో కోసం సాయిచంద్‌తో పాటు సిరివెన్నెల సీతారామశాస్త్రి గారి అబ్బాయి, హీరోహీరోయిన్లతో పాటు యూనిట్ అందరం కుటుంబంలా కలిసిపోయి పనిచేశాం. చిత్రీకరణ సమయంలో కూతురుకు పెళ్లిచేసి అత్తారింటికి పంపించినట్లనిపించింది. తెలంగాణ నేపథ్యం నాలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చింది. సిటీలో ఉండే గొడవలన్నీ వదిలేసి సరదాగా కారులో తెలంగాణ ప్రాంతాలన్ని తిరగాలని అప్పుడప్పుడు అనిపిస్తున్నది. పచ్చదనం, కల్మషం లేని మనుషులతో తెలంగాణ చాలా అందంగా ఆహ్లాదకరంగా ఉంటుంది.

బుజ్జిగాడు.. నేను లోకల్



ఫిదాలో బుజ్జిగాడుగా నటించిన బాల నటుడు ఆర్యన్ మనోడు. మన నిజామాబాద్ బిడ్డ. అమెరికాలో ఉంటున్న ఆర్యన్ పరిచయం.

ఎనిమిదేళ్ల వయసున్న పిలగాడు. మొదటిసారి వెండితెర మీద నటించిండు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉంటున్నాడు. డబ్‌స్మాష్‌లు చేసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేశేటోడు. స్కూల్లో జరిగే కల్చరర్ ప్రోగ్రామ్‌లల్ల పాల్గొంటాడు. యూట్యూబ్‌లో ప్రత్యేక ఛానల్ పెట్టి వీడియోలు కూడా చేస్తున్నాడు. ఆ వీడియోలు చూసి దర్శకుడు శేఖర్ కమ్ముల అవకాశం ఇచ్చిండట. మొదటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిరూపించున్నాడు. తాళ్ల ఆర్యన్‌ది నిజామాబాద్ జిల్లా బోధన్. ఆర్యన్ తల్లి వీణ, తండ్రి చందు పెండ్లి తర్వాత అమెరికాలో స్థిరపడ్డారు. ఫ్రైడ్ ఎలిమెంటరీ స్కూల్ ఆఫ్ టంపాలో మూడో తరగతి పూర్తి చేసుకుని నాలుగో తరగతి అడుగుపెడుతున్నాడు ఆర్యన్. భవిష్యత్తులో డాక్టర్ కావాలనుకుంటున్నా.. ప్రస్తుతం చదువుతో పాటు నటించడమే తన కోరిక అని చెప్తున్నాడు. ఆర్యన్ తండ్రి తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఫ్లోరిడా అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. ఉద్యమ సమయం నుంచి అక్కడ నుంచి తమవంతుగా ఏదో ఒక విధంగా తెలంగాణ గడ్డ అభివృద్ధి కోసం పాటుపడుతూనే ఉన్నారు. ఆర్యన్ తాత తాళ్ల విశ్వనాథం ఇరవై ఏళ్ల క్రితం బాన్సువాడలో డివిజనల్ పంచాయతీ ఆఫీసర్‌గా సేవలందించారు. తాత సేవలందించిన బాన్సువాడ నలభై రోజుల పాటు ఉండి షూటింగ్ పాల్గొన్నందుకు గర్వంగా ఉందంటున్నాడు ఆర్యన్. ద ఓరియో మ్యాన్ పేరుతో యూట్యూబ్ చానల్ పెట్టి ప్రత్యేక వీడియోలను రూపొందిస్తున్నాడు.

ఫిదా సినిమాలో నటించడానికి ఓ బాల నటుడు కావాలని చాలా ప్రయత్నం చేశారు. ఇండియన్ అయితే అమెరికా షూటింగ్‌కు వెళ్లాలంటే.. వీసా వస్తుందో రాదో అనే భయంతో అమెరికా చిన్నారులకు ఆడిషన్స్ చేశారు. ఆడిషన్స్ కోసం చాలామంది వీడియోలు పంపారు. ఆర్యన్ తల్లిదండ్రులు కూడా పంపారు. వందలమంది పంపినా ఆర్యన్ ఫైనల్‌గా సెలక్ట్ అయ్యాడు. ఆ తర్వాత తెలిసిన విషయం ఏమిటంటే ఆర్యన్ వాళ్లది నిజామాబాద్ జిల్లానే అని.. దాంతో మరింత సులభం అయింది. చాక్లెట్ అంటే ఇష్టంతో అమెరికా నుంచి వస్తున్నప్పుడు బ్యాగ్ నిండా చాక్లెట్లు నింపుకొని వచ్చాడు. ఆర్యన్ అమెరికా ఫ్రెండ్స్ అంతా హే.. సూపర్ స్టార్ అంటున్నారని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాడు. బాస్కెట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్ ఆటల్లో రాణించాలనుకుంటున్న ఆర్యన్‌కు కామెడీ అంటే కూడా ఇష్టం.

91 ఏళ్లకు డిగ్రీ పట్టా!

చదువాలని మనసు ఉండాలే కానీ.. దానికి వయసుతో పనిలేదని నిరూపించిందీ బామ్మ. 91ఏళ్ల వయసులో చదువు పై ధ్యాస పెట్టి డిగ్రీ పట్టా సంపాదించింది.



పెద్దలు కష్టపడి చదువమని పంపిస్తే.. కాలేజీలు ఎగ్గొట్టి, పరీక్షలు ఫెయిలయి పోతున్నారు చాలా మంది. కానీ పట్టుదల ఉంటే పరీక్షల్లో పాసై పోవచ్చు అని తన రిజల్ట్‌తో చూపించింది కిమ్లున్ జినకుల్. ఈమె వయసు ఇప్పుడు 91 సంవత్సరాలు. 'కృష్ణా రామా' అంటూ కూర్చునే వయసులో ఆమె పట్టుదలతో చదివి పరీక్షలు రాసింది. కాకపోతే అన్ని సబ్జెక్టులు పాసవడానికి మాత్రం పది సంవత్సరాల కాలం పట్టిందనుకోండి. ఇన్ని సంవత్సరాలు పట్టడానికి కారణం కూడా లేకపోలేదు. వయసుతో పాటు వచ్చే అల్జీమర్స్ ఆమెను బాధిస్తున్నా చదువు మీద ఉన్న ఆసక్తి ఆ అల్జీమర్స్‌ని అధిగమించి 'హ్యూమన్ అండ్ ఫ్యామిలీ డెవలప్‌మెంట్' బ్యాచిలర్ డిగ్రీలో పట్టా సంపాదించింది. థాయిలాండ్‌కి చెందిన ఈ బామ్మకి చదువంటే ప్రాణం. కానీ యుక్త వయసులోనే పెండ్లయిపోయింది. ఆ తర్వాత కుటుంబ బాధ్యతలతో చదువుకు ఫుల్‌స్టాప్ పడింది. మొత్తానికి ఇప్పటికి తన కల నెరవేరింది.

వేప చేసే మేలు



- వేప ఆకుల్లో యాంటీ సెప్టిక్ గుణాలు, ఔషధ గుణాలు ఉంటాయి.
- వేపాకులతో ఫేస్ ప్యాక్ వేసుకుంటే చర్మంపై వచ్చిన తెలుపు, నలుపు మచ్చలు తొలిగిపోతాయి.
- తామర, సోరియాసిస్ వంటి వ్యాధులకు వేప అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుంది. వేప విత్తులతో తీసే నూనెను వీటిపై రుద్దితే మంచి ఫలితం ఉంటుంది.
- వేపపొడితో నిమ్మరసం కలిపిన మిశ్రమాన్ని పెడితే మొటిమలు మాయమవుతాయి.
- వేపలో పుష్కలంగా ఉండే విటమిన్ ఇ చర్మానికి కావాల్సిన పోషకాలను అందిస్తుంది.
- చర్మంపై ఏర్పడే పగుళ్లను తగ్గించి, కణ నిర్మాణాన్ని మెరుగుపరుస్తుంది.
- వేప ఆకులతో కషాయం తయారు చేసి, చల్లారిన తర్వాత కాటన్ బాల్ సాయంతో రాతి పడుకునే ముందు ముఖానికి పెట్టుకోవాలి. ఉదయాన్నే కడిగేస్తే మంచి గుణం కనిపిస్తుంది.
- వేపాకుల పేస్టుకు దోసకాయ, పసుపు కలిపి పేస్టులా తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని అప్లై చేస్తే మొటిమలు మాయమవుతాయి.
- వేపనూనెను ఒక కప్పు నీటిలో కలిపి, ఆ మిశ్రమాన్ని చేతివేళ్లతో తీసుకుని నల్లటి వలయాలు ఏర్పడిన చోట రుద్దాలి. తరుచూ ఇలా చేస్తే మార్పు కనిపిస్తుంది.

మార్త.. ఓ వెలుగు దివ్వె

మనదేశంలో ఉన్నవాళ్లు మనకు సాయం చేయడం కష్టంగా ఉంది. అలాంటింది ఓ విదేశీయురాలై యుండి.. మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్న మహిళల బాధలు చూసి చలించిపోయింది. రహదారి సౌకర్యం కూడా లేని ఆ గ్రామాలకు తనవంతుగా ఏదైనా చేయాలని గట్టి నిర్ణయం తీసుకుంది. ఇంతకీ ఆమె ఏమీ చేసిందంటే..?



అమెరికాకు చెందిన పీహెచ్‌డీ విద్యార్థిని మార్త వండూజర్.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో చాలానే చేసింది. 2012లో యూపీకి వచ్చిన మార్త.. బెటర్ విలేజ్ బెటర్ వరల్డ్ నినాదంతో కేంద్రప్రభుత్వ సహాయంతో దాదాపు 143 పర్యావరణ హిత మరుగుదొడ్లను కట్టించింది. అంతేకాదు దాదాపు పది అడుగుల వెడల్పుతో దాదాపు 122 మీటర్ల రడ్ల నిర్మాణానికి చేయూతనందించింది. దాదాపు 82 మరుగుదొడ్లకు తన డబ్బులు ఖర్చుచేసింది. కరెంట్ సౌకర్యం లేని 27 ఇళ్లకు సోలార్ విద్యుత్‌ను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది మార్త.

గీతాంజలి




శ్లో. ఉత్తమే క్షణకోప స్స్యాత్, మధ్యమే ఘటికాద్వయం,
అధమే స్యా దహోరాత్రం, పాపిష్ఠే మరణాంతకమ్.

ఎలాంటివారికైనా ఎప్పుడో ఒకప్పుడు కోపం రాకుండా ఉండదు. కాని ఉత్తములైనవారిలో ఆ కోపం కొద్దిసేపు మాత్రమే ఉండి తగ్గిపోతుంది. మధ్యములలో రెండు ఘటియల సేపు మాత్రం ఉంటుంది. అధమ ప్రకృతి కలిగిన మనుషులలో వచ్చిన కోపం ఆ రోజంతా ఉంటుంది. ఇక బతికి ఉన్నంతవరకు కోపాన్ని మనసులో పెట్టుకున్నవాళ్లు పాపిష్ఠులు. వాళ్లది రాక్షసత్వమే అవుతుంది.

– భోజచరితం

కష్టేఫలి!

బుద్ధమార్గం



దేన్నైనా మూఢంగా నమ్మడం తగదంటాడు బుద్ధుడు. జ్యోతిషం, హస్తసాముద్రికం, వాస్తు – ఇలాంటి నమ్మకాల కంటే సమ్యక్ దృష్టి శ్రేష్ఠం అంటాడు. ప్రజల్లో ఉన్న ఇలాంటి మూఢ నమ్మకాల బలహీనతను ఆధారం చేసుకుని జీవించడం 'అకుశల జీవనం'గా చెప్తాడు. మూఢ నమ్మకాలు మనిషికి శత్రువుల కంటే ఎక్కువ నష్టం కలిగిస్తాయంటాడు. ఇందుకు బౌద్ధం లోని నందగోపుని కథే చక్కటి ఉదాహరణ.

నందగోపుడు ఒక రైతు. సరైన వ్యావసాయిక పద్ధతులు పాటించక నష్టపడ్డాడు. దీనికి కారణం 'ఇంటికి ఈశాన్యంలో మెరక ఉండడమే' అని చెప్పాడు ఒక సిద్ధాంతి. దానితో కొంత ఖర్చు చేసి, ఆ మెరకనంతా తవ్వించాడు. పెద్ద గుంట చేశాడు. వర్షానికి ఆ గుంట నీటితో నిండిపోయింది. ఆ ఇంట్లో ఉన్న నందగోపుని పారాడే పిల్లాడు అటుగా వెళ్లి, ఆ నీటిలో పడి చనిపోయాడు. మరో సిద్ధాంతి వచ్చి, 'దోషం అటూ లేదు, ఇటూ లేదు. ఇంట్లోనే ఉంది' అని కిటికీలు, దర్వాజాలు అటూ ఇటూ మార్చాలని చెప్పాడు. ఆ మాట ప్రకారం పనిచేస్తుంటే ఇంటి గోడలు కూలిపోయాయి. చేసేది లేక ఇల్లు పడగొట్టి కొద్దిపాటి నివాసం నిర్మించుకున్నాడు.

'ఈ సంవత్సరం నీ చేతి గీతలు బాగున్నాయి. నీవు పట్టిందల్లా బంగారమే. ఎంత వ్యవసాయం చేస్తే అంత లాభం' అన్నాడు ఒక జోస్యుడు. దానితో తన పొలమే కాకుండా చాలా ఎక్కువ పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం మొదలుపెట్టాడు. కానీ అనావృష్టి ఏర్పడి, తీవ్రంగా నష్టపోయాడు. ఇలా తన శ్రమని, పరిశ్రమని కాకుండా జోస్యాల్ని నమ్ముకుంటూ నష్టపడి, అప్పుల పాలయ్యాడు. అయినా తన ఆర్థిక నష్టాలు పోవాలని ఒక మంత్రగాడి దగ్గరకు వెళ్లాడు. అతను ఒక మంత్రం ఉపదేశించి, 'దీన్ని నట్టింట్లో కూర్చుని రోజుకు వెయ్యిసార్లు జపించు. నీ దరిద్రం పోతుంది' అని చెప్పి, మంచిగా సొమ్ములు గుంజి పంపాడు.

చేసే కొద్దిపాటి పనులు కూడా మాని, మంత్రజపం మొదలుపెట్టాడు నందగోపుడు. ఇంట్లో ఆర్థిక ఇబ్బందుల వల్ల భార్యాభర్తల మధ్య గొడవలు వచ్చాయి. భార్య విసిగి పుట్టింటికి వెళ్లిపోయింది.

నందగోపుని మిత్రుడు ఒకసారి తన వెంట నందగోపుణ్ణి బుద్ధుని ప్రవచనం వినడానికి తీసుకుపోయాడు. తన మిత్రుని విషయం బుద్ధునితో చెప్పాడు.

చేసే పని పట్ల సరైన దృక్పథం లేకపోవడాన్ని మిథ్యాదృష్టి అంటారు. నందగోపుడు ఈ మిథ్యాదృష్టిలో పడి మునిగిపోయాడని బుద్ధుడు గ్రహించి, సమ్యక్ దృష్టి గురించి వివరించాడు.

'ద్విట్ ద్విషం యత్ కుర్యాద్ వైరీ వా పునర్వైరిణం
మిథ్యాప్రణిహితం చిత్తం పాపీయాంసమేనం తతః కుర్యాత్!'

నందగోపా! పరమ విద్వేషం కలవారు, పరస్పరం ఒకరినొకరు నిరంతరం నాశనం చేసుకోవాలనుకునేవారు ఒకరికొకరు చేసుకునే నష్టం కంటే ఇలాంటి మూఢ నమ్మకాల వల్ల, మిథ్యా దృష్టి వల్ల కలిగే నష్టమే ఎక్కువ..'

'అలాగే.. నీ సమ్యక్ దృక్పథమే తల్లిదండ్రుల కన్నా, బంధుమిత్రుల కన్నా, హితుల కన్నా ఎక్కువ మేలు చేస్తుంది' – అని వివరించాడు.

నందగోపుడు తన తప్పు తెలుసుకుని, కష్టాన్ని నమ్ముకుని, క్రమేపీ కుదుటపడ్డాడు.

– బొర్రా గోవర్ధన్



సంపూర్ణావతారం.. కృష్ణావతారం!

కృష్ణతత్వంలో ఇమిడివున్న అంశాలేమిటి?

శ్రీమద్భాగవతం పండులా తియ్యనిది. ఇది 18000 శ్లోకాలతో ఉంది. దీన్ని మొదట శుక మహర్షి చెప్పడంతో మరింత తియ్యగా మారింది. కృష్ణావతారం దివ్యమైనదని చెప్తుంది భాగవతం. ఈ విషయాన్ని స్వయంగా కృష్ణుడే చెప్పాడు.

'జన్మ కర్మచ మే దివ్యం
ఏవం యో వ్యక్తితత్వతః
తత్య దేహం పునర్జన్మనైతి
మామేతి సో అర్జునః' (భగవద్గీత 4.9)

మనం ఎవరితోనైనా స్నేహం చేయాలన్నా, ఏ సంబంధమైనా కలిగి ఉండాలన్నా మన స్వభావం, అభిరుచుల గురించి మాట్లాడతాం. కృష్ణ భగవానుడు కూడా మనతో తన గురించి, తన స్వభావ లక్షణాల గురించి చెప్పాడు భగవద్గీత ద్వారా. తాను భౌతిక నియమాలకు అతీతమైనవాడినంటూ తనను తాను పరిచయం చేసుకున్నాడు. ఆయన జన్మ,కర్మలు దివ్యమైనవి. ఆయన సాధారణంగానే గర్భం నుంచి వచ్చినట్టుగానే అనిపిస్తుంది. కాని ఆయన పుట్టుకే అతిశయమైనది. దేవకి గర్భం నుంచి బయటికి రాగానే ఆమె ముందు నిల్చుంటాడు. సాధారణ పిల్లవాడు అలా నిలబడగలడా! ఆ తర్వాత చిన్న పిల్లవాడిలా మారిపోతాడు కాని శంఖ, చక్ర, గదాయుధాలన్నీ ఉంటాయి. అప్పుడు దేవకి ఆ అసామాన్యమైన రూపాన్ని చూసి కంసుడు ఊరుకోడని ఆయన్ని సాధారణమైన సామాన్య రూపంలోకి రమ్మని కోరుతుంది. అప్పుడు కృష్ణుడిలా సాధారణంగా కనిపిస్తాడు. ఆయన ఆధ్యాత్మిక ప్రపంచం నుంచి వచ్చిన స్వామి.

నిజానికి మనమందరం అక్కడి వాళ్లమే. ఆయన్ని కాదనుకుని వచ్చాం. ఆయన జగత్ప్రభువు కదా! తండ్రి దగ్గర మనకు కావాల్సినంత స్వేచ్ఛ ఉంది. అందుకే పిల్లవాడు ఆడుకోవడానికి ఇల్లు, బొమ్మలు అడిగినట్టుగా ఈ ప్రపంచాన్ని అడిగాం. మనం నివసిస్తున్నది వైకుంఠాన్ని పోలిన మరో చిన్న ప్రపంచంలో. ఆడుకోవడానికి మనం కోరిన మీదటే ఇంకో ప్రపంచాన్ని ఆయన సృష్టించాడట.

దశావతారాల్లో కృష్ణుడికి ఉన్న ప్రత్యేకతలేంటి?

కృష్ణుడితో మనకు 5 రకాల సంబంధాలుంటాయి.

- **మొదటిది శాంత రసం** : ఒక రకంగా చెప్పాలంటే ఇది భగవంతుడికీ, భక్తుడికీ ఉన్నటువంటి సంబంధం. ఏ బంధానికైనా ఆది, అంతం ఉంటుంది. కాని ఆయనతో ఉండేది శాశ్వతమైన బంధం.
  మన పైన ఉన్న శరీరం మన ఆత్మకు వస్త్రం లాంటిది. మనం ఆత్మ స్వరూపులం. ఆయనతో మనకు ఆత్మైక సంబంధం ఉంటుంది. ఆయన్ని చూస్తూ రసానుభూతి పొందే బంధమిది.
- **రెండవది దాస్య రసం:** భగవత్సేవలో తరించడం. హనుమంతుడు దాస్యానికి ప్రతీక.
- **మూడవది సఖ్యం:** ఆయనతో మనం స్నేహం చేయొచ్చు. స్నేహం ద్వారా ఆయన్ని కొలువొచ్చన్న మాట. ఇందుకు గొప్ప ఉదాహరణ కుచేలుడు, గోపకులు.
- **నాలుగోది వాత్సల్య రసం:** భగవంతుని పట్ల వాత్సల్యాన్ని కలిగి ఉండడం. ఈ సంబంధం ఆయనే కుమారుడు అనే అనుభూతిని కలిగిస్తుంది. ఇందుకు యశోద మంచి ఉదాహరణ.
- **అయిదవది మాధుర్య రసం:** ఇది రెండు రకాలు.
  స్వకీయం – పరమాత్మనే పతిగా ఆరాధించడం ఈ కోవలోదే. గోపికలు, కృష్ణుని భార్యలు ఈ కోవలోకే వస్తారు.
  పరకీయ – ఆయన్ని ప్రియునిలా భావించడం. రాధ ఈవిధంగానే ఆయన సేవలో తరించింది.

ఇన్ని రకాల సంబంధాల్లో మనం ఏది కావాలంటే అది ఎంచుకోవచ్చు.

'ఏ యథామాం ప్రపద్యంతే
తాం స్తథైవ భజామ్యహం'

నువ్వు ఎలా తలిస్తే అలా కనిపిస్తాను. ఏ రకంగా కావాలనుకుంటే అలా వస్తాను అన్నాడు కృష్ణ పరమాత్మ. అందుకే ఆయన్ని కల్పవృక్షం అంటారు. దశావతారాల్లో కెల్లా కృష్ణుడిని సంపూర్ణావతారం అంటారు. అన్ని రకాల సంబంధాలను ఒకే అవతారంలో చూపించాడు. ఆయన్ని అఖిల రసామృత సింధు అని అందుకే అంటారు.

బ్రహ్మానందం అంటాం కదా. అలాంటి ఆనందాన్ని పొందే దారి ఏది?

కృష్ణుని ఆరాధనలో వచ్చే ఆనందం అతిశయమైనది. దీని ముందు భౌతికమైన ఆనందాలు ఎందుకూ పనికిరావు. బ్రహ్మానందం పొందడం అని అంటుంటారు కదా. బ్రహ్మానందమంటే ఆత్మానందం. ఆ బ్రహ్మానందమనే సముద్రంలో భౌతికానందం ఒక బొట్టంత. అలాంటి సముద్రంలాంటి బ్రహ్మానందం కూడా కృష్ణానంద సాగరంలో ఒక బొట్టంత. అంటే అన్ని ఆనందాల కంటే కృష్ణానందం దివ్యమైనదన్నమాట.

అయితే పచ్చకామెర్లు ఉన్నవాళ్లకి చెరుకు తీపి తెలియనట్టుగా అజ్ఞానంలో ఉన్నవాళ్లకు ఈ ఆనందపు రుచి తెలియదు. ఆ జబ్బు పోవాలంటే ఆచార్యుల వద్ద సాధన తీసుకుని, శాస్త్రానుగుణంగా పాటించాలి. అప్పుడు జబ్బు తగ్గి ఆరోగ్యంగా అవుతాం. భగవత్సంబంధాన్ని పునరుద్ధరించుకోగలుగుతాం. ఇక ఆయన్ని వదిలి వెళ్లడానికి ససేమిరా అంటాం. భవసముద్రంలో పడను అని మొరపెట్టుకుంటాం. ఆత్మకి ఈ విషయాలన్నీ తెలుసు. కాని మర్చిపోయాం. సాధన వల్ల నిద్రాణ స్థితి నుంచి బయటికి వస్తుంది.

భగవంతుని చేరుకోవాలన్నా, కృష్ణానందాన్ని పొందాలన్నా ఎలాంటి సాధన చేయాలి?

పద్మ పురాణంలో నాలుగు రకాల సంప్రదాయాలున్నాయి. అవి బ్రహ్మ, శ్రీ, కుమార, రుద్ర సంప్రదాయాలు. ఇవన్నీ భగవంతుని గురించిన విషయ పరిజ్ఞానాన్ని పెంచుతాయి. విష్ణు/కృష్ణ గురించి జ్ఞానం ఇస్తాయి. మేము పాటించేది బ్రహ్మ మధ్వ గౌడ్య సంప్రదాయం. దీని ప్రకారం హరినామ సంకీర్తనే సాధన.

హరే కృష్ణ హరే కృష్ణ, కృష్ణ కృష్ణ హరే హరే
హరే రామ హరే రామ, రామ రామ హరే హరే

ఇతి షోడశక నామ్నాం కలికల్మశ నాశనం.

'నాథః పరతురోపాయ సర్వవేదేశు దృశ్యతే' అని చెప్తోంది కలి సంతరణ ఉపనిషత్తు.

హరే అంటే భగవంతునికి ఉన్న శక్తి అంటే రాధ అని అర్థం. ఈ విధంగా హరే కృష్ణ అంటే రాధా కృష్ణ అనీ, హరే రామ అంటే సీతా రామ అనీ అర్థాలున్నాయి. ఈ నామం కీర్తించడమంటే మనల్ని తిరిగి ఆయన సేవలో ఉండేట్టుగా అనుగ్రహించమనీ, తన దగ్గరికి తిరిగి తీసుకువెళ్లమనీ అర్థం. నీతో ఉన్న సంబంధాన్ని పునరుద్ధరించమని ఆయన్ని పిలవడం. ఈ సంకీర్తన తులసి మాల (జపమాల) ద్వారా రోజుకి 16 మాలలు చేయాలి. ఇలా కీర్తించడం వల్ల మన పంచేంద్రియాలనూ కేంద్రీకరించి ధ్యానించడం సాధ్యమవుతుంది. ఎలాగంటే కంటితో ఆయన్ని చూస్తూ, చెవులతో నామం వింటూ, తులసిమాలను స్పృశిస్తూ, నాలుకతో పలుకుతూ – ఇలా పంచేంద్రియ సహిత ధ్యానం అవుతుంది. కలికాలంలో నామ శబ్దమే కృష్ణుడు. 'కలికాలే నామరూప కృష్ణ అవతార్' అంటారు.

'కలేర్ దోష నిధే రాజన్
అస్తిః యేకో మహాన్ గుణః
కీర్తనా దేవ కృష్ణస్య
ముక్త సంగః పరం వ్రజేత్'

(భాగవతం 12వ స్కంధం)

కలియుగంలో అన్నీ దోషాలే. పండ్లు, కూరగాయలు, నీరు, గాలి, పాలు అన్నీ కలుషితమే. ఎటు చూసినా దోషాలే. కాని ఒక్క మంచి గుణం ఉంది. అదేంటంటే కృష్ణ కీర్తన. అది చేస్తే ముక్తుడివి అవుతావని భాగవతం చెప్తోంది.

ఇస్కాన్ వైపు మీరు ఎలా ఆకర్షితులయ్యారు?

చెన్నైలో ఐఐటి చేస్తుండగా మా కాలేజ్‌కి రష్యన్ యూనివర్సిటీలో పనిచేసే మ్యాథ్స్ ప్రొఫెసర్ వచ్చారు గెస్ట్ లెక్చర్ కోసం. ఖాళీ టైంలో ఆయన భగవద్గీత మీద క్లాస్ తీసుకుంటారని చెప్పారు. ముస్లిం అయిన ఆయన భగవద్గీత క్లాసు చెప్పడం అనేసరికి నాకు ఆసక్తి కలిగింది. ఆయన అప్పటికే హరేకృష్ణ మూవ్‌మెంట్‌లో ఉన్నారు. ఆయన పేరు ఐరావత దాసు. క్లాసు విన్నాక భలే ఉందే అనిపించింది. నేర్చుకుంటే బావుంటుందనుకున్నా. అక్కడ ఆగిన ఆలోచన బెంగుళూరులోని ఓ మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగం చేసేటప్పుడు మళ్లీ చిగురువేసింది. నా రూమ్మేట్స్ హరేకృష్ణ భక్తులు కావడంతో వాళ్లతో పాటు దగ్గర్లోనే ఉన్న ఇస్కాన్ టెంపుల్‌కి వెళ్లేవాణ్ణి. అక్కడ శ్రీల ప్రభు పాద స్వామి వారివి కొన్ని పుస్తకాలు చదివాను. వాటి ప్రభావం చాలా పడింది. అలా మొదలైన ఆధ్యాత్మిక ప్రస్థానం 1997లో హరేకృష్ణ మూవ్‌మెంట్‌లోకి ప్రవేశం చేలా చేసింది. నేను చదువుకున్న యూనివర్సిటీలోనే భగవద్గీత చెప్పే స్థాయికి తీసుకువచ్చింది. ఇప్పుడు కూడా దేవస్థానాల్లో భగవద్గీత, భాగవతంపై క్లాసులు తీసుకుంటున్నాం.

యువత కూడా ఇప్పుడు ఆధ్యాత్మికత వైపు మొగ్గ చూపుతున్నారు. వారిలో తమ ఉనికిని గురించి అనేక ప్రశ్నలున్నాయి. వాటికి సమాధానాల కోసం వెతుకుతున్నారు. ఈ ప్రపంచం ఏంటి? నేనెవరు? కోపం, శత్రుత్వం వంటివి ఎందుకు? ఇంతమంది దేవుళ్లు, మతాలు ఎందుకున్నాయి? మంచివాళ్లకే చెడు ఎందుకు జరుగుతుంది? పునర్జన్మలున్నాయా? మరణం తరువాత ఏమవుతుంది? లాంటి సందేహాలను నివృత్తి చేసుకోవడానికే ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరిస్తున్నారు.

విశ్వాసులే మార్గదర్శకులు

ఖురాన్ మాట



దుర్మార్గాల నిర్మూలన, సత్కార్యాల స్థాపన పైనే మానవాళి సాఫల్యం ఆధారపడి ఉంది. ఈ గురుతరమైన బాధ్యతను గుర్తుచేస్తూ పవిత్ర ఖురాన్ ఇలా అంటున్నది – 'మీలో కొందరు ప్రజలను మంచివైపుకి పిలిచేవారు, సత్కార్యాలు చేయమని ఆదేశించేవారు తప్పకుండా ఉండాలి. అలాంటివారు మాత్రమే ఇహ పర లోకాలలో సాఫల్యం పొందేవారు...' (3–104). మరొక చోట 'విశ్వాసులారా! ఇక నుండి ప్రపంచ మానవులకు మార్గదర్శనం చేస్తూ వారిని సంస్కరించడానికి రంగంలోకి తీసుకురాబడిన శ్రేష్ఠ సమాజం మీరే. మీరు సత్కార్యాలు చేయమని ప్రజలను ఆదేశిస్తారు. దుష్కార్యాల నుండి వారిస్తారు. దైవాన్ని ప్రగాఢంగా విశ్వసిస్తారు'. (3–110).

పవిత్ర ఖురాన్‌లోని ఈ వాక్యాల్లో దైవ విశ్వాసుల జీవిత లక్ష్యం ఏమిటో, వారు నిర్వర్తించవలసిన బాధ్యతలేమిటో విశదీకరించడం జరిగింది. దీన్ని బట్టి ప్రతి ఒక్కరు తమ తమ శక్తి సామర్థ్యాల మేరకు సమాజంలో ప్రబలి ఉన్న చెడులను, రుగ్మతలను అరికడుతూ మంచిని, మానవీయ విలువలనూ వ్యాపింపచేస్తూ ప్రజలను సంస్కరించడానికి కృషి చేయాలని మనకు అర్థమవుతున్నది. అందుకే పవిత్ర ఖురాన్ ప్రజల్లో దైవ భీతిని, పరలోక చింతనను జనింపచేసి తద్వారా వారిని నీతిమంతులుగా, సత్పౌరులుగా తీర్చిదిద్దాలని అభిలషిస్తున్నది. మూఢ నమ్మకాలు, దురాచారాలతో సహా ప్రపంచంలోని అన్ని రకాల చెడులను నిర్మూలించి చక్కని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్పదలిచింది. ఈ లక్ష్య సాధన కొరకు పవిత్ర ఖురాన్ దైవ విశ్వాసులపై మంచిని పెంచే, చెడును నిర్మూలించే బృహత్తర బాధ్యతను నిర్బంధం చేసింది. దీనికోసం దైవ విశ్వాసులు ఒక సంఘటిత శక్తిగా రూపొందాల్సిన ఆవశ్యకతను అది గుర్తు చేస్తున్నది. సమాజ సంస్కరణ, సత్సమాజ నిర్మాణం, మానవాళి ఇహపర సాఫల్యం.. దీని కోసమే దైవ ప్రవక్త మొహమ్మద్ (స) కాలంలో ఆ తరువాతి ఖులఫాయెరాషిదీన్‌ల కాలంలో దైవ విశ్వాసులు ధర్మం, న్యాయం కోసం తమ సర్వస్వాన్ని ధారపోసి కృషి చేశారు. సమాజంలో ఎక్కడ ఏ కొద్ది చెడు కనిపించినా దాన్ని అంతం చేసేవరకు ప్రశాంతంగా నిద్రపోయేవారు కాదు. ప్రజల్లో పాపభీతిని, దైవభీతిని నూరిపోస్తూ, దుర్మార్గాలకు దూరంగా ఉంచడానికి ప్రయత్నించేవారు. దీని ఫలితంగా ఆనాడు సమాజంలో ఎల్లెడలా నీతి, న్యాయం, శాంతి, సౌశీల్యం, సౌభ్రాత్రతలు వెల్లివిరిశాయి. ధర్మ పరాయణత, బాధ్యతా భావం, జవాబుదారీతనం, పరస్పర గౌరవాభిమానాలు సర్వత్రా విస్తరించాయి. నిజంగానే అదొక స్వర్ణయుగం. ప్రపంచమంతా కీర్తించిన కాంతి యుగం. కాని ఆ యుగం అంతరించింది. ఈ దుస్థితి మారాలంటే చెడులు అంతమయ్యేవరకు అలుపెరుగని పోరాటం కొనసాగిస్తూనే ఉండాలి. బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేర్చాలి. అప్పుడు మాత్రమే సమాజ సంస్కరణ సాధ్యమవుతుంది. ఇహపర సాఫల్యం సిద్ధిస్తుంది.

– యం.డి. ఉస్మాన్ ఖాన్

సువార్త



నీవే వెలుగువి..!

బైబిల్ వెలుగుతో మానవ మనుగడ ఆవిష్కరింపబడుతుంది. దేవుడు వెలుగు కలుగును గాక అనగానే జగమంతా వెలుగుమయమైంది. ఆది:1:3–4. ఆయనలో జీవముండెను. ఆ జీవము మనుషులకు వెలుగైయుండెను. యోహా:1:4.దేవుడు వెలుగై ఉన్నాడు. కాని మనుషులు కూడా ఎలా వెలుగు కాగలరో చూద్దాం.

జీవమున్నంత వరకు మనిషి దేహాన్ని పెంచి, పోషించి, జీవన గమనాగమనాలను నిర్దేశించేవి చీకటి వెలుగులే. మనిషి జీవనాధారం వెలుగే. దీన్ని వెంబడించేది చీకటి. మీరు లోకమునకు వెలుగంటున్నాడు ప్రభువు (మత్త:5:14). మనుషులు మీ సత్‌క్రియలను చూసి దేవుని మహిమపర్చునట్లు వారి ఎదుట మీ వెలుగును ప్రకాశింపనీయుడి. మరోచోట నీ దీపములను వెలుగుచుండనీయుడీ అంటారు. నూనె కరిగిపోతే మళ్లీ నింపాలి. వెలుగుతూ ఉండాలి. ప్రభువు భక్తులు ఆత్మీయతను ఇలాగే వాక్య ధ్యాన ప్రార్థనలతో పెంపొందించుకోవాలి. పూర్వదినాల్లో ప్రమిదలు నూనెతో నింపబడి ఉండేవి. ఇల్లంతటికీ వెలుగునిచ్చేందుకు ఎత్తులో ఉంచుతారు. దీని అర్థం మనిషి దీపం లాంటివాడని. నరునికి ఆత్మ సంబంధమైన జ్ఞానము, లోక సంబంధమైన జ్ఞానము ఉంటుంది. ఆధ్యాత్మికంగా, నైతికంగా నడిపించేందుకు, నవజీవన మనుగడకు అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు జ్ఞానం, ఆలోచన, వివేచన కావాలి. ఇందులో వెలుగుంది. ఇవి దైవాధీనమైనవి. వీటిని మనుషులందరికీ ఇచ్చాడు. 'నిజమైన వెలుగు ఉండెను. అది లోకములోనికి వచ్చుచూ ప్రతి మనిషిని వెలిగించుచుండెను' (యెహాను 1:9). దేవుడు వెలిగించిన మనిషి సాటి మనిషిని వెలిగించాలని ఆయన చిత్తము. ఆధ్యాత్మిక చింతనతో పాటు భౌతిక జీవనంలోను మనుషులు వెలిగించబడాలి. అందుచేత మీరు లోకమునకు వెలుగైయున్నారు అంటాడు ప్రభువు. వెలుగు పుట్టాలంటే అగ్ని (ఇంధనం) కావాలి. మనిషిలోని చెడు కాల్చబడాలి. అప్పుడే ప్రకాశిస్తాడు. కొంతమంది కొవ్వొత్తిగా తాము కరిగిపోతూ ఇతరుల్ని వెలిగించి, జీవితాల్లో కాంతిని నింపుతారు.

ప్రతి మనిషికి దైవ చింతన వాక్య ధ్యానం, ప్రార్థన తపోబలం అవసరం. ఇవి శాంతి సమాధానాలను కలుగజేసి జ్ఞాన ఆలోచనలను పెంపొందింపచేస్తాయి. సాటిమనిషికి చేయూతనిచ్చి నడిపించేలా చేస్తాయి. గుడ్డివాడు గుడ్డివానికి దారి చూపగలడా? కనుక నీవు ముందు వెలిగింపబడి, ఇతరులకు దారి చూపాలి. అందుకే 'మీరు లోకమునకు వెలుగు' అంటాడు ప్రభువు.

– డా. గుడిపాటి విలియం కేరి

ఆహ్వానం: మన సంప్రదాయాలు, సంస్కృతి, పురాణేతిహాసాల్లోని ధర్మసందేహాలు మీకు ఉంటే మాకు రాయండి. నిపుణులైన ఆధ్యాత్మికవేత్తలచే మీ సందేహాలకు సమాధానాలందిస్తాం. భక్తి, ఆధ్యాత్మిక విషయాలు, వేదోపనిషత్తులు, ఇతిహాసాల్లోని అంశాల గురించిన మీ పరిజ్ఞానాన్ని చింతన పాఠకులతో పంచుకోవచ్చు.
మీ సందేహాలు, వ్యాసాలు, అభిప్రాయాలను పంపాల్సిన మా చిరునామా : చింతన, నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8&9, రోడ్ నెం. 10, బంజారాహిల్స్, హైదరాబాద్ -34. ఇ-మెయిల్ : chintana@ntdaily.news

సీపీసీఎల్‌లో ఇంజినీర్లు

చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీసీఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఇంజినీర్, హెచ్ఆర్ తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

సీపీసీఎల్ అనేది ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ అనుబంధ సంస్థ.

- మొత్తం ఖాళీల సంఖ్య: 33
- ఇంజినీర్-28 పోస్టులు (కెమికల్-15, మెకానికల్-6, ఎలక్ట్రికల్-3, సివిల్-1, మెటలర్జీ-2, ఐటీ ఆఫీసర్-1)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత బ్రాంచిలో బీఈ/బీటెక్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్-3
- **అర్హత:** ఏదైనా ఎంబీఏ లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు సంబంధిత రంగంలో రెండేండ్ల అనుభవం ఉండాలి.
- సేఫ్టీ ఆఫీసర్-1
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమశ్రేణిలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- మార్కెటింగ్ ఆఫీసర్-1
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కెమికల్/మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్. ఎంబీఏ ఉండాలి.
- **వయస్సు:** 2017 జూలై 31 నాటికి 30 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:** రూ.500/-. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా.
- అభ్యర్థులను రెండు దశల్లో ఎంపిక చేస్తారు.
- మెదటి దశలో రాత పరీక్ష ఉంటుంది. దీనిలో షార్ట్‌లిస్ట్ పొందిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి తుది జాబితా ప్రకటిస్తారు.
- అభ్యర్థులు రాత పరీక్షలో సంస్థ నిర్ణయించిన కనీస అర్హత మార్కులను సాధించాలి.
- అర్హతగల అభ్యర్థులకు రాతపరీక్ష తేదీ, పరీక్ష సెంటర్, సమయానికి సంబంధించిన వివరాలను ఈ-మెయిల్ ద్వారా తెలుపుతారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** ఆగస్టు 11
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబర్ 1
- **వెబ్‌సైట్:** www.cpcl.co.in

అగ్రికల్చర్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఈ యూనివర్సిటీ 2014లో ఏర్పాటైంది (గతంలో ఆచార్య ఎన్ జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో భాగంగా ఉండేది). రాష్ట్రంలోని వ్యవసాయ పరిశోధన, అనుబంధ విద్య, విస్తరణను పర్యవేక్షిస్తుంది.

- పోస్టు పేరు: అసిస్టెంట్ ప్రొఫెసర్
- మొత్తం పోస్టుల సంఖ్య: 18 (అగ్రికల్చర్-10, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ-5, హోం సైన్స్-3)
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీతోపాటు మాస్టర్ డిగ్రీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. పీహెచ్‌డీ/నెట్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- **పే స్కేల్:** రూ.15,600-39,100+ అకడమిక్ గ్రేడ్ పే రూ. 6,000/-
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. ఆన్‌లైన్‌లో పంపిన దరఖాస్తులను ప్రింట్‌తీసి, సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.

చిరునామా: Registrar, Professor Jayashankar Telangana State Agricultural University., Rajendranagar, Hyderabad - 500 030

- **చివరి తేదీ :** సెప్టెంబర్ 12
- **ఆన్‌లైన్ హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** సెప్టెంబర్ 21
- **వెబ్‌సైట్:** http://www.pjtsau.ac.in

ఇన్సూరెన్స్ కంపెనీల్లో 996 ఉద్యోగాలు



ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఐసీఎల్) వివిధ ప్రదేశాలు/ప్రాంతాల్లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (స్కేల్ 1 కేటగిరీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌ను బొంబాయిలో సెప్టెంబర్ 12, 1947న స్థాపించారు.

- పోస్టు పేరు : అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్
- మొత్తం ఖాళీల సంఖ్య -300 (జనరల్ -158, ఓబీసీ-77, ఎస్సీ-44, ఎస్టీ-21)
- **విభాగాలవారీగా ఖాళీలు:** అకౌంట్స్-20, లీగల్-30, యాక్చ్యురీస్-2, ఆటోమొబైల్ ఇంజినీర్-15, జనరలిస్ట్-223, మెడికల్ ఆఫీసర్-10
- **విద్యార్హతలు:**
- **అకౌంట్స్:** సీఏ, ఐసీడబ్ల్యూఏ లేదా ఎంకాం, ఎంబీఏ (ఫైనాన్స్)లో ప్రథమశ్రేణి ఉత్తీర్ణత.
- **యాక్చ్యురీస్:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చ్యురీస్ ఆఫ్ ఇండియా నుంచి నాలుగు యాక్చ్యురియల్ పేపర్స్‌లో అర్హత సాధించాలి.
- **జనరలిస్ట్:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో 60 శాతం మార్కులతో లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **లీగల్:** లా డిగ్రీలో 60 శాతం మార్కులు లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **ఇంజినీర్స్ ఆటోమొబైల్:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఆటోమొబైల్‌లో బీఈ/బీటెక్ లేదా ఇంజినీరింగ్‌లో పీజీలో 60 శాతం మార్కులతో లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **గమనిక:** పై పోస్టులన్నింటికి ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 55 శాతం ఉత్తీర్ణత.
- **మెడికల్ ఆఫీసర్:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2017 జూలై 31 నాటికి 21 నుంచి 30 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ట్రెయినింగ్ పీరియడ్:** ఏడాది
- **పే స్కేల్:** రూ. 32795-62315/-. మెట్రోపాలిటన్ నగరాల్లో నెలకు సుమారుగా రూ. 51,000/- ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 600/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ. 100/-
- ఎంపిక విధానం:

ఫేజ్ - 1 ప్రిలిమినరీ ఎగ్జామినేషన్:

- ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ పద్ధతిలో 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. కాలవ్యవధి 60 నిమిషాలు.
- ఈ పరీక్షలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ (30 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ (35 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (35 మార్కులు) అంశాలపైన ప్రశ్నలు ఇస్తారు.
- ప్రతిభచూపిన వారిని 1:20 నిష్పత్తిలో మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు.

ఫేజ్ - 2 మెయిన్ ఎగ్జామినేషన్:

జనరలిస్ట్ పోస్టులకు...

- ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ పద్ధతిలో 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. కాలవ్యవధి 120 నిమిషాలు.
- ఈ ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ పరీక్షలో టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ (50 మార్కులు), టెస్ట్ ఆఫ్ రీజనింగ్ ఎబిలిటీ (50 మార్కులు), టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్ (50 మార్కులు), టెస్ట్ ఆఫ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (50 మార్కులు) అంశాలపైన పరీక్ష నిర్వహిస్తారు.

స్పెషలిస్ట్ పోస్టులకు...

- ఈ పరీక్ష కూడా ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ పద్ధతిలో 200 మార్కులకు ఉంటుంది. కాలవ్యవధి 120 నిమిషాలు.
- ఈ ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ పరీక్షలో టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ (40 మార్కులు), టెస్ట్ ఆఫ్ రీజనింగ్ ఎబిలిటీ (40 మార్కులు), టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్ (40 మార్కులు), టెస్ట్ ఆఫ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(40 మార్కులు), టెస్ట్ ఆఫ్ ప్రొఫెషనల్ నాలెడ్జ్ (40 మార్కులు) అంశాలపైన పరీక్ష నిర్వహిస్తారు.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్ (ఎస్సే, ప్రిసైస్ రైటింగ్, కాంప్రహెన్షన్) పై పరిజ్ఞానాన్ని పరీక్షించడానికి డిస్క్రిప్టివ్ రాతపరీక్ష నిర్వహిస్తారు. దీనికి 30 మార్కులు.
- పరీక్షలో ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామ్‌లో నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. 1/4 వంతు మార్కులను కోతవిధిస్తారు.
- తుది ఎంపిక మెయిన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కుల ఆధారంగా 80:20 వెయిటేజీ ఇచ్చి భర్తీ చేస్తారు.
- **పరీక్ష కేంద్రాలు:** తెలుగు అభ్యర్థులకు హైదరాబాద్/రంగారెడ్డి, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, ఒంగోలుతో సహా దేశవ్యాప్తంగా మొత్తం 81 సెంటర్లలో పరీక్ష నిర్వహిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** ఆగస్టు 18
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** సెప్టెంబర్ 15
- **ప్రిలిమినరీ ఎగ్జామ్:** అక్టోబర్ 22
- **మెయిన్ ఎగ్జామ్:** నవంబర్ 18
- **వెబ్‌సైట్:** www.orientalinsurance.org.in

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యూఐఐసీ) దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ అనేది పబ్లిక్ సెక్టార్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ. దీని ప్రధాన కార్యాలయం చెన్నైలో ఉంది. దీన్ని 1938 ఫిబ్రవరి 18న ఏర్పాటు చేశారు.

- పోస్టు పేరు: అసిస్టెంట్
- మొత్తం పోస్టుల సంఖ్య: 696 (జనరల్-414, ఓబీసీ-122, ఎస్సీ-110, ఎస్టీ-50)

రాష్ట్రాలవారీగా ఖాళీలు:

- తెలంగాణ-20, ఆంధ్రప్రదేశ్-32, మహారాష్ట్ర-107, తమిళనాడు-131, కర్ణాటక-61, కేరళ-38, అండమాన్ నికోబార్ దీవులు-2, అసోం-15, బీహార్-6, ఛత్తీస్‌గఢ్-15, గోవా-3, గుజరాత్-70, హర్యానా-9, హిమాచల్‌ప్రదేశ్-2, జార్ఖండ్-2, మధ్యప్రదేశ్-20, మణిపూర్-1, మేఘాలయ-1, మిజోరం-1, నాగాలాండ్-1, న్యూఢిల్లీ-31, ఒడిశా-10, పుదుచ్చేరి-7, పంజాబ్-13, రాజస్థాన్-30, సిక్కిం-2, త్రిపుర-1, చండీగఢ్-2, ఉత్తరప్రదేశ్-37, ఉత్తరాఖండ్-9, వెస్ట్‌బెంగాల్-1
- **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. రీజినల్ లాంగ్వేజ్‌లో పరిజ్ఞానం ఉండాలి. అంటే రాయడం, చదవడం మాట్లాడటం వచ్చి ఉండాలి.
- **వయసు:** 2017 జూన్ 30 నాటికి గరిష్ఠంగా 28 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** 14435-32030/- న్యూ పెన్షన్ స్కీమ్, ఇంటర్నెట్, లీవ్ ట్రావెల్ సబ్సిడీ, మెడికల్ బెనిఫిట్స్, వ్యక్తిగత ప్రమాద బీమా, గృహ, వెహికిల్ లోన్ ఇతర అలవెన్సులు కలుపుకొని మెట్రోసిటీ ప్రాంతాల్లో సుమారుగా నెలకు రూ. 23,000/- ఇస్తారు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ. 100/-
- **ప్రొబేషన్ పీరియడ్:** 6 నెలలు
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష (ప్రిలిమినరీ, మెయిన్స్), పర్సనల్ ఇంటర్వ్యూ

ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ (టైర్ 1):

- ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ పద్ధతిలో 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- ఈ పరీక్ష కాలవ్యవధి 60 నిమిషాలు.
- ఈ పరీక్షలో టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ (30 మార్కులు), టెస్ట్ ఆఫ్ రీజనింగ్ (35 మార్కులు), టెస్ట్ ఆఫ్ న్యూమరికల్ ఎబిలిటీ (35 మార్కులు) అంశాలపైన ప్రశ్నలు ఇస్తారు.
- ప్రతి సెక్షన్‌లో కనీస అర్హత మార్కులను సాధించాలి.
- ఈ పరీక్షలో ప్రతిభచూపిన వారిని 1:7 నిష్పత్తి (రాష్ట్రాలలో ఉన్న ఖాళీలవారీగా)లో మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామినేషన్ (టైర్ 2):

- మొత్తం ఐదు విభాగాలు ఉంటాయి. ఈ పరీక్షను 120 నిమిషాల్లో పూర్తిచేయాలి.
- ఇది కూడా ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ పద్ధతిలో 200 మార్కులకు ఉంటుంది.
- ఈ ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ పరీక్షలో టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ (40 మార్కులు), టెస్ట్ ఆఫ్ రీజనింగ్ (40 మార్కులు), టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్ (40 మార్కులు), టెస్ట్ ఆఫ్ న్యూమరికల్ ఎబిలిటీ (40 మార్కులు) అంశాలపైన పరీక్ష నిర్వహిస్తారు.
- ఈ పరీక్షలో ప్రతి విభాగం నుంచి 40 ప్రశ్నలు-40 మార్కులు కేటాయించారు.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్/రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, కడప, తిరుపతి, రాజమండ్రితో సహా దేశవ్యాప్తంగా మొత్తం 193 సెంటర్లలో పరీక్ష నిర్వహిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: ఆగస్టు 14
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ: ఆగస్టు 28
- ప్రిలిమినరీ ఎగ్జామ్: సెప్టెంబర్ 22
- మెయిన్ ఎగ్జామ్: అక్టోబర్ 23
- **వెబ్‌సైట్:** www.uiic.co.in

ఐఐఎస్ఈఆర్‌లో నాన్ టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్‌లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఐఐఎస్ఈఆర్ కేంద్ర మానవవనరుల శాఖ పరిధిలో పని చేస్తుంది. సైన్స్ రంగంలో విద్యను ప్రోత్సహించడానికి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వీటిని స్థాపించారు.



ఐఐఎస్ఈఆర్ భోపాల్‌లో ఖాళీలు:

- డిప్యూటీ రిజిస్ట్రార్ - 1, సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ - 1, సైంటిఫిక్ ఆఫీసర్ (ఫిజిక్స్) - 1, మెడికల్ ఆఫీసర్ - 1, టెక్నికల్ సూపరింటెండెంట్ (కంప్యూటర్ సెంటర్) -1, సైంటిఫిక్ సూపరింటెండెంట్ (బయాలజీ) -1, అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్) -1, టెక్నికల్ అసిస్టెంట్ - 1, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ - 1, ఆఫీస్ అసిస్టెంట్ (లీగల్) -1 ఖాళీ ఉన్నాయి.
- **చివరితేదీ:** సెప్టెంబర్ 8
- **వెబ్‌సైట్:** www.iiserb.ac.in

ఐఐఎస్ఈఆర్ పుణెలో ఖాళీలు:

జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ మల్టిపుల్ స్కిల్

- **జీతం:** గ్రేడ్ పే రూ. 2,400/-
- **ల్యాబొరేటరీ టెక్నీషియన్**
- **జీతం:** గ్రేడ్ పే రూ. 2,800/-
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.iiserpune.ac.in

ఐఐహెచ్ఆర్‌లో ఎస్ఆర్ఎఫ్‌లు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రిసెర్చ్ (ఐఐహెచ్ఆర్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఎస్ఆర్ఎఫ్, జేఆర్ఎఫ్, ఆర్ఏ, తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఐఐహెచ్ఆర్ అనేది ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ. ఇది పండ్లు, కూరగాయలు, ఔషధాలు, సుగంధ మొక్కలపై పరిశోధన చేసే నోడల్ ఏజెన్సీ.


- మొత్తం ఖాళీలు: 32
- సీనియర్ రిసెర్చ్ ఫెలో-22 పోస్టులు, రిసెర్చ్ అసోసియేట్-3 పోస్టులు
- యంగ్ ప్రొఫెషనల్-2 పోస్టులు, ఫీల్డ్ హెల్పర్-1, ఆఫీస్ అసిస్టెంట్-1, స్కిల్ అసిస్టెంట్-1, జూనియర్ రిసెర్చ్ ఫెలో-2 పోస్టులు



- **వయస్సు:** సీనియర్ రిసెర్చ్ ఫెలో: పురుషులు 35 ఏండ్లు, మహిళలు 40 ఏండ్లు మించరాదు. జూనియర్ రిసెర్చ్‌ఫెలో: పురుషులు 30 ఏండ్లు, మహిళలు 35 ఏండ్లు మించరాదు.
- **ఇతర పోస్టులు:** 21 నుంచి 40 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అర్హత:** ఎమ్మెస్సీ అగ్రికల్చర్ (బయోటెక్నాలజీ), ఎంటెక్ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ (ప్లాంట్ ఫిజియాలజీ), ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ హార్టికల్చర్, ఎమ్మెస్సీ (మైక్రోబయాలజీ, అగ్రికల్చర్, ప్లాంట్ మైక్రోబయాలజీ) లేదా బయోకెమిస్ట్రీలో పీహెచ్‌డీ, బీఎస్సీ, పీజీ, మాస్టర్ డిగ్రీ (బాటనీ, ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్ బ్రీడింగ్, జెనెటిక్స్, వెజిటుబుల్ బ్రీడింగ్)తోపాటు నెట్ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ జరిగే ప్రదేశం:** IIHR, Hesaraghatta Lake Post, Bangalore- 560089
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి, సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **ఇంటర్వ్యూ తేదీలు:** సెప్టెంబర్ 12,13
- **వెబ్‌సైట్:** www.iihr.ernet.in

ఎన్ఐఏలో లెక్చరర్లు

జైపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్, పాథాలజిస్ట్, ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద అనేది మినిస్ట్రీ ఆఫ్ ఆయూష్‌శాఖలో పనిచేస్తుంది.

- లెక్చరర్-4 పోస్టులు
- **అర్హత:** ఆయుర్వేదలో పీజీ డిగ్రీతోపాటు పబ్లికేషన్స్ అండ్ రిసెర్చ్‌లో అనుభవం ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- పంచకర్మ వైద్య-1
- **అర్హత:** ఆయుర్వేదలో ఎండీలో ఉత్తీర్ణత.
- పాథాలజిస్ట్-1
- **అర్హత:** పాథాలజిలో ఎండీలో ఉత్తీర్ణత.
- మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్-1
- **అర్హత:** మెడికల్ ల్యాబొరేటరీలో బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత. రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష/పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా

చిరునామా: Director, National Institute of Ayurveda, Jorawar Singh Gate, Amer Road, Jaipur - 302 002.

- **చివరితేదీ:** సెప్టెంబర్ 23
- **వెబ్‌సైట్:**www.nia.nic.in

ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో

డెహ్రాడూన్‌లో ఉన్న ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఖాళీగా ఉన్న జేఆర్ఎఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఇది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ పరిధిలో పనిచేస్తుంది.

- **పోస్టు పేరు:** జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్
- **మొత్తం ఖాళీలు:** 10 (జేఆర్ఎఫ్-9, ప్రాజెక్ట్ అసిస్టెంట్-1)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ (బయోటెక్నాలజీ, జెనెటిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ)లో ఉత్తీర్ణత. ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు బీఎస్సీ (బయలాజికల్ సైన్స్)లో ఉత్తీర్ణత.
- **వయస్సు:** జేఆర్ఎఫ్‌కు 28 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** జేఆర్ఎఫ్‌కు రూ. 12,000/-, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ. 8500/- స్టయిఫండ్‌ను ఇస్తారు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా లేదా అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి, పర్సనల్ అధికారి వద్ద ఇంటర్వ్యూతేదీన హాజరుకావాలి.
- **పర్సనల్ ఇంటర్వ్యూ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్:** http://fri.icfre.gov.in

ఐటీబీపీలో సబ్ ఇన్‌స్పెక్టర్లు

ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ) ఖాళీగా ఉన్న సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఐటీబీపీని 1962 అక్టోబర్ 24న స్థాపించారు.

- **పోస్టు పేరు:** సబ్ ఇన్‌స్పెక్టర్ (ఓవర్‌సీర్)
- **మొత్తం ఖాళీలు:** 21 పోస్టులు (పురుషులు-21, స్త్రీలు-3)
- **అర్హతలు:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత
- **వయస్సు:** 25 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** 35, 400-1,12,400/-
- **ఎంపిక:** రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరి తేదీ:** సెప్టెంబర్ 22
- **వెబ్‌సైట్:** www.recruitment.itbpolice.nic.in

బ్యాంక్‌నోట్ ముద్రణ్‌లో

బెంగళూరులోని భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ ప్రైవేట్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

BRBNMPL Recruitment

వివరాలు:

బీఆర్‌బీఎన్ఎమ్‌పీఎల్ అనేది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంపూర్ణ యాజమాన్య అనుబంధ సంస్థ. దీన్ని 1995 ఫిబ్రవరి 3న ఆర్‌బీఐ ఏర్పాటుచేసింది.

- మొత్తం పోస్టుల సంఖ్య-8
- అసిస్టెంట్ మేనేజర్-5 పోస్టులు (అకౌంట్స్-3, సివిల్-2)
- **సేఫ్టీ ఆఫీసర్-2, వెల్ఫేర్ ఆఫీసర్-1**
- **అర్హత:** సంబంధిత పోస్టులను బట్టి అర్హతలను కలిగి ఉండాలి.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **చివరి తేదీ:** సెప్టెంబర్ 8 (సేఫ్టీ/వెల్ఫేర్ ఆఫీసర్‌కు ఆగస్టుకు 31)
- **వెబ్‌సైట్:** www.brbnmpl.co.in

స్పోర్ట్స్ కోటాలో


ముంబై పోర్ట్ ట్రస్ట్ స్పోర్ట్స్ క్లబ్‌లో స్పోర్ట్స్ ట్రెయినీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ముంబై పోర్ట్ ట్రస్ట్ ప్రభుత్వ రంగ సంస్థ.


- **పోస్టు:** స్పోర్ట్స్ ట్రెయినీ
- **విభాగాలు- ఖాళీల సంఖ్య:** అథ్లెటిక్స్ - 3, షటిల్ బ్యాడ్మింటన్ -3, బాడీ బిల్డింగ్ - 2, క్రికెట్ -8, ఫుట్‌బాల్ -9, హాకీ - 9, కబడ్డీ - 7, టేబుల్ టెన్నిస్ - 2, వాలీబాల్ -6, వెయిట్ లిఫ్టింగ్ - 5 ఖాళీలు ఉన్నాయి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** http://mumbaiport.gov.in

షారుఖ్ చిత్రంలో రజనీకాంత్?

సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను ఎంతగానో ఆరాధిస్తారు బాలీవుడ్ బాద్షా షారుఖ్‌ఖాన్. తలైవా(రజనీ)పై వున్న అభిమానాన్ని చాటుకోవడానికి 'చెన్నై ఎక్స్‌ప్రెస్' చిత్రంలో 'లుంగి డ్యాన్స్' గీతాన్ని ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. తాజా సమాచారం ప్రకారం షారుఖ్‌ఖాన్ చిత్రంలో రజనీకాంత్ అతిథి పాత్రలో నటించబోతున్నాడని తెలిసింది. వివరాల్లోకి వెళితే...షారుఖ్‌ఖాన్ కథానాయకుడిగా కబీర్‌ఖాన్ దర్శకత్వంలో 'శిద్యాత్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కనుంది. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో రజనీకాంత్ నటించనున్నారని ముంబై సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. షారుఖ్‌ఖాన్ అభ్యర్థన మేరకు ఈ చిత్ర కథాంశాన్ని విన్న రజనీకాంత్ ఇందులో నటించడానికి సుముఖత వ్యక్తం చేశారని చెబుతున్నారు. ఈ సినిమాలో అమితాబ్‌బచ్చన్ కూడా అతిథి పాత్రలో కనిపించబోతున్నట్లు తెలిసింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం డిసెంబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది. షారుఖ్ సరసన దీపికాపదుకునే కథానాయికగా నటించనుంది.

అమితాబ్‌కు గాయాలు...!



'థగ్స్ ఆఫ్ హిందోస్థాన్' చిత్ర షూటింగ్‌లో జరిగిన ప్రమాదంలో బాలీవుడ్ సీనియర్ నటుడు అమితాబ్‌బచ్చన్ గాయపడ్డారు. ఆయన పక్కటెముకల్లో చిన్న చీలిక వచ్చిందని వైద్యులు ప్రకటించారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై చిత్ర బృందం ఎలాంటి సమాచారాన్ని వెల్లడించలేదు. ప్రమాదానంతరం అమితాబ్ షూటింగ్‌లో పాల్గొన్నారు. ముంబయి వెళ్లిన తర్వాత తీయించుకున్న ఎంఆర్‌ఐ స్కానింగ్‌లో ఆయన పక్కటెముకల్లో చిన్న ఫ్రాక్చర్ వున్నట్లు వైద్యులు గుర్తించారు. అమితాబ్ ఆరోగ్యం బాగానే వుందని, కొద్ది రోజులు విశ్రాంతి తీసుకుంటే అంతా సర్దుకుంటుందని డాక్టర్లు తెలిపారు. అమీర్‌ఖాన్ కథానాయకుడిగా 'థగ్స్ ఆఫ్ హిందోస్థాన్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విజయ్ ఆచార్య దర్శకుడు. వచ్చే ఏడాది దీపావళి కానుకగా చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఈ సినిమాకు మీరే హీరో అంటున్నారు!

'కథాబలమున్న చిత్రాలకే తొలి ప్రాధాన్యతనిస్తాను. కథ డిమాండ్‌ని బట్టి ఏ మేరకు అవసరమో ఆ స్థాయిలో ఖర్చు చేయడానికి వెనుకాడను. అలాగని అనవరంగా ఖర్చు చేయను. కథను నమ్ముకుని మాత్రమే సినిమాలు చేస్తాను' అన్నారు యువ నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి. ఆయన నిర్మించిన తాజా చిత్రం 'జయ జానకి నాయక'. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరో. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. ఈ సందర్భంగా నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.



• 'జయ జానకి నాయక' చిత్రానికి ఎలాంటి స్పందన లభిస్తున్నది?

సినిమా చూసిన ప్రతీ ఒక్కరు ఎక్కడా రాజీపడకుండా అత్యంత భారీగా నిర్మించారని, నిర్మాణ విలువలు బాగున్నాయని. ఈ సినిమాకు మీరే హీరో అని చెబుతుంటే ఆనందంగా వుంది. శుక్రవారం రాత్రి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'సినిమాపై నమ్మకంతో అనుకున్న సమయానికి విడుదల చేసి మంచి చిత్రాన్ని అందించారు. పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతూ మరిన్ని అత్యుత్తమమైన చిత్రాల్ని అందించాలి. జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటే అభిరుచిగల నిర్మాతగా నిలబడతారు' అని అభినందించారు. ఈ సినిమా విషయంలో నాకు లభించిన తొలి ప్రశంస ఇది.

• హీరో సాయి శ్రీనివాస్‌కు ఈ సినిమాతో ఏ స్థాయి విజయాన్ని అందించాను అనుకుంటున్నారు?

సాయిశ్రీనివాస్ స్థాయిని పెంచే సినిమా ఇది. 'నా కెరీర్‌లో ఎప్పటికీ మర్చిపోలేని సినిమాగా 'జయ జానకి నాయక' నిలిచిపోతుంది'అని సాయిశ్రీనివాస్ గొప్పగా చెబుతుండటం మరింత సంతోషాన్ని కలిగిస్తున్నది.

• ఒకే రోజు మూడు చిత్రాలు పోటీపడటం వల్ల నష్టం కలుగుతుందని అనిపించలేదా?

తొలి రోజు నుంచి సినిమాపై నమ్మకంతో వున్నాను. ఆత్మ విశ్వాసంతో ఏ పని తలపెట్టినా దానికి అనుకోని అవాంతరాలు ఎదురవుతుంటాయి. అయితే మన నమ్మకమే మనల్ని ముందుకు నడిపిస్తుంది. సినిమాపై మాకున్న నమ్మకం వల్లే ఎన్ని చిత్రాలు పోటీ వచ్చినా అనుకున్న తేదీనే చిత్రాన్ని విడుదల చేశాం. మేము ఊహించిన విధంగానే ప్రేక్షకులు మా చిత్రానికి అనూహ్య విజయాన్ని అందించి మా నమ్మకాన్ని నిజం చేశారు.

• దర్శకుడు బోయపాటి శ్రీను ఈ చిత్రాన్ని మీరు అనుకున్న స్థాయిలో తెరకెక్కించారా?

బోయపాటి శ్రీనుకు సినిమానే ప్రాణం. ఆయన నుంచి సినిమా అంటే ఏ స్థాయిలో వుంటుందో అందరికి తెలిసిందే. ఆయన ఈ చిత్రాన్ని ప్రాణం పెట్టి రూపొందించారు. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బోయపాటిని ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు. ప్రత్యేకంగా చెప్పాలంటే హంసల దీవిలో ఆయన చిత్రీకరించిన పోరాట ఘట్టాల గురించి ఓ స్థాయిలో చెబుతున్నారు. బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాల్లోనూ ఈ స్థాయి యాక్షన్ దృశ్యాల్ని చూడలేదని, రానున్న పదేళ్లల్లో ఈ స్థాయిలో పోరాట దృశ్యాల్ని ఎవరూ చూపించలేరేమో అని అంత అద్భుతంగా వున్నాయని అంతా అభినందిస్తున్నారు. ఈ ఎపిసోడ్ కోసం 30 రోజులు శ్రమించాం.

• బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కొత్త హీరో... అతని మార్కెట్‌ని మించి ఖర్చు చేయడం రిస్క్ అనిపించలేదా?

నేను ఒక సినిమా అనుకున్నప్పుడు నటీనటులను ఎంతగా నమ్ముతానో అంతకంటే ఎక్కువగా సాంకేతిక నిపుణుల్ని నమ్ముతాను. ఆ నమ్మకంతోనే 'జయ జానకి నాయక' చిత్రాన్ని నిర్మించాను. అలా నమ్మాను కాబట్టే హీరో కొత్త వాడైనా సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తున్నది. కొత్త హీరో, బడ్జెట్ అనే లెక్కలు వేసుకుంటే సినిమా చేయలేం.

• నిర్మాతగా ఎలాంటి సినిమాలు తీయాలనుకుంటున్నారు?

బోయపాటి శ్రీను దర్శకుడనే భావనతో ఈ చిత్రాన్ని ఇంత భారీగా నిర్మించలేదు. కథాబలమున్న చిత్రాలకే నా తొలి ప్రాధాన్యత. కథ డిమాండ్‌ని బట్టి ఏ మేరకు అవసరమో ఆ స్థాయిలో ఖర్చు చేయడానికి ఎప్పుడూ వెనుకాడను. అలాగని అనవరంగా ఖర్చు చేయను. కథను నమ్ముకుని మాత్రమే సినిమాలు చేస్తాను.

• బడ్జెట్ గురించి తెలిసి రిస్క్ చేస్తున్నారని మిమ్మల్ని భయపెట్టిన వాళ్లు ఎవరైనా వున్నారా?

ఓ పని చేస్తున్నాం అంటే చాలా మంది సలహాలు ఇస్తుంటారు. అలా సలహాలు ఇచ్చివాళ్లంతా మన మంచి కోసం చెబుతున్నారనే భావించాలి. అందులో కొన్ని నెగెటీవ్‌గా వున్నా మనం మాత్రం వాటిని పాజిటీవ్‌గానే స్వీకరించాలి. రిస్క్ అనేది ప్రతి రంగంలోనూ వుంటుంది. రిస్క్ వుందికదా అని వెనకడుగు వేస్తే రాణించలేం.

• తదుపరి చిత్రాల గురించి?

బోయపాటి శ్రీను దర్శకత్వంలో మరో సినిమా చేయాలనుకుంటున్నాను. దీనికి సంబంధించిన వివరాల్ని త్వరలో తెలియజేస్తాను. ఈ సినిమాతో పాటు మరో ఇద్దరు దర్శకులకు అడ్వాన్స్‌లు ఇచ్చాను. ఆ చిత్రాలకు సంబంధించిన నటీనటుల ఎంపిక పూర్తి కాగానే వాటి వివరాలు వెల్లడిస్తాను.

అద్దె చదువులకు విముక్తి

మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలకు విరివిగా భూ కేటాయింపులు

23.38 ఎకరాలు సిద్ధం చేసిన అధికారులు.. తీరనున్న సొంత భవనాల కల

మేడ్చల్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:

సర్కారు భూములను కారుచౌకగా ప్రైవేటు సంస్థలకు కేటాయించి.. పలు ప్రభుత్వ కార్యాలయాలను మాత్రం ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తూ రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తున్నారు. గత పాలకులు చేసిన ఈ తప్పిదం ఫలితంగా నేడు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చాలా ప్రభుత్వ రంగ సంస్థలు అరకొర వసతులున్న అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మరోవైపు అద్దెల రూపంలో ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతున్నది. ఈ విషయంపై సీరియస్‌గా దృష్టి సారించిన తెలంగాణ ప్రభుత్వం ఇబ్బందులను తొలగించే ప్రయత్నం చేస్తున్నది. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ సంస్థలకు అవసరమైన స్థలాలను కేటాయించేందుకు రంగం సిద్ధం చేసింది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, ఇతర విద్యాసంస్థలకు భూములను కేటాయిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లాలో అనేక ప్రభుత్వ రంగ విద్యాసంస్థలకు విరివిరిగా సర్కారు భూములను కేటాయించేందుకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ శాఖల పర్యవేక్షణలోని సంక్షేమ హాస్టళ్లు, కాలేజీలకు అవసరమైన స్థలాలను కేటాయించనున్నారు. ఈ మేరకు వివిధ మండలాల నుంచి ఎలాంటి వివాదాల్లేని 23.36 ఎకరాల ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేశారు. విద్యా సంస్థలకు ప్రభుత్వ స్థలాలను కేటాయించడం వల్ల ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు, కాలేజీలకు సొంత భవనాల కల నెరవేరనున్నది. అదే సమయంలో ప్రభుత్వ ఖజానాపై అద్దెల భారం తగ్గనున్నది. త్వరలో తుది కేటాయింపులు జరుగనున్నాయని జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు చెప్తున్నారు. ఆయా శాఖల ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన వెంటనే స్థలాలు కేటాయిస్తామని, సంబంధిత శాఖల అధికారులకు పొజిషన్ హ్యాండోవర్ చేస్తామని వారు వివరిస్తున్నారు.

విద్యాసంస్థలకు కేటాయించనున్న భూములు

మండలం	రెవెన్యూ గ్రామం	విస్తీర్ణం(ఎకరాల్లో)	విద్యాసంస్థ
బాచుపల్లి	బాచుపల్లి	4.00	టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ మహిళా కళాశాల
బాచుపల్లి	బాచుపల్లి	1.00	బీసీ వెల్ఫేర్ కాలేజీ హాస్టల్ (బాలురు)
బాచుపల్లి	బాచుపల్లి	1.00	సోషల్ వెల్ఫేర్ కాలేజీ హాస్టల్ (బాలురు)
బాచుపల్లి	బాచుపల్లి	8.28	ఎమ్మార్సీ భవనం, డైట్ కాలేజీ
కుత్బుల్లాపూర్	గాజులరామారం	3.07	ప్రభుత్వ జూనియర్ కాలేజీ
కుత్బుల్లాపూర్	గాజులరామారం	1.01	బీసీ వెల్ఫేర్ కాలేజీ హాస్టల్ (అమ్మాయిలు)
కుత్బుల్లాపూర్	గాజులరామారం	1.00	ప్రీమెట్రిక్ బాలికల హాస్టల్
కుత్బుల్లాపూర్	గాజులరామారం	1.00	సోషల్ వెల్ఫేర్ హాస్టల్ (బాలికలు)
అల్వాల్	కౌకూర్	1.00	బీసీ వెల్ఫేర్ కాలేజీ హాస్టల్ (అమ్మాయిలు)
ఉప్పల్	మల్లాపూర్	2.00	పోస్ట్‌మెట్రిక్ బీసీ హాస్టల్
మొత్తం		23.36	

పవర్ హాలిడేకు ఏర్పాట్లు

లక్ష్మాపూర్, మూడుచింతలపల్లి, కేశవరం గ్రామాల్లో కొనసాగుతున్న పనులు



కేశవరంలో విద్యుత్‌స్తంభాల ఏర్పాటుకు గుంతలు తీయిస్తున్న సిబ్బంది

శామీర్‌పేట: మేడ్చల్ జిల్లాలో మరో రెండు మూడు రోజుల్లో పవర్ హాలిడే నిర్వహించేందుకు విద్యుత్ అధికారులు, సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. లక్ష్మాపూర్, మూడుచింతలపల్లి, కేశవరం గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వైరింగ్ ఏర్పాటు, ఇతర విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఒకరోజు పవర్ హాలిడే ప్రకటించాలని, ఆ రోజు అధికారులతోపాటు, గ్రామస్తులందరూ కలిసి సమస్యలను పరిష్కరించుకోవాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఏడీ శంకర్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో కాంట్రాక్టర్లు, సిబ్బంది స్తంభాల ఏర్పాటు, గుంతలు తీయడం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు దిమ్మెలు ఏర్పాటు చేయడంలో నిమగ్నమయ్యారు. లక్ష్మాపూర్‌లో 5 ట్రాన్స్‌ఫార్మర్లు, 250 స్తంభాలు, మూడుచింతల్‌పల్లిలో 5 ట్రాన్స్‌ఫార్మర్లు, 230 స్తంభాలు, కేశవరంలో 4 ట్రాన్స్‌ఫార్మర్లు, 200 స్తంభాలను ఏర్పాటు చేయనున్నారు. గ్రామానికి ఒకరోజు పవర్ హాలిడే ప్రకటించి వాటికి విద్యుత్ లైన్లు వేయడంతోపాటు, లూప్ పోల్స్ తొలిగిస్తారు. వేలాడుతున్న తీగలను సరిచేయనున్నారు.

లక్ష్మాపూర్‌లో రెవెన్యూ సర్వే

లక్ష్మాపూర్ గ్రామంలో సోమవారం నుంచి రెవెన్యూ సర్వే నిర్వహించనున్నారు. జేడీ భాస్కర్ ఆధ్వర్యంలో సర్వే అధికారులు నాలుగు నుంచి ఆరు బృందాల వరకు ఏర్పడి గ్రామ నక్షా కోసం సర్వే పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామస్తులు, రైతులు, లక్ష్మాపూర్‌లో భూమి యజమానులు సోమవారం నుంచి వారి వారి భూమి వద్ద మార్కింగ్ ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. భూమికి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలు, ధ్రువపత్రాలతో రెవెన్యూ సర్వే అధికారులకు సహకరించాలని జేసీ ధర్మారెడ్డి కోరారు.

బస్సు ఢీకొని బాలిక మృతి

రాజేంద్రనగర్: ప్రైవేట్ బస్సు ఢీకొని ఓ చిన్నారి మృతిచెందిన ఘటన నగరంలోని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అంజమ్మ, ఎల్లప్ప దంపతులు బతుకు దెరువుకోసం వారి కుమార్తె మానస(2)తో సహా వలస వచ్చి రాజేంద్రనగర్ సమీపంలోని మానస హిల్స్ ఏవీఎస్ రెడ్డి కాలనీలో ఉంటున్నారు. శనివారం ఉదయం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు విద్యార్థులను ఎక్కించుకొని వెళ్తున్నది. ఈ క్రమంలో డ్రైవర్ మహ్మద్ హుస్సేన్ బస్సును రివర్స్ తీసుకుంటున్నారు. పక్కనే ఉన్న మానస బస్సు వెనుకనుంచి మరోవైపు పరుగెడుతుండగా బస్సు వెనుకభాగం తలకు తగిలింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని దవాఖానకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ప్రాణాలు విడిచింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. స్థానికుల ఆందోళనతో పాఠశాల యాజమాన్యం రూ.5 లక్షల పరిహారం ఇచ్చేందుకు ఒప్పుకున్నది.

రంగారెడ్డి జిల్లాలో మొదలైన భూముల రీసర్వే

పైలట్ ప్రాజెక్టుగా తుర్కగూడ, ఎర్రగుంట గ్రామాల ఎంపిక

ఇబ్రహీంపట్నం, నమస్తే తెలంగాణ: భూ సమస్యల శాశ్వత పరిష్కారంతో పాటు రైతుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే పనులు రంగారెడ్డి జిల్లాలో శనివారం మొదలయ్యాయి. పైలట్ పాజెక్టుగా ఎంపిక చేసిన ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ, ఎర్రగుంట గ్రామాల్లో అధికారులు రీసర్వే ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ సుందర్ అబ్నార్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో మధుకర్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటర్‌రెడ్డి రోజంతా గ్రామాల్లోనే ఉండి పనులను పర్యవేక్షించారు. అధికారులు ముందుగా రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సర్వేలో మొత్తం నాలుగు బృందాలు పాల్గొన్నాయి. ఒక్కో బృందంలో సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో, వీఆర్ఏ తదితరులు ఉన్నారు. డీజీపీఎస్ మెషీన్ ద్వారా సర్వే పనులు చేయిస్తున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సుందర్ అబ్నార్ మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రీసర్వే చేస్తున్నామన్నారు. ఈ సర్వేతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. సుమారు 40 ఏండ్ల కిందట భూ సర్వే జరిగిందని అప్పట్లో పాతిన హద్దురాళ్లు తొలిగిపోయాయన్నారు. దీంతో భూ సమస్యలు తలెత్తి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. రీ సర్వే వల్ల ఇలాంటి సమస్యలన్నీ తీరిపోనున్నాయని వివరించారు. రెండు రోజుల్లో గ్రామంలోని సర్వేనెంబర్లన్నీ పూర్తిగా సర్వేచేసి కొత్త టిపన్ తయారుచేసి వీలేజ్‌మ్యాప్‌ను రైతులకు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. రీసర్వేకు రైతుల నుంచి మంచి స్పందన వస్తున్నదని, ఉత్సాహంగా పాల్గొని తమ భూములను సర్వే చేయించుకుంటున్నారని అధికారులు తెలిపారు ఇదే స్ఫూర్తితో మిగితావారు ముందుకు రావాలని కోరారు. ఎర్రగుంట, తుర్కగూడ గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని రీ సర్వే ప్రారంభించామని, దీని ఆధారంగా అన్ని గ్రామాల్లో సర్వే పనులు ప్రారంభిస్తామని వివరించారు.


తుర్కగూడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న రంగారెడ్డి జిల్లా జేసీ సుందర్ అబ్నార్, ఆర్డీవో మధుకర్‌రెడ్డి తదితరులు

గంజాయి దందా.. నలుగురి అరెస్ట్

విశాఖ నుంచి నగరానికి తరలిస్తున్న క్వింటాల్.. నగరంలో విక్రయిస్తున్న నాలుగు కిలోల గంజాయి స్వాధీనం


రైల్లో గంజాయి తరలిస్తున్నవారి వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి రైల్వే ఎస్పీ రాజేంద్రప్రసాద్



జుమ్మేరాత్‌బజార్‌లో పట్టుబడిన నిందితుడిని చూపిస్తున్న ఇన్‌స్పెక్టర్ సంజీవరావు

అబిడ్స్, నమస్తే తెలంగాణ/మారేడ్‌పల్లి: గంజాయి దందాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఏపీలోని విశాఖపట్నం నుంచి హైదరాబాద్ మీదుగా రైల్లో తరలిస్తున్న క్వింటాల్ గంజాయిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు శని వారం పట్టుకొని ముగ్గురిని అరెస్ట్ చేశారు. అలాగే నగరంలోని జుమ్మేరాత్‌బజార్‌లో గంజాయి అమ్ముతున్న ఒకరిని పోలీసులు అరెస్ట్ చేసి, నాలుగు కిలోల సరుకు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎస్పీ రాజేంద్రప్రసాద్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా గుమ్మిరిగుడెం మండలం సార్లై గ్రామానికి చెందిన బబిత(25) ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసి ఉద్యోగం కోసం వెతుకుతున్నది. ఆమె తమ్ముడు ఎం సునీల్‌కుమార్ (20) విద్యార్థి. బీఈడీ పూర్తి చేసిన బబిత ఉన్నత చదువుల కోచింగ్ కోసం డబ్బులు సంపాదించాలని ఆలోచిస్తున్నది. ఈ క్రమంలో గంజాయిని సరఫరా చేస్తే కిలోకు రూ.5 వేల నుంచి రూ.8 వేలు సంపాదించవచ్చని ఓ వ్యక్తి ద్వారా తెలుసుకున్నది. దీంతో బబిత, ఆమె తమ్ముడు సునీల్‌కుమార్ కలిసి విశాఖపట్నం నుంచి షోలాపూర్ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైల్లో గంజాయి తరలిస్తున్నారు. ఇదే రైల్లో ఒడిశాలోని గజపతి జిల్లాకు చెందిన రైతు బిద్యసాగర్‌సింగ్(25) కూడా గంజాయి సరఫరా చేస్తున్నాడు. శనివారం ఉదయం రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న తర్వాత జీఆర్పీ రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి బ్యాగ్‌లను తనిఖీలు చేయగా, గంజాయి కనిపించింది. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి రూ.15 లక్షల విలువైన 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో రైల్వే ఇన్‌స్పెక్టర్ చంద్రయ్య, శ్రీనివాస్, క్రైం ఎస్ఐ ప్రమోద్, వీరలింగం, రైల్వే పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మరో ఘటనలో.. లోయర్ ధూల్‌పేట్ జుమ్మేరాత్‌బజార్ ప్రాంతానికి చెందిన మోహిత్‌సింగ్ (22), బేగంబజార్ కోల్సావాడికి చెందిన జ్యోతి ఇరువురు ముఠాగా ఏర్పడ్డారు. వీరు విశాఖపట్నం నుంచి కిలో రూ.3 వేల చొప్పున గంజాయిని కొనుగోలు చేసి నగరంలో కిలో రూ.30 వేలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మోహిత్‌సింగ్ జుమ్మేరాత్‌బజార్‌లో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మంగళ్‌హాట్ పోలీసులు అతన్ని తనిఖీ చేసి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితురాలు జ్యోతి పరారీలో ఉన్నదని, త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు. వీరు విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలోని రాజారావు, లక్ష్మి నుంచి 16 కిలోల గంజాయిని కొనుగోలు చేసినట్టు తమ విచారణలో తేలిందన్నారు.

నమస్తే తెలంగాణ కళ్యాణమస్తు

...మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు



భాగ్యలక్ష్మీ రెడ్డి మ్యాట్రిమోని

రెడ్డి వధూవరులకు ప్రత్యేకముగా చూడబడును



H.O : తార్నాక హుడా కాంప్లెక్స్,
Konala Bhagyalakshmi Reddy, M.A.
Ex. Vice-President:
Telangana Marriage Links.
Cell: 9246960888,9030315599.
Whatsapp: 9866044439
bhagyalakshmireddymatrimoni@gmail.com

వధువు కావలెను

★ రెడ్డి డాక్టర్ : 25Y,5'8", MBBS, MD, Doctor, Property, 5Crores వరునికి Doctor వధువు కావలెను. 9246960888

★ రెడ్డి : 25Y, 5'8", MS, SWE, USA, 120K PA, Property 20 Crores వరునికి వధువు కావలెను. 9248064777

★ రెడ్డి : 29Y, 6ft', MS, SWE, USA, 100K PA Property 10 Crores, వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★ రెడ్డి : 28Y, 5'8", MS, SWE, USA, 115K PA వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★ రెడ్డి : 31Y, 5'11", B.Tech, SWE, 12 Laks PA Property 15 Crores వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★ రెడ్డి: 28Y, 5'6", B.Tech, MS, SWE, Hyd, 9.5 Laks PA వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★ రెడ్డి: 26Y, 5'8", B.Tech, Central Government Employee, 60,000 PM వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★ రెడ్డి: 30Y, 5'8", M.Pharmany, Research Scientits, 75,000 PM వరునికి వధువు కావలెను. 9248064777

★ రెడ్డి: 27Y, 5'8", B.Tech, SWE, 60,000/- PM Property 5 Crores వరునికి వధువు కావలెను. 9030315599

★ రెడ్డి రెండవ పెళ్ళి కులపట్టింపులేదు : 34Y, 6ft', BE, (Bits Pilani) Manager, 150K PA వరునికి వధువు కావలెను. 9246960888

వరుడు కావలెను

★ రెడ్డి డాక్టర్ : 26Y, 5'6", MBBS, MS, Doctor, Property 10 Crores వధువుకు Well settled Doctor, వరుడు కావలెను. 9246960888

★ రెడ్డి: 25Y, 5'2", B.Tech, MS, SWE, USA, 110K PA, వధువుకు వరుడు కావలెను. 9248064777

★ రెడ్డి: 29Y, M.Tech, MS, SWE, USA, 90K PA వధువుకు USA వరుడు కావలెను. 9030315599

★ రెడ్డి: 24Y, 5'8", B.Tech, Assistant Manager, 8 Laks PA, వధువుకు వరుడు కావలెను. 9246960888

★ రెడ్డి: 25Y, 5'5", MCA, SWE, 7.5 Laks PA వధువుకు వరుడు కావలెను. 9248064777

★ రెడ్డి: 27Y, 5'2", MBA, Bank Employee, 4Laks PA వధువుకు వరుడు కావలెను. 9030315599

★ రెడ్డి: 25Y, 5'2", M.Pharmacy, Analyst, 20,000 PM వధువుకు వరుడు కావలెను. 9246960888

★ రెడ్డి: 24Y, 5'2", (Bits Pilani) M.Sc, Scientist, 6 Laks PA వధువుకు వరుడు కావలెను. 9248064777

★ రెడ్డి: 25Y, 5'5", BE, SWE, 3.6Laks PA, వధువుకు వరుడు కావలెను. 9030315599

★ రెడ్డి రెండవ పెళ్ళి: 29Y, 5'7", MCA, SWE, 6Laks PA వధువుకు వరుడు కావలెను. 9246960888

తెలంగాణ రెడ్డీలకు మాత్రమే

కేవలం తెలంగాణలో రెడ్డి వివాహ సంబంధాలు కుదుర్చగల ఏకైక వివాహ వేదిక. కీసరి మోహన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, బర్కత్‌పుర, హైదరాబాద్. ☎: 040-27555006, 9246573006, 9348067006
E-mail:keesarimb@gmail.com, www.keesarimarriages.com
Timing: 10 am to 5.00 pm. Tuesday Holiday.
మా బ్రాంచ్: B.N.రెడ్డి క్రాస్ రోడ్స్, సాగర్‌రోడ్, చైతన్యనగర్, ఫేస్-2, రోడ్ నం.4, హైదరాబాద్.
Native Place:తిరుగండ్లపల్లి (గ్రా), మర్రిగూడ (మం), నల్గొండ (జి)

వధువు కావలెను

★ రెడ్డి: 29/ 5'8"/ BE/ M.Tech/ IIT/25L P/A/ 15Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బర్కత్‌పుర. Ph No. 9246573006

★ రెడ్డి: 30/5'9"/ BE/ 15L P/A/ 16Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్. Ph No. 9246573006

★ రెడ్డి: 27/ 5'9"/ BE/ MS/ USA/ H1/ 70K/ Full Time Job/ 5Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బర్కత్‌పుర. Ph No. 9246573006

★ రెడ్డి: 34/5'6"/BS/Citizen/ USA/ 90K/ 5Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్. Ph No. 9246573006

★ రెడ్డి: 31/ 5'8" / BE/MS/ USA/ H1/ 120K/ Full Time Job/ 8Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బర్కత్‌పుర. Ph No. 9246573006

★ రెడ్డి: 30 / 5'7" / BE/ MS/ USA/ H1/ 125K/ 4Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్. Ph No. 9246573006

★ రెడ్డి: 29 / 5'3" / BE/ MS/ USA/ H1/ 90K/ 2Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బర్కత్‌పుర. Ph No. 9246573006

★ రెడ్డి: 33/ 5'6" / BE/MS/USA/90K/ Full Time/ H1/ 2Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్. Ph No. 9246573006

★ రెడ్డి: 29/ 5'6"/ MBBS/ DA/ Anesthesia/ MD/ Paediatrics/ 4Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బర్కత్‌పుర. Ph No. 9246573006

★ రెడ్డి : రెండో పెళ్ళి: 33/ 5'7" / B.Pharm/ M.Pharm/ 7L P/A/ 1Cr/ వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్. Ph No. 9246573006

వరుడు కావలెను

★ రెడ్డి : 25/ 5'7" / BE/ MBA/ 4L P/A/ 4Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్. Ph No. 9246573006

★ రెడ్డి: 26 / 5'6" / BE/ 5L P/A/ 1Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బర్కత్‌పుర. Ph No. 9246573006

★ రెడ్డి: 25/ 5'5" / BE/ 2Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్. Ph No.9246573006

★ రెడ్డి: 26 / 5'2" / BE/ 6L P/A/ 1Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బర్కత్‌పుర. Ph No. 9246573006

★ రెడ్డి: 25/ 5'3" / BE/ 2L P/A/ 50L వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్. Ph No.9246573006

★ రెడ్డి: 23 / 5'6" / BE/ M.Tech/ 2L P/A 1Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బర్కత్‌పుర. Ph No. 9246573006

★ రెడ్డి : 24/ 5'5" / BE/ 5L P/A/ 1Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్. Ph No. 9246573006

★ రెడ్డి: 26/ 5'3"/ MBBS/ MD/ Radiology/ 2Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బర్కత్‌పుర. Ph No. 9246573006

★ రెడ్డి: 24/ 5'5" / Pharm-D/ 3L P/A/ 1Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్. Ph No. 9246573006

★ రెడ్డి: రెండో పెళ్ళి: 29/ 5'5"/ B.Pharm/ M.Pharm/ MBA/ USA/ F1/ 1Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి, బర్కత్‌పుర. Ph No. 9246573006



కళ్యాణ వేదికలు

★ T.Bhoom Reddy Marriage Bureau for Local, Abroad Matches. Cont: H-13/1, Near Ahobilamutt, D.D. Colony, Hyd. Ph: 040-27425273, 8790123939, 9347225273

★ శ్రీశ్రీశ్రీ కొమురవెల్లి మ్యారేజ్ బ్యూరో: ప్రత్యేకముగా యాదవులకు, కురుమలకు, లేట్, 2వ & ఇతర కులముల సంబంధాలు చూడబడును. సంప్ర||రాంనగర్'X' రోడ్స్, Hyd. 9701552985. Mail ID:avula.ramulu@yahoo.com

★ రజక మ్యారేజ్ బ్యూరో: Drs., Engrs., A.E., Bank, J.T.O., Teachers, USA, Kamala Pandu, New Bowenpally, Sec-bad-11. kp.rajaka@gmail.com. Ph: 9676673789, 9949871493.

★ కేవలం మేరు(దర్జీ) కులస్థులకు మాత్రమే చూడబడే ఏకైక సంస్థ. మొదటి, 2వ లేటు మ్యారేజెస్‌కై Dr., Engg., Govt సంబంధాలు కలవు. Ph: 9494252545.

★ పద్మశాలి వధూవరులకై ఇంటర్/డిగ్రీ/ B.Tech/ డాక్టర్స్/ 1వ, 2వ, లేట్, డైవర్సీ, విడో పెళ్ళి సంబంధాలకై సంప్ర : ఫ్రీ రిజిస్ట్రేషన్స్, వర్కాల దశరథన్. Ph : 9966567051, Whatsapp No : 7330886245.

★SC మాల, మాదిగ వివాహ సంబంధాలకై పోస్టుకార్డు సైజు ఫోటో మరియు వివరాలను Markway910marriages @gmail.comకు మెయిల్ పంపించండి లేదా 9642222179 నెంబర్‌కు వాట్సాప్ చేయండి. రిజిస్ట్రేషన్ ఫ్రీ.

★SC మ్యారేజ్ బ్యూరో:మాల, మాదిగ & క్రిస్టియన్ మరియు 2వ సంబంధాలు చూపబడును. ECIL, హైదరాబాద్-62. Cont: 9440883866, 7032117247.

★ జియో వివాహ వేదిక: వేలాది ప్రొఫైల్స్‌తో ప్రతి శనివారం హైదరాబాద్, వైజాగ్, గుంటూరు, విజయవాడ, కాకినాడ. సంప్ర: 8885479555/ 8885473555. www.jiomatrimony.in

★జై ముదిరాజ్ – జై జై ముదిరాజ్. ముదిరాజ్ కులములకు ప్రత్యేకం. Engrs/S.W/Banks/ MS పెళ్ళి సంబంధముల కొరకై సంప్రదించండి Ph: 9848057130, 9247563192

★వెంకటేశ్వర మ్యారేజ్ బ్యూరో: పంజరి కులస్థులకు మాత్రమే సంబంధాలు చూడబడును. నెహ్రూనగర్, కాచిగూడ. Ph: 9603762880

★15 రోజులలో అన్ని కులములకు 1వ, 2వ, లేట్, దేశ, విదేశ సంబంధాలకై వ్యక్తిగత శ్రద్ధతో 'పెళ్ళి పుస్తకం' వివాహ వేదిక సంప్ర: ఎం. శ్రీనివాస్ రెడ్డి (రిటైర్డ్ ఇంజనీర్) Ph: 9246201550


★భరత్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో:4వ సంవత్సరము సందర్భముగా అన్ని కులములు ఫ్రీ రిజిస్ట్రేషన్ సంప్రదించ వలసిన నంబరు. Ph: 9000243678

★మహేంద్ర మ్యారేజ్ బ్యూరో H.No: 25-10-218/1, బాపూజీ నగర్, కాజీపేట, వరంగల్-TS, సంప్ర: కనికరం జయ. సెల్: 7386226285, 8125524120, 7396215583.

★కేవలం ''ముదిరాజ్'' తెలంగాణ అన్ని జిల్లాలలోని 1వ, 2వ, లేట్, Govt. Jobs, Software Jobs, దేశ, విదేశీ సంబంధాలకై సంప్ర. 9948270986.

★ Only Mudiraj Sumangali Marriages Vadhu Varulaku Sampradinchandi. Old Bowenpally. Ph: 9052116999

★ Christians Praise zion Marriages Protestants R.CS Late Marriages Divorces Engineers & Doctors Govt. Pvt. 8106572325, 8317577461




వధువు కావలెను

★ మేరు (దర్జీ) : 2వ, 37Y, 5'3", ప్రభుత్వ టీచరు, హైదరాబాద్‌లో సొంత ఇల్లు కట్న ప్రసక్తి లేదు. వయస్సు 25 నుండి 32 సం||లు వధువు కావలెను. Ph: 8801491731.

★గంగపుత్ర, బేస్త: Age: 29, Ht: 5'.10", MBA, Business, 30,000/-PM వరునికి తగిన వధువు కావలెను. Direct సంప్రదించవలేయును. సెల్: 8179613892.

★లేట్ మ్యారేజ్: ప్రభుత్వ టీచర్ (SA)/42/BCకి కుల ప్రసక్తి లేని (BC లేదా OC) ప్రభుత్వ ఉద్యోగము చేసే 1వ/2వ వధువు కావలెను. కాంటాక్ట్ డైరెక్ట్ No. 9966311904/9441272470

★వైశ్య: 28 ఎరుపు 5.5 M.Sc, M.A, M.Ed, TTC ప్రైవేట్ లెక్చరర్ 30 వేలు అబ్బాయికి వైశ్య ఎరుపు/తెలుపు అమ్మాయి ఉంటే ఇవ్వండి. లేకుంటే లేదు. నల్లగొండ. డైరెక్ట్ సెల్: 9618418981.



వరుడు కావలెను

★45 Yrs 2nd మ్యారేజ్ 5'4", 10th క్లాస్ 2 ఎకరాల బత్తాయితోట 20 వేలు PM, సొంత ఇల్లు గల వధువుకు వరుడు కావలెను. (కులంతో సంబంధం లేదు) Ph: 7337090627

★Goud డైవర్సీ 32, 5'3", USA, MS, SWE, 120K, V.Fair, Hyd వధువుకు USAలో వుండే తగిన వరుడు కావలెను. Caste No. Bar. Ph: 9246523454

★ BC.D (Second) /36.Y/ 5'4" Fair/PG. ఎలాంటి ఆస్తులులేని సంప్రదాయ పద్ధతిగల అందమైన అమ్మాయికి వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. నోబ్రోకర్స్/డైరెక్ట్: HYD ✆ 9052859029

★ మున్నూరుకాపు వయస్సు 48 సం॥లు గవర్నమెంట్ ఉద్యోగం లేట్ మ్యారేజ్ ఇదే కులానికి చెందిన వరుడు కావలెను. సంప్ర॥ సెల్ : 80742 91135.

8096677819

www.avinashreddy.com

రెడ్డి వధూవరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి:
690, RoadNo.3, BanjaraHills, Hyd.
Tuesday Holiday, Timings: 10 AM to 5 PM.
avinash11818@gmail.com.
9848011818
9393311818

వధువు కావలెను

★ Reddy BE (BITS), MS, 29, 6', SWE, USA, Rich. Cont: Road - 3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ REDDY H1, BE, MS, USA, 27, 5'11" SWE, Handsome. Cont: Road-3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy MicroSoft, 28, 6', BE, 30 L P/A, Handsome. Cont: Road-3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com.

వరుడు కావలెను

★ Reddy BE (IIIT), 23, 5' 4" SWE, 17 L P/A, Fair. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy M.Pharm, 24, 5'4", Medical, Hyd, Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy BE, MS, 25, 5'4", H1, SWE, USA, Fair. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
అమెరికా వివాహ సంబంధాలకు సంప్రదించండి
690, Road No-3, BanjaraHills
(TV 9: Opp: Colony)
HYDERABAD
D.V. Koti Reddy
9848011818
9393311818

★ REDDY BE(IIT), M.TECH (IIT), 28, 5' 6" 20 L P/A, SWE. Cont: Road-3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy BE,MS, H1, 28, 5' 11", 140 K, SWE, USA, Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy Govt Officer, BE (IIT), 29, 5' 8", 8 Crores. Cont: Road-3, BanjaraHills, Hyd.93933 11818. www.avinashreddy.com

★ Reddy BS, 26, 5' 10", 105 K, USA, Handsome. Cont:Road-3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy Doctor, USA Citizen, 28, 5' 5", Rich Family. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy BE, 23, 5' 7", 9.35 L P/A, 6 Crores Fair & Slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy BE, MS,28, 5'3",110 K, 3 Crores, Fair. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy BE,MS, 25, 5' 5", USA, 10 Crores, Fair & Slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, abroad Matches Fast Settlement: (For Reddy's Only) cont: K.C. Reddy, Address: 106, A.K. Enclave, Phase-II, 8-2-350, Road No.3, Banjara Hills (Near A.P.Furniture Mall), Hyderabad. Ph:9849321309 / 9347807015
Email: kcreddy43@gmail.com

వధువు కావలెను

★Reddy/ BIG- Industrialist/ B.Tech/ MBA/ 30/5'10"/ 100Cr his Share *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ B.Tech/ MS/ H1/USA/ V.Smart boy/ 27/5'8"/ 30Cr (prop) Hyd *Cont: K.C.Reddy- Mar-Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ B.Tech/ MS/ USA/ 25/5'6"/ 100Cr (Prop) Hyd. *Cont: K.C.Reddy-Mar-Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ Very Big Businees/ B.Tech/ MBA/ 31/6'/ V.Smart/ 400Cr-Prop *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ Business/ B.Tech/ MS/ 29/5'8"/ 225Cr (Prop) *27/5'8"/ 200Cr *30/5'10"/300Cr *26/6'/ 150Cr *28/6'/200Cr *29/5'10"/ 250Cr *Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ MBBS/PG *28/6'/ 15Cr *29/ 5'10"/ DM/ 50Cr *30/5'7"/50Cr *30/6'/25Cr *27/ 6'/ 50Cr* 28/5'9"/25Cr* 29/5'8"/50Cr * Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/9347807015.

★Reddy/MBBS/ Res-Doc-USA *27/ 6'/ 50Cr *35/5'6"/50Cr *30/6' *30/5'7" *29/5'7" *30/5'7" *26/5'7" * Cont: K.C.Reddy-Hyd.Ph:9849321309/ 9347807015.

★Reddy/Australia, *B.Tech/ MS/ Citizen/ 28/5'9"/30Cr *PR/30/5'8"/25Cr/ 6L/Rents*Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/B.Tech/MS/ H1/ USA* 29/ 5'7"/ 150K/ 70Cr *27/5'8"/100K/ 30Cr *31/ 6'/ 150K/ 30Cr *28/5'11"/60Cr *Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/9347807015.

★Reddy/B.Tech/IIT/BITS/H1/USA *31/6' /150K/ 30Cr *27/5'10"/25Cr* 25/6'/ 15Cr *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/9347807015.

వరుడు కావలెను

★Reddy/ B.Tech/ MBA/ Most beautiful/ 29/5'6"/ 200Cr (prop) Hyd *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/Rich *B.Tech/27/5'3"/ 50Cr *27/ 5'5"/40Cr *29/5'2 1/2"/ 100Cr *27/5'7"/ 50Cr *23/ 5'4"/ 50Cr *26/5'6"/ 100Cr*Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ B.Tech/ H1/ MS/ H1/ USA *25/ 5'3 1/2"/ 40Cr *27/5'5"/ 25Cr *27/ 5'4"/30Cr *26/5'2"/20Cr *24/5'5"/ 10Cr *28/5'5"/20Cr *Cont: K.C.Reddy- Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ MBBS/ PG-Rich *26/5'6"/ 10Cr *27/5'7"/100Cr *28/5'5"/50Cr *30/ 5'7"/15Cr *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ MBBS/ Res-doc-USA *25/ 5'4"/ 120Cr *25/5'7"/ 50Cr *28/ 5'5"/ 10Cr *30/ 5'2"/ 10Cr *28/5'3" *27/5'7"/10Cr *Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ B.Tech/ 24/5'4"/10Cr *27/ 5'6"/ 25Cr*27/5'5"/20Cr *24/ 5'6"/ 60Cr *25/ 5'7"/ 8Cr *27/5'3"/20Cr *27/ 5'3"/ 10Cr *Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ B.Tech/M.Tech/ 26/5'4" /6Cr *25/ 5'5"/ 5Cr *30/5'2"/20Cr *25/5'6"/ 15Cr *25/5'1"/ 20Cr *26/5'3" *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.


★Reddy/ B.Tech (IIT) BITS/ 25/5'7"/30Cr *29/5'6" *25/5'9 *29/5'3" *26/5'2" *26/5'5" *26/5'3" *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ (Diverce)/ B.Tech/ 27/5'6"/25Cr *30/5'6"/4Cr *40/5'5"/ 100K *32/5'2"/25Cr *32/5'2"/1Cr *30/5'2 1/2"/10Cr *33/5'3"/10Cr *Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/MBBS-Needs any Well Settled *22/5'5"/ 15Cr*28/5'5"/50Cr *27/ 5'7"/ 100Cr *Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

ASHOK REDDY MARRIAGE BUREAU

అన్ని కులాల వధువు, వరుడు పెండ్లి సంబంధములకై
(FOR LOCAL & ABROAD MATCHES)
Contact: CHERUKUPALLY ASHOK REDDY
(Nizamabad)



Email: careddy1955@gmail.com
H.No. 6-210/3; Opp: Andhra Bank, Near Mudugullu, Durga Estates, Suchitra Junction, Secunderabad-67
040-42007758 ; 9652535757 ; 9618012936

పద్మశాలి కుల బాంధవులకు శుభవార్త!!!

స్థాపితం: 1986 నుండి నామ మాత్రపు ఫీజుతో సేవలందిస్తున్న సంస్థ వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టు వారి ఆధ్వర్యములో **పద్మశాలి పరిణయ పరిచయ వేదికను ది: 27-08-2017 ఆదివారం** రోజున ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏర్పాటు చేస్తున్నాం. కావున వివాహ సంబంధాలు కావాల్సినవారు తప్పక విచ్చేయగలరు.

సంప్ర: పద్మశాలి భవన్, నారాయణగూడ, హైదరాబాద్
www.padmashaliindia.com info@padmashaliindia.com
Ph: 040-24765557, 24765558, 24765559

రెడ్డి ఫాస్ట్ సెటిల్‌మెంట్ రెడ్డి

దేశ/ విదేశ, ఇంజనీర్స్, డాక్టర్స్, Govt., Pvt. జాబ్స్, బిజినెస్, 1వ, 2వ సంబంధాలకై సంప్రదించండి.
సుధ 9394359595 / 040-65695095
www.venusmarriagebureau.com

శివతేజ కుమ్మర మ్యారేజ్ బ్యూరో

కుమ్మరి కులస్థుల వివాహ పరిచయ వేదిక
1వ, 2వ వివాహ సంబంధాలు చూడబడును
ఫ్లాట్ నెం. 410, ఇ.నెం.6-2-483, రెడ్ వాటర్ ట్యాంక్ ఎదురుగా, వనస్థలిపురం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 9346771359, 9440452487
తాడూరి ఆగయ్య కుమ్మర, తాడూరి లింగయ్య కుమ్మర

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో

అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి.



H.O : తార్నాక హుడా కాంప్లెక్స్,
srisowbhagya.hyd@gmail.com,
Konala Bhagyalakshmi Reddy, M.A.
Ex. Vice-President:
Telangana Marriage Links.
Cell: 9246960888,9030315599.

వధువు కావలెను

★ మున్నూరుకాపు : 30Y, 5'5", MBA, SWE, 95,000 PM వరునికి వధువు కావలెను. 9248064777

★ పద్మశాలి : 27Y, 5'9", B,Tech, SWE, 10 Laks PA వరునికి వధువు కావలెను. 9246960888

★ గౌడ్స్ : 29Y, 5'8", MBBS, PG Doctor, Property 10 Crores వరునికి Doctor వధువు కావలెను. 9030315599

★ ముదిరాజ్ : 29Y, 5'6", B.Tech, SWE 80,000 PM వరునికి వధువు కావలెను. 9248064777

★ గంగపుత్ర : 28Y, 5'7", B.Tech, MBA, Central, Govt Job, 52,000 PM వరునికి వధువు కావలెను. 9246960888

★ యాదవ : 28Y, 5'6", B.Tech, SWE, 12 Laks PA వరునికి వధువు కావలెను. 9030315599

★ విశ్వబ్రాహ్మణ : 25Y, 5'11", B.Tech, SWE 11.5 Lakhs PA వరునికి వధువు కావలెను. 9248064777

★ నాయీబ్రాహ్మణ : 30Y, 5'10", B.Tech, SWE, 12Lakhs PA వరునికి వధువు కావలెను. 9246960888

★ హిందూ మాల : 30Y, 5'6", B.Tech, MBA, Central Govt Job, 60,000 PM వరునికి వధువు కావలెను. 9030315599

★ హిందూ మాదిగ : 28Y, 5'5", B.Pharmacy, SAS Programmer, 6Laks, PA వరునికి వధువు కావలెను. 9248064777

వరుడు కావలెను

★ మున్నూరుకాపు: 25Y, 5'2", MBA, HR 30,000 PM వధువుకు వరుడు కావలెను. 9246960888

★ పద్మశాలి : 24Y, 5'5",M.Tech, Govt Job, 50,000 PM, Property 2 Crores వధువుకు వరుడు కావలెను. 9248064777

★ గౌడ్స్ : 25Y, 5'5", B.Tech, SWE, 25,000 PM వధువుకు వరుడు కావలెను. 9030315599

★ ముదిరాజ్: 24Y, 5'3", MBA, Analyst, 26,000 PM వధువుకు వరుడు కావలెను. 9246960888

★ గంగపుత్ర : 22Y, 5'1", B.Tech, Govt Job 50,000/- PM వధువుకు వరుడు కావలెను. 9248064777

★ విశ్వబ్రాహ్మణ : 27Y, 5'1", B.Tech, SWE, 6.2 Lakhs PA వధువుకు వరుడు కావలెను. 9030315599

★ నాయీబ్రాహ్మణ: 26Y, 5'6", MCA, SWE, 25,000 PM వధువుకు వరుడు కావలెను. 9246960888

★ కులపట్టింపు లేదు : 26Y, 5'3", B.Tech, Bank Job, 23,000/-PM వధువుకు వరుడు కావలెను. 9248064777

★ హిందూ మాల : 27Y, 5'2", B.Tech, SWE, 35,000 PM వధువుకు వరుడు కావలెను. 9030315599

★ హిందూ మాదిగ: 25Y, 5'4", M.Tech, SWE, 30,000 PM వధువుకు వరుడు కావలెను.9246960888

స్వప్న వివాహ వేదిక (మాదిగ ప్రత్యేకత)

★ గణేష్ టెంపుల్, సికింద్రాబాద్ స్టేషన్,
Cell No.: 9392897111,
(Email: snvivahavedica@gmail.com)
Time: 10 am to 7pm Tuesday Holiday



కేవలం మాదిగ దేశ, విదేశ, మొదటి, లేటు, 2వ, డాక్టర్స్, ఇంజనీర్స్, MBA, PG, డిగ్రీ & అన్ని తరగతుల వారికి వివాహ సంబంధాలు త్వరగా కుదర్చగల నమ్మకమైన సంస్థ 'స్వప్న వివాహ వేదిక'.

వధువు కావలెను

★ మాదిగ: 1984, 5'4", కలర్ M.Fair Q: B.Tech, Job NFC Govt Emp జీతం 80,000 P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1974, 5'10", కలర్ Fair Q: B.Tech MBA Job SWE T.C.S Project Manager 18LK P/A గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1990, 5'10", కలర్ Fair Q:BE (OU) Job R&B Govt Emp జీతం 60,000 P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1987, 5'9", కలర్ Fair Q: BDS MDS Job డాక్టర్ PVT Emp జీతం : 6LK P/A గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1986, 5'11", కలర్ Fair Q: B.Com Job BHEL Govt Emp జీతం : 42,000 P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1984, 5'10", కలర్ Fair Q: MBBS DNB Job డాక్టర్ జీతం 14LK PA గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1986, 5'8", కలర్ Fair Q: M.Tech Job BSNL Junior Eng in govt Emp జీతం 40,000 P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1986, 5'7", కలర్ Fair Q: IIT IIM Job SWE USA జీతం 4LK P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ : 1989, 5'8", కలర్ Fair Q: B.Tech Job Bank Govt Emp జీతం 22,000 P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111 / 7032568011(WAP).

★ మాదిగ : 1987, 5'8", కలర్ Fair Q: MBA IIT Job SWE జీతం 16 LK P/A గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111 / 7032568011(WAP).

వరుడు కావలెను

★ మాదిగ: 1986, 5'3", కలర్ Fair Q: B.Tech MBA IIM Job SWE జీతం 18LK P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1989, 5'3", కలర్ Fair Q: MBA IIM, Job SWE జీతం 14 LK P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111 / 7032568011(WAP).

★ మాదిగ: 1991, 5'2", కలర్ M.Fair Q: M.Tech IIT Job SWE జీతం 10LK P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1991, 5'4", కలర్ M.Fair Q: B.Tech, Job SWE జీతం 7LK P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1989, 5'8", కలర్ V.Fair Q: Ph.D, JNTU Job: Asst Professor జీతం 2.4 LK P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1991, 5'4", కలర్ Fair Q:M.Tech., Job Asst. Professor జీతం 20,000 P/M గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1990, 5'4", కలర్ Fair Q:B.Tech(ECE), Job SWE in USA జీతం 2LK P/M గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1986, 5'2", కలర్ M.Fair Q:B.Tech(EEE), Job AEE Irrigation Govt Emp. జీతం 50,000/- P/M గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ 2వ సంబంధం: 1985, 5'3", కలర్ Fair Q:B.Tech, Job Bank Emp. Govt Emp. జీతం 30,000/- P/M గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ : 1992, 5'5", కలర్ Fair Q:B.Com, Job Pvt. Emp. జీతం 12,000/- P/M గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

సాయి తేజ మ్యారేజ్ బ్యూరో

అన్ని కులముల వివాహ సంబంధాలకై సంప్రదించండి :-
SAI TEJA MARRIAGE BUREAU
RTC 'X' Roads, Sahara Bakery Line, Street-7, Hyderabad, T.S.
సంప్ర : 9666551031, 7075254535
E-mail: saiteja.mb@gmail.com

అమ్మాయిలు

★ ముదిరాజ్: 1991, 5'4", M.Tech, Assistant Professor నెలకు 50 వేలు గల అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 7075254535

★ ముదిరాజ్: 1989, 5'4", M.Tech, Central Govt Job GENCO 72 వేలు గల అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 7075254535

★ ముదిరాజ్ : 1991, 5'4", EEE B.Tech Amazon Manger నెలకు 50 వేలు గల అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 7075254535

★ ముదిరాజ్: 1991, 5'2", B.Tech, MBA SWE Delloite నెలకు 50 వేలు గల అందమైన ఏకైక అమ్మాయికి అబ్బాయి కావలెను. 7075254535

★ ముదిరాజ్: 1992, 5'3", B.Tech (IT) Central Govt Job USA National Park Services నెలకు 4 లక్షలు గల అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 7075254535

★ ముదిరాజ్: 1991, 5'3", MBA HSBC నెలకు 25 వేలు 10 లక్షలు కట్నం ఇచ్చు అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 7075254535

★ ముదిరాజ్: 1993, 5'3", B.Tech, SWE నెలకు 35 వేలు 30 లక్షలు కట్నం ఇచ్చు అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 7075254535

★ ముదిరాజ్: 1988, 5'5", BA, MS, Ayurvedic Doctor నెలకు 40 వేలు గల అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 7075254535

★ ముదిరాజ్: 1992, 5'3", B.Tech, SWE నెలకు 40 వేలు 15 లక్షలు కట్నం ఇచ్చు అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 7075254535

★ S.C మాదిగ: 1978, 5'5", M.Tech, Govt Job నెలకు 50 వేలు గల అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 9666551031

అబ్బాయిలు

★ ముదిరాజ్: 1980, 5'6", MA, B.Ed, Govt Job నెలకు 45 వేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 9666551031(కట్నప్రసక్తి లేదు)

★ గౌడ: 1991, 5'10", B.Tech, MBA Cetral Govt Job నెలకు 40 వేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 9666551031(కట్నప్రసక్తి లేదు)

★ S.C మాల: 1986 5'9", MCA, Govt Job Bank Employee నెలకు 35 వేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 9666551031(కట్నప్రసక్తి లేదు)

★ గౌడ్: 1987 5'10", M.Tech SWE in PUNE నెలకు 75 వేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 9666551031

★ ముదిరాజ్ : 1991 5'8", B.Tech Central Govt Job నెలకు 50 వేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 9666551031

★ S.C మాదిగ: 1988 5'8", M.Tech Central Govt Job నెలకు 35 వేలు గల అబ్బాయికి అమ్మాయి కావలెను. 9666551031(కట్న ప్రసక్తి లేదు)

★ ముదిరాజ్: 1985 5'7", BPT., M.Sc Anatomy Lecturer నెలకు 65 వేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 9666551031

★ ముదిరాజ్: 1987 5'11", M.Tech, Central Govt Job (AEE) నెలకు 75 వేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 9666551031

★ ముదిరాజ్: 1985 5'9", B.Tech (EEE) SWE నెలకు 1.20 లక్షా ఇరవైవేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 9666551031

★ రెండవ పెండ్లి : మున్నూరు కాపు 1981 5'7", B.Tech (IT) SWE 8 Lakhs P/R గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 9666551031

శివ సాయి మ్యారేజ్ బ్యూరో

అన్ని కులముల వివాహ సంబంధాలకై సంప్రదించండి :- 1-2-608/A/16, B.M.Nagar, Near Indira Park, Lower Tankbund.
E-mail: shivasai.mb9685@gmail.com
8499915904, 7386214766

అమ్మాయిలు

★ ముదిరాజ్: 1986, 5'3", Central Govt Job, 50 P/M రాగల అందమైన వెల్‌సెటిల్డ్ అమ్మాయికి తగిన అబ్బాయి కావలెను. 7386214766

★ ముదిరాజ్: 1995, B.Tech, SWE గల అందమైన అమ్మాయికి తగిన అబ్బాయి కావలెను. 7386214766

★ ముదిరాజ్: 1988, 5'2", MBA, SWE, 30 P/M గల అందమైన అమ్మాయికి తగిన అబ్బాయి కావలెను. 7386214766

★ గౌడ: 1992, B.Tech, 5.3, SWE 40P/M గల అందమైన వెల్‌సెటిల్డ్ అమ్మాయికి తగిన అబ్బాయి కావలెను. 7386214766

★ గౌడ: 1990, 5.2, (M.Sc B.Ed) PVT, గల అందమైన అమ్మాయికి తగిన అబ్బాయి కావలెను. 7386214766

★ గౌడ: 1985, 5.3, B.Tech, PVT, 25 P/M 20 లక్షలు కట్నం ఇచ్చు అందమైన వెల్‌సెటిల్డ్ అమ్మాయికి తగిన అబ్బాయి కావలెను. 7386214766

★ SC మాదిగ హిందు: 1990, M.Pharmacy, PVT, 20 వేలు P/M రాగల అమ్మాయికి తగిన అబ్బాయి కావలెను. 7386214766

★ SC మాల హిందు: 1992, 5.4, B.Tech, SWE గల అందమైన అమ్మాయికి తగిన అబ్బాయి కావలెను. 7386214766

★ SC మాదిగ హిందు: 1989, 5.4, B.Sc, Govt Employee గల అందమైన వెల్‌సెటిల్డ్ అమ్మాయికి తగిన అబ్బాయి కావలెను. 7386214766

★ రెండవ పెళ్ళి ముదిరాజ్: 1989, 5.2, M.Sc, B.Ed, P.V.T టీచర్ అందమైన కులపట్టింపు లేని డైవర్సీ అమ్మాయికి తగిన అబ్బాయి కావలెను. 7386214766

అబ్బాయిలు

★ గౌడ: 1983, 5'7", MBA, Own Business, 25కోట్ల ప్రాపర్టీ గల అందమైన వెల్‌సెటిల్డ్ అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. (కట్న ప్రసక్తిలేదు) 8499915904

★ గౌడ: 1984, 5'6", MBA, Bank Employee, 40వేలు గల అందమైన వెల్‌సెటిల్డ్ అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. 8499915904

★ గౌడ: 1988, 5'6", B.Tech, SWE, 50P/M గల వెల్‌సెటిల్డ్ అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. 8499915904

★ ముదిరాజ్: 1989, 5'10", M.Tech, SWE, 70వేలు P/M, గల అందమైన ఏకైక వెల్‌సెటిల్డ్ అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. 8499915904

★ ముదిరాజ్: 1984 5'6", MBA, Central Govt Employee 50+P/M గల ఏకైక వెల్‌సెటిల్డ్ అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. 8499915904

★ ముదిరాజ్: 1990 5'10", BSc Own business, 60 + P/M, 3కోట్ల ప్రాపర్టీ గల అందమైన అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. 8499915904

★ S.C మాల హిందు : 1985 5'5", Degree, P.V.T 30 + P/M, ప్రాపర్టీ గల అందమైన ఏకైక అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. 8499915904

★ S.C మాదిగ హిందు : 1988, 5'6", MSc, P.V.T 30 + P/M, ప్రాపర్టీ గల అందమైన ఏకైక అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. 8499915904

★ S.C మాల హిందు : 1988, 5'6", MSc, BEd, P.V.T, ప్రాపర్టీ గల అందమైన ఏకైక అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. 8499915904

★ గౌడ: 1985 5'6", B.Tech, SWE, ఆస్ట్రేలియా 3లక్షలు P/M, గల అందమైన వెల్‌సెటిల్డ్ అబ్బాయికి అమ్మాయి కావలెను. 8499915904

బంగారం ధరలు

ఢిల్లీ

24 క్యారెట్లు	30,050
22 క్యారెట్లు	29,900
వెండి (కిలో)	40,200

కోడిగుడ్ల ధరలు	నెక్	హెచ్ఎల్ఎఫ్ఏ
హైదరాబాద్	343-00	343-00
రంగారెడ్డి	343-00	343-00
మెదక్	343-00	343-00
కరీంనగర్	345-00	---
వరంగల్	345-00	---
రిటైల్ ప్రైస్	4-05	4-05

చికెన్ ధరలు	
ఫారం ధర	77.00
రిటైల్ లైవ్	91.00
డ్రెస్డ్	127.00
స్కిన్‌లెస్	150.00

డీఎల్ఎఫ్ లాభాల్లో భారీ క్షీణత

న్యూఢిల్లీ, ఆగస్టు 12: దేశంలో అతిపెద్ద రియల్టీ సంస్థ డీఎల్ఎఫ్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 58 శాతం క్షీణించి రూ.109.10 కోట్లకు పరిమితమైంది. 2016-17 ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి లాభం రూ.261.85 కోట్లుగా ఉంది. కంపెనీ ఆదాయం 9 శాతం పెరిగి రూ.2,211.24 కోట్లుగా నమోదైనట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది.

జియో దెబ్బకు ఆర్‌కామ్ విలవిల

న్యూఢిల్లీ, ఆగస్టు 12: అనిల్ అంబానీకి చెందిన టెలికం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ భారీ నష్టాలను మూటగట్టుకున్నది. తన అన్న ముకేశ్ అంబానీకి చెందిన టెలికం వెంచర్ రిలయన్స్ జియో దెబ్బకు కంపెనీ విలవిలలాడింది. జూన్ 30తో ముగిసిన మూడు నెలల్లో సంస్థ రూ.1,210 కోట్ల నష్టాన్ని చవి చూసింది. రుణభారంతో సతమతమవుతున్న సంస్థకు ఆర్థిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండటంతో మరింత కుదేలైంది. జియో ప్రకటించిన టారిఫ్‌ల దెబ్బకు గడిచిన మూడు త్రైమాసికాలుగా నష్టాలనే ప్రకటించింది. 2016-17 ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి సంస్థ రూ.90 కోట్ల లాభాన్ని గడించింది. టెలికం రంగంలో నెలకొన్న పోటీ కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఈ రంగంలో నిస్తేజం నెలకొననున్నదని ఆర్‌కామ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆదాయం విషయానికి వస్తే ఏడాది ప్రాతిపదికన 33 శాతం క్షీణించి రూ.3,591 కోట్లకు పరిమితమైనట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో ఇది రూ.5,361 కోట్లుగా ఉంది. గడిచిన 20 ఏండ్లలో తొలిసారిగా టెలికం రంగంపై నీలినీడలు కమ్ముకున్నాయని, నిర్వహణ మార్జిన్లు తగ్గుముఖం పట్టడం, వడ్డీల కోసం అధికంగా నిధులు కేటాయించాల్సి రావడం, తరుగుదల అధికంగా ఉండటం, రుణ విమోచన చార్జీలు అధికమవడం, స్పెక్ట్రం కొనుగోలుకు అధిక స్థాయిలో నిధులు వెచ్చించడంతో ఈ రంగంపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనుందని కంపెనీ పేర్కొంది. ప్రస్తుతం ఆర్‌కామ్ రూ.45 వేల కోట్ల స్థాయిలో అప్పు ఉంది. ఈ నెల చివరినాటికి సిస్టమా శ్యామ్ టెలికం విలీన ప్రక్రియ పూర్తి కానున్నదని సంస్థ అంచనావేస్తున్నది. విలీనం పూర్తయిన తర్వాత ఎనిమిది సర్కిళ్లకు సంబంధించి 30 మెగాహెడ్జ్ స్పెక్ట్రం కంపెనీ వశమవనున్నది. ఈ స్పెక్ట్రం కాలపరిమితి 2033 వరకు ఉన్నది. ఆర్‌కామ్‌లో ఎయిర్‌సెల్ విలీనమవనుండటంతో కంపెనీ అప్పు రూ.14 వేల కోట్లు తగ్గనున్నది. రుణాలను తగ్గించుకోవడంలో భాగంగా సంస్థ..టవర్ల బిజినెస్ బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్‌లో వాటాను విక్రయించడం ద్వారా రూ.11 వేల కోట్లు రావచ్చునని అంచనావేస్తున్నది. శుక్రవారం స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర 2.12 శాతం తగ్గి రూ.20.75 వద్ద ముగిసింది.

క్యూ1లో రూ.1,210 కోట్ల నష్టం



ఆదానీ పోర్ట్స్‌లాభాల్లో నిస్తేజం

న్యూఢిల్లీ, ఆగస్టు 12: దేశంలో అతిపెద్ద రేవుల నిర్వహణ సంస్థ ఆదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ లిమిటెడ్(ఏపీసెజ్) ఆర్థిక ఫలితాలకు అధిక పన్ను సెగ తగిలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.710.25 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.822.57 కోట్ల లాభంతో పోలిస్తే 13.65 శాతం క్షీణత నమోదైంది. ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో కంపెనీ ఆదాయం రూ.2,085.14 కోట్ల స్థాయి నుంచి రూ.2,959.63 కోట్లకు ఎగబాకింది. సమీక్షకాలంలో కంపెనీ నిర్వహణ ఖర్చులు రూ.1,206.40 కోట్ల స్థాయి నుంచి రూ.1,867.43 కోట్లకు చేరుకున్నాయి. రేవులు, లాజిస్టిక్ వ్యాపారాలు ఆశించిన స్థాయి కంటే మెరుగైన పనితీరు కనబరిచాయని ఏపీసెజ్ సీఈవో కరణ్ అదానీ తెలిపారు. సామర్థ్యం పెంపు, ఆటోమేషన్, టెక్నాలజీ సేవలు, ఖర్చులు తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యత నివ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గడిచిన త్రైమాసికంలో ఏపీసెజ్ ద్వారా 5 కోట్ల టన్ను సరుకు రవాణా అయింది. ప్రస్తుతం దేశంలో రెండో అతిపెద్ద వ్యాపారాన్ని కలిగివున్న ఆదానీ గ్రూపు వార్షిక టర్నోవర్ 1200 కోట్ల డాలర్లుగా నమోదైంది.

దేశంలో సరిపడా చక్కెర నిల్వలు

సుంకం రహిత దిగుమతి ఆలోచన లేదు: పాశ్వాన్

న్యూఢిల్లీ, ఆగస్టు 12: దేశంలో సరిపడ నిల్వలు ఉండటంతో సుంకం రహిత చక్కెర దిగుమతి ఆలోచనేదీ కేంద్ర ప్రభుత్వం వద్ద లేదని ఆహార శాఖ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ స్పష్టంచేశారు. సరఫరా మెరుగ్గావుండటంతోపాటు నిలకడంగా ధరలు ఉన్న నేపథ్యంలో అక్టోబర్ 2017 సీజన్‌కుగాను చక్కెర ఉత్పత్తిని తొందరగా ప్రారంభించాలని మిల్లర్లపై కేంద్రం ఒత్తిడి తీసుకురానున్నది. ప్రస్తుతం నిలకడగా ఉన్న ధరలు వచ్చే పండుగ సీజన్‌లో ఇదే విధంగా ఉండే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న చక్కెరకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో గత నెలలో దిగుమతి సుంకాన్ని 50 శాతం మేర పెంచింది. దేశీయ అవసరాలకు సరిపడ చక్కెర నిల్వలు ఉన్నాయని, ఇప్పటికే 5 లక్షల టన్నుల చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకున్నామని, మరోసారి ఈ ఆలోచన లేదని మంత్రి వెల్లడించారు. 2016-17 సీజన్(అక్టోబర్-సెప్టెంబర్ మధ్యకాలంలో) దేశవ్యాప్తంగా 2.79 కోట్ల టన్నుల చక్కెర సరఫరా అయిందన్నారు. నూతన చక్కెర వచ్చే వరకు ఎలాంటి ఢోకా లేదన్నారు. ప్రస్తుత సంవత్సరంలో దేశీయంగా డిమాండ్‌కు అనుగుణంగా 4.2 మిలియన్ టన్నుల అందుబాటులో ఉండనున్నదని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో నెలకు సరాసరిగా 2-2.5 మిలియన్ టన్నుల చక్కెరను వాడుతున్నారు. అంతక్రితం ఏడాది ఉత్పత్తైన 2.51 కోట్ల టన్నులతో పోలిస్తే గడిచిన సంవత్సరంలో 2.04 కోట్ల టన్నులకు తగ్గనున్నదని ప్రాథమిక అంచనా.



గోధుమల దిగుమతిపై సుంకం పెంచే అవకాశం లేదు..
ఇప్పట్లో గోధుమల దిగుమతిపై సుంకం పెంచే ఆలోచనేది ప్రభుత్వం వద్ద లేదని పాశ్వాన్ స్పష్టంచేశారు. ప్రస్తుతం విదేశాల నుంచి దిగుమతి అవుతున్న గోధుమలపై 10 శాతం సుంకాన్ని విధిస్తున్నారు. 2016-17 పంట సంవత్సరం(జూలై-జూన్) మధ్యకాలంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 9.74 కోట్ల టన్నుల గోధుమలు ఉత్పత్తి అయ్యాయి. ఈ నేపథ్యంలో విదేశాల నుంచి వస్తున్న గోధుమలకు అడ్డుకట్ట వేయడానికి మార్చి 28న 10 శాతం దిగుమతి సుంకాన్ని విధించింది. అంతకుముందు నాలుగు నెలలపాటు సుంకం లేకుండా 55 లక్షల టన్నుల గోధుమలు దిగుమతి చేసుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో గోధుమల ధరలు భారీగా పెరుగుతున్నాయి. 2016-17 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం వద్ద 3.08 కోట్ల టన్నుల స్టాక్ నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్లో సరాసరి కిలో ధర రూ.18-20 మధ్యలో కొనసాగుతున్నది.



ఫ్లిప్‌కార్ట్ @ నం.3

బెంగళూరు, ఆగస్టు 12: దేశీయ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్.. ప్రపంచంలో అత్యధిక ఫండింగ్ పొందిన మూడో ప్రైవేట్ సంస్థగా అవతరించింది. ఇప్పటివరకు సంస్థ 700 కోట్ల డాలర్ల నిధులు సేకరించగలిగింది. జపాన్‌కు చెందిన టెక్నాలజీ, టెలికం దిగ్గజ గ్రూపు సాఫ్ట్‌బ్యాంక్ నుంచి ఫ్లిప్‌కార్ట్ తాజాగా 240 కోట్ల డాలర్ల పెట్టుబడులు సమీకరించింది. దాంతో కంపెనీలో అతిపెద్ద వాటాదారుగా సాఫ్ట్‌బ్యాంక్ ఎదిగింది. అత్యధిక ఫండింగ్ రాబట్టిన స్టార్టప్‌లలో అంతర్జాతీయ ఆన్‌లైన్ ట్యాక్సీ సేవల సంస్థలు దీదీ చిక్సింగ్, ఉబెర్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. చైనాకు చెందిన దీదీ చిక్సింగ్.. ఏప్రిల్‌లో 500 కోట్ల డాలర్లు సేకరించింది. దాంతో సంస్థలోకి ఇప్పటివరకు వచ్చిన మొత్తం పెట్టుబడుల విలువ 1,500 కోట్ల డాలర్లకు చేరుకుంది. అమెరికన్ స్టార్టప్ ఉబెర్‌లోకి ఇప్పటివరకు 1,290 కోట్ల నిధులు ప్రవహించాయి. అత్యధికంగా నిధులు ఆకర్షించిన టాప్ టెన్ కంపెనీల్లో నాలుగు ఆన్‌లైన్ ట్యాక్సీ సేవలందించేవే. దీదీ, ఉబెర్‌తోపాటు సిలికాన్ వ్యాలీకి చెందిన లిఫ్ట్, భారత సంస్థ ఓలాకు సైతం ఈ జాబితాలో చోటు దక్కింది. ఇక ఫ్లిప్‌కార్ట్..టాప్‌టెన్‌లోని ఏకైక ఈ-కామర్స్ సంస్థ.

ప్రభుత్వ ఆదాయం పెరిగితేనే జీఎస్టీ రేట్ల తగ్గుదల

ఆర్థిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్



కోల్‌కతా, ఆగస్టు 12: జీఎస్టీ హయాంలో పన్ను శ్లాబు రేట్ల తగ్గుదల ప్రభుత్వ ఆదాయం పెరుగడంపైనే ఆధారపడి ఉందని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అన్నారు. జీఎస్టీ చట్టంలో పన్ను రేటును నాలుగు శ్లాబులుగా (5, 12, 18, 28 శాతం) నిర్ణయించారు. గత పరోక్ష పన్నుల చట్టం హయాంలో దేశంలో 80 లక్షల మంది పన్ను చెల్లింపుదారులుండేవారని, జీఎస్టీ అమలుతో కొత్తగా 13.2 లక్షల మంది పన్ను పరిధిలోకి వచ్చారని మంత్రి తెలిపారు. అందులో 56 వేల మంది పశ్చిమ బెంగాల్ రాష్ర్టానికి చెందినవారేనని ఆయన వెల్లడించారు. ముమ్ముందు జీఎస్టీ నెట్‌వర్క్‌ను (జీఎస్టీఎన్) మరింత మెరుగుపర్చడం జరుగుతుందన్నారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, రివర్స్ చార్జ్ మెకానిజం కోసం డీలర్లు తమ ఆర్థిక లావాదేవీల వివరాలను కంప్యూటరీకరించాలని ఆయన కోరారు. నల్లబజారు కార్యకలాపాలను అరికట్టేందుకే ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు.

బంగారంపై 3% జీఎస్టీ చాలా తక్కువ

ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్

న్యూఢిల్లీ, ఆగస్టు 12: బంగారంపై ప్రస్తుతం విధిస్తున్న పన్ను చాలా తక్కువని, మరింత పెంచాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే నివేదికలో ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ అభిప్రాయపడ్డారు. 'ధనికులు అధికంగా కొనుగోలు చేసే బంగారం, ఆభరణాలపై ప్రస్తుతం విధిస్తున్న 3 శాతం జీఎస్టీ రేటు కనిష్ఠ స్థాయిలో ఉంది' అని శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 'ఆర్థిక సర్వే 2016-17' రెండో భాగం పేర్కొన్నారు. సుబ్రమణియన్ ఈ నివేదిక రూపకర్త. ధనవంతులు కూడా విద్య, వైద్య సేవలు పొందుతారు కాబట్టి వాటిని సైతం జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని రిపోర్టు అభిప్రాయపడింది. ప్రభుత్వం ప్రస్తుతం విద్య, వైద్య సేవలకు జీఎస్టీ నుంచి మినహాయింపునిచ్చింది. విద్యుత్‌ను సైతం జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడం ద్వారా ఆ రంగ సంస్థల మధ్య పోటీతత్వం పెరుగుతుందని ఆర్థిక సర్వే రిపోర్టు పేర్కొంది. ప్రస్తుతం కొత్త పరోక్ష పన్నుల చట్టం నుంచి మినహాయింపు కల్పించిన కొన్ని రియల్టీ లావాదేవీలతోపాటు ఆల్కహాల్‌పైనా జీఎస్టీ విధించడం ద్వారా పారదర్శకత పెంచి, అవినీతిని తగ్గించవచ్చని రిపోర్టు సూచించింది.



● కాడెద్దులను మింగిన కరెంటు



వ్యవసాయ పనుల్లో నిమగ్నమై.. కాడెద్దులతో దుక్కి దున్నతున్న రైతుకు కన్నీరే మిగిలింది. చూస్తుండగానే కరెంటు భూతం ఆ మూగజీవాలను మింగింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బందాలగడ్డల తండాకు చెందిన గిరిజన రైతు బానోత్ మొగిలి తనకున్న వ్యవసాయ భూమిలో దున్నుతుండగా పొలంలో ఉన్న విద్యుత్ స్తంభం సపోర్ట్ వైర్‌కు కరెంటు సరఫరా అయ్యింది. దానికి తగిలిన కాడెడ్లు అక్కడికక్కడే మృతి చెందాయి. మొగిలికి స్వల్పగాయాలయ్యాయి.

-గూడూరు

పాలేరు పాత కాల్వ ట్రయల్‌రన్ సక్సెస్

కూసుమంచి, నమస్తే తెలంగాణ: పాలేరు పాత కాల్వకు ట్రయల్‌రన్ విజయవంతమైంది. నైజాం కాలంలో నిర్మితమైన పాలేరు పాత కాల్వ శిథిలావస్థకు చేరగా తెలంగాణ ప్రభుత్వం రూ.68 కోట్ల నిధులతో పునరుద్ధరణ పనులు చేపట్టింది. ఫిబ్రవరి 16న భారీ నీటిపారుదల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు, ఆర్‌అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాత కాలువ లైనింగ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా, జూలై 31న పనులు పూర్తి కావడంతో అధికారులు శనివారం ట్రయల్ రన్ చేశారు. ముందుగా 50 క్యూసెక్కులు, 10నిమిషాల అనంతరం 100 క్యూసెక్కులు, 20 నిమిషాల తర్వాత 200 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. పాలేరు జలాశయంలోని కృష్ణమ్మ జలాలు పాలేరు పాత కాల్వలో పరవళ్లు తొక్కాయి. నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలుగకపోవడంతో ట్రయల్‌రన్ సక్సెస్ అయినట్టు అధికారులు ప్రకటించారు. పాలేరు ట్రయల్ రన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాల్ ద్వారా పరిశీలించారు. మంత్రి తుమ్మల కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న విషయం తెలిసిందే. రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకొనేందుకే ట్రయల్ రన్ నిర్వహించినట్టు మంత్రి తెలిపారు.



పాలేరు పాత కాల్వలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

● నల్లవాగు ప్రాజెక్టు స్వర్ణోత్సవం



సంగారెడ్డి జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన నల్లవాగు ప్రాజెక్టు స్వర్ణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్ప వదిలారు. అనంతరం మాట్లాడుతూ పూర్తి ఆయకట్టు సేద్యం కోసం కెనాల్ పునరుద్ధరణకు రూ.24కోట్ల నిధులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు.

- సిర్గాపూర్

కల్తీ సరుకుల పట్టివేత

హుజూరాబాద్, నమస్తే తెలంగాణ: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం పలు దుకాణాలపై దాడులు చేసి, భారీగా కల్తీ సరుకులు పట్టుకున్నారు. పరకాల క్రాస్‌రోడ్డు వద్ద గల వరలక్ష్మి ఇండస్ట్రీస్‌లో నిల్వ ఉన్న 2,100 లీటర్ల వంట నూనెను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై యజమాని కల్లూరి కృష్ణమూర్తిని అధికారులు ప్రశ్నించగా నూనె వ్యాపారం మానేసి రెండేండ్లవుతున్నదని, ఆ నూనె అప్పటిదేనని బదులివ్వడంతో దాన్ని పారబోశారు. అయితే ఆ వ్యాపారి ప్రస్తుతం హుజూరాబాద్ పట్టణంలో నూనె వ్యాపారం చేస్తున్నాడు. పట్టుకున్న నూనె విలువ రూ.2 లక్షలు ఉంటుందని అధికారులు చెప్పారు. పట్టణంలోని వరలక్ష్మి ఆయిల్ దుకాణంలో తనిఖీలు చేసి రికార్డులు సక్రమంగా లేవని గుర్తించారు. కృష్ణ ఏజెన్సీ, రాఘవేంద్ర ఉడిపి హోటల్ ఎదుట గల టీపాయింట్‌లో తనిఖీలు చేయగా, రెండుచోట్ల కలిపి 50 కిలోల విడి టీ పొడిని పట్టుకున్నారు. దానిని పరిశీలించిన అధికారులు కల్తీదని తేల్చారు. పట్టుబడ్డ టీపొడి విలువ రూ.15వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇందిరామార్గ్‌లోని లలిత కిరాణా దుకాణంలో సోదాలు చేయగా, రూ. 50వేల విలువగల నిషేధిత పొగాకు ఉత్పత్తులు దొరికాయి. ఫ్రైడ్‌రైస్, బేకరీల్లో ఉపయోగించే సాస్ క్యాన్లను పట్టుకున్నారు. బావర్చీ బిర్యాని సెంటర్, బృందావన్ దాబాల్లో తనిఖీలు నిర్వహించారు. బావర్చిలో కొంతమేర అపరిశుభ్రంగా ఉండడంతో మొదటి తప్పుగా భావించి వదిలివేస్తున్నట్టు యజమానికి చెప్పారు. బృందావన్ దాబా హోటల్‌లో వంటగది పూర్తిగా అపరిశుభ్రంగా ఉండడంతోపాటు బూజు పట్టిన పాలక్‌పన్నీర్, వండిన చికెన్ కూరను నీళ్లతో కడిగి మరల ఉపయోగించేందుకు సిద్ధం చేసినట్టు గుర్తించారు. దీంతో దాబాను సీజ్ చేశారు. జమ్మికుంట రోడ్డులోని వరలక్ష్మి చిరుతిండ్ల పరిశ్రమపై దాడి చేయగా, అందులో తయారయ్యే పదార్థాలన్నీ నాణ్యతలేనివని తేల్చారు.

హజ్ శిబిరం ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హజ్ యాత్రికులకోసం ప్రభుత్వం హజ్‌హౌస్‌లో ఏర్పాటుచేసిన శిబిరం శనివారం ప్రారంభమైంది. మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్, హజ్ కమిటీ ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ ఎస్‌ఏ షుకూర్ యాత్రికులకు స్వాగతం పలికారు.

10 గంటల దారికి 26 గంటల ప్రయాణం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఓ ట్రావెల్స్ నిర్వాకంతో 10 గంటల్లో చేరుకోవాల్సిన గమ్యాన్ని 26 గంటలకు చేరుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన 36 మంది ప్రయాణికులు శుక్రవారం రాత్రి 10 గంటలకు బెంగళూరు నుంచి మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సులో నగరానికి బయలుదేరారు. సాధారణంగా బస్సులు బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు అనంతపురం, కర్నూలు మీదుగా సిటీకి వస్తాయి. ఈ బస్సు మాత్రం బెంగళూరు నుంచి హోస్పేట్, రాయ్‌చూర్ మీదుగా శనివారం రాత్రి 8 గంటలకు నగరానికి చేరుకుంది. బస్సుకు అనుమతులు లేకపోవడంతో డ్రైవర్ కిరణ్, నిర్వాహకులు కర్ణాటక అడవుల్లో తిప్పారని ఆరోపిస్తూ ప్రయాణికులు డ్రైవర్‌ను నిలదీశారు. ప్రయాణికుల ఫిర్యాదుతో ట్రావెల్స్ యాజమాన్యంపై రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

రాష్ట్ర అభివృద్ధే సర్కారు ధ్యేయం

పత్రికల్లో ఫొటోల కోసం విమర్శించే చరిత్ర మాదికాదు: ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్

మిషన్ భగీరథ, ప్రాజెక్టులపై జీఎస్టీ వద్దు : ఎంపీ వినోద్ కుమార్



శనివారం కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్ చిత్రంలో ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే బొడిగ శోభ తదితరులు

గంగాధర: ఇసుక, గ్రానైట్ క్వారీలపై తమకు మోజులేదని మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఉమ్మడి పాలనలో అన్ని రంగాల్లో వెనుకబడిన తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే బొడిగ శోభ, ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ, జిల్లా ప్రజలు మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌కు వెళ్లకుండా జిల్లా కేంద్రంలోనే అన్ని హంగులు, అధునాతన సౌకర్యాలతో వైద్యం అందించేందుకు రూ. 10 కోట్లు మంజూరుచేసినట్టు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చూస్తే ఎమ్మెల్యేలు, మంత్రులు భయపడుతారని ఓ కాంగ్రెస్ నాయకుడు అవాకులు, చెవాకులు పేలాడని మండిపడ్డారు. 'మీ జేజమ్మలు రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడే ప్రశ్నించి తెలంగాణ సాధించుకున్న చరిత్ర మాది' అని వారికి సమాధానంగా చెప్పారు. ఫొటోల కోసం ప్రెస్‌మీట్లు పెట్టి అనుచిత వ్యాఖ్యలు చేసే సంస్కృతి తమది కాదన్నారు. ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ, కుల సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తున్నదని, ఇందులో భాగంగానే యాదవులకు 75 శాతం రాయితీపై గొర్రెల యూనిట్లు పంపిణీ చేశామన్నారు. కేంద్రప్రభుత్వం ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, కాలువలపై జీఎస్టీ విధించవద్దని పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీలమంతా గళమెత్తామని పేర్కొన్నారు. అనంతరం పలుచోట్ల మొక్కలు నాటారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, దక్షిణ మధ్యరైల్వే బోర్డు సభ్యుడు సంపత్, జిల్లా వైద్యాధికారి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాహిత్యానికి అంతర్జాతీయ ఖ్యాతి

ఎంపీ కల్వకుంట్ల కవిత



శనివారం నిజామాబాద్‌లో తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఎస్వీ సత్యనారాయణను సన్మానిస్తున్న ఎంపీ కవిత

నిజామాబాద్ కల్చరల్ : సురవరం ప్రతాపరెడ్డిని ఆదర్శంగా తీసుకుని తెలంగాణ సాహిత్యానికి అంతర్జాతీయ కీర్తి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్‌లో నిర్వహించిన 'జాగృతి కవితాంజలి'కి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో కవులే లేరన్న సమయంలోనే అప్పటి గోల్కొండ పత్రికా సంపాదకులు, ప్రముఖ తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ అంతా సంచరించి 300 పైచిలుకు కవులు, కవయిత్రులతో కూడిన గోల్కొండ కవుల ప్రత్యేక సంచికను వెలువరించి ఆంధ్రాపాలకులను ఆశ్చర్యానికి గురిచేశారని గుర్తు చేశారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ఎంపిక చేసిన కవిత్వాలతో కూడిన తెలంగాణ ప్రత్యేక సంచికను తీసుకురానున్నామని తెలిపారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి రోజుప్రారంభమైన 'కవితాంజలి', డాక్టర్ కాళోజీ నారాయణరావు జయంతి రోజున హైదరాబాద్ రవీంద్రభారతిలో ముగుస్తుందని తెలిపారు. పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఈ కవి సమ్మేళనాలు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయ్యే అవకాశం ఉన్నదని, దానిని గిన్నిస్ బుక్‌లో ఎక్కేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా తెలుగు యూనివర్సిటీ వీసీ సత్యనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగా రెడ్డి రాష్ట్ర జాగృతి సాహిత్య విభాగం కన్వీనర్ కాంచనపల్లి తదితరులు మాట్లాడారు. 136 మంది కవులు, కవయిత్రులను ఎంపీ కవిత ఘనంగా సన్మానించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమానికి హరిద రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోల్ స్కూలు వద్ద మొక్కనాటి నీళ్లు పోస్తున్న మంత్రి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: జూపల్లి

పెంట్లవెల్లి: గ్రామాలను అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌లో రూ.29 లక్షలతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామం స్వచ్ఛత పాటించి, స్వచ్ఛ తెలంగాణగా మారాలని పిలుపునిచ్చారు. పేద విద్యార్థుల చదువు కోసం గురుకుల పాఠశాలలను ఆధునిక వసతులతో ఏర్పాటు చేసి, ఆచరణలో పెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బెట్టింగ్ ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న గద్వాల డీఎస్పీ బాలకోటి

గద్వాల అర్బన్ : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. రెండో రైల్వే గేటు సమీపంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం రాత్రి కొందరు వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నరన్న సమాచారంతో ఎస్సై శ్రీనివాసులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారని డీఎస్పీ బాలకోటి విలేకరులకు వెల్లడించారు. పోలీసుల దాడిలో రాఘవాచారి(అయిజ), మహ్మద్(కడప), వీరేశ్(గద్వాల), రఫీ(కడప)ని పట్టుకున్నామన్నారు. వారి నుంచి 26 సెల్‌ఫోన్లు, 50 సిమ్ కార్డులు, రూ.11 వేల నగదు, ఒక ఇన్నోవా కారు దాదాపు రూ.2 కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్టు తెలిపారు. వీరు శుక్రవారం వెస్టిండీస్‌లో జరుగుతున్న సీపీఎల్ మ్యాచ్‌పై బెట్టింగ్ వేసుకున్నట్టు చెప్పారు. ఈ నలుగురు గద్వాల, కర్నూల్, కడప, అయిజ, హైదరాబాద్, వనపర్తి, రాయచూర్, మహబుబ్‌నగర్‌లకు సంబంధించిన ఏజెంట్లతో బెట్టింగ్‌కు పాల్పడుతునట్టు పేర్కొన్నారు.

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	6003	6003	1705	1704.72	128.72	128.19
నారాయణపూర్	4847	11643	1615	1610.89	37.646	32.10
జూరాల	3425	4478	1045	1040.39	9.66	6.932
తుంగభద్ర	6941	325	1633	1616.15	100.86	48.43
శ్రీశైలం	763	50	885	778.2	215.807	19.71
నాగార్జునసాగర్	804	804	590	500.40	312.045	115.94
పులిచింతల	383	0	175	111.55	45.77	2.14
ప్రకాశం బ్యారేజీ	8274	8274	57.05	54.75	3.070	2.46

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు



(జూన్1 నుంచి ఇప్పటివరకు 331.408 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	52069	52069	1522	1511.91	102.732	65.91
కడెం	33	665	700	685.93	7.6	4.47
ఎస్సారెస్పీ	0	182	1091	1055	90.313	9.29
సింగూరు	0	275	1717.93	1708.81	29.91	17.71
నిజాంసాగర్	234	234	1405	1380.10	17.803	1.310
ఎల్లంపల్లి	1018	418	485	471.92	20.175	10.40
లోయర్‌మానేరు	0	129	920	893.50	24.07	7.333
ధవళేశ్వరం	52069	52069	45	45	2.93	2.93

ఆర్డీఎస్ ఆయకట్టుకు భరోసా

- రాజోళిబండ ఆనకట్టలో పూడిక తొలగింపు
- స్ట్రక్చర్ల నిర్మాణం వేగవంతం
- రెండు రాష్ట్రాలతో సమన్వయం చేసిన సర్కారు

జోగుళాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి :



రాజోళిబండ డైవర్షన్ స్కీం ఆనకట్ట దగ్గర పూడికతీసిన దృశ్యం

చాలా ఏండ్ల తర్వాత ఆర్డీఎస్ ఆనకట్టలో పేరుకుపోయిన పూడిక మట్టి తొలగింపు పనులు పూర్తి చేశారు. దిగువన ఉన్న రాయలసీమకు నీటి సరఫరా తగ్గుతుందనే భావనతో ఆంధ్రా పాలకులు దశాబ్దాలుగా అడ్డుకుంటూ వచ్చారు. టీఆర్‌ఎస్ సర్కారు రెండు రాష్ట్రాలతో సమన్వయం చేయడం, ముందస్తుగానే పనులను సంబంధించిన నిధులు కర్ణాటక ప్రభుత్వ ఖాతాలో జమ చేయడంతో కర్ణాటకలోని ఆర్డీఎస్ ప్యాకేజీ-1లో భాగంగా ఆనకట్టలో పేరుకుపోయిన పూడికను తొలిగించారు. ఇందుకోసం అధికారులు రాయచూర్, బెంగళూరు, తుంగభద్ర డ్యాం దగ్గర పలుమార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. సిల్ట్ తొలగింపునకు అడ్డుచెప్తూ వచ్చిన ఏపీ ఇరిగేషన్ అధికారులను ఒప్పించారు. నెల రోజులుగా పూడికతీత చేపట్టడంతో ఆనకట్టలోని షట్టర్ల సమీపంలో నీటి నిల్వ పెంచుకునేందుకు అవకాశం ఏర్పడింది. గతంలో పూడిక మట్టి గేట్లకు అడ్డుగా ఉండటంతో భారీ స్థాయిలో నీరు వస్తేనే గేట్ల వరకు నీరు పారేది. ప్రస్తుతం ఆ సమస్య పరిష్కారమైంది. ఇప్పటికే స్కవర్ స్లూయిస్ నూతన గేట్లను ఏర్పాటు చేయడంతోపాటు పూడిక తొలగించడంతో అడ్డంకులు తొలగినట్టు అయింది. మూడు రాష్ట్రాల సీఈల నిర్ణయం మేరకు ఆర్డీఎస్ షట్టర్ల సమీపంలో 200 మీటర్ల పొడవు, 25 మీటర్ల వెడల్పు, అర మీటర్ లోతు సిల్టును తొలిగించారు.

నిధుల కేటాయింపులిలా..

ఆర్డీఎస్ దగ్గర పెండింగ్ పనులు, కాల్వల మరమ్మతుపై సర్కారు ప్రత్యేక దృష్టి పెట్టింది. మునుపెన్నడూ లేని విధంగా ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు విడుదల చేసింది. ఆర్డీఎస్ పరిధిలోని పూర్తిస్థాయి ఆయకట్టు 87,500 ఎకరాలకు సాగు నీరందించడమే లక్ష్యంగా నిధులు విడుదల చేసింది. ఈసారి బడ్జెట్‌లో రూ.72 కోట్లను కేటాయించారు. దీనిలో రూ. 6 కోట్లు మెయింటెనెన్స్ కోసం, రూ. 66 కోట్లను ప్యాకేజీ-1, ప్యాకేజీ-2 పనుల కోసం కేటాయింపులు చేశారు. అయినప్పటికీ పనులు ముందుకు సాగకపోవడంతో ఈ ఏడాది జూన్ 12న ప్యాకేజీ-1 పనులకు రూ.13.66 కోట్లను విడుదల చేశారు. ఈ నిధులను కర్ణాటక ప్రభుత్వ ఖాతాలో జమచేసి, అక్కడి ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుంటూనే, పనులుచేస్తున్న కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకువచ్చారు. ప్యాకేజీ-1లో భాగంగా పూడికమట్టి తొలిగింపు, షట్టర్ల నిర్మాణం, బకెట్ల నిర్మాణ పనులు చేపట్టారు. ప్రధానంగా పూడిక తొలగింపును ముందుగా చేయాలని నిర్ణయం తీసుకోవడంతో జూలై నుంచి పనులు ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు పూడికతీత, షట్టర్ల నిర్మాణం పూర్తి చేశారు.

ఆయకట్టుకు భరోసా

ఆర్డీఎస్ పరిధిలో ప్రతీసారి కేవలం 20 వేల ఎకరాలకే సాగు నీరందుతున్నది. కానీ ఈసారి పూడిక మట్టి తొలిగింపు, షట్టర్ల నిర్మాణంతో మరింత ఆయకట్టుకు అదనంగా నీరందుతుంది. రెండో ప్యాకేజీలో కాల్వల లైనింగ్, బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉన్నది. ఈ మరమ్మతు పనులు పూర్తి చేస్తే, ఆయకట్టులోని 55వేల ఎకరాలకు నీటిని అందించే అవకాశముంది. దీంతో ప్యాకేజీ- 2లోని పెండింగ్ పనులపై సర్కారు దృష్టి పెట్టింది. ఆగస్టు 15 నాటికి స్ట్రక్చర్ల నిర్మాణాలు పూర్తి చేయడంతోపాటు లైనింగ్‌ను పూర్తి చేసేందుకు అధికారులు కర్ణాటక ఇరిగేషన్ అధికారులపై, సంబంధిత కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నారు.


పనులకే ప్రాముఖ్యత

జిల్లాలోని అయిజ, రాజోళి, మానవపాడు, వడ్డేపల్లి, ఆలంపూర్ ప్రాంతాల రైతులు ఆర్డీఎస్‌పై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. కానీ ఒక్క సంవత్సరం కూడా పూర్తిస్థాయిలో నీరందలేదు. దీంతో ఆయకట్టు దిగువన సాగుభూములన్నీ బీడు వారాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఈ పనులను పూర్తి చేసేందుకు కంకణం కట్టుకున్నది. రాజోళి బండ డైవర్షన్ స్కీంపై పూర్తి అవగాహనతో ఉన్న సీఎం కేసీఆర్ ఇక్కడ ఆధునీకరణ పనులపై దృష్టిపెట్టారు. ముందుగా పూడికతీత చేపట్టాలని ఇరిగేషన్ ఇంజినీర్లకు ఆదేశాలిచ్చారు. సిల్ట్ తొలిగింపుతో కొంతమేరకు నీటిని ఆర్డీఎస్ కెనాళ్లకు మళ్లించవచ్చంటూ సూచించారు. అదే విధంగా ఆర్డీఎస్ దగ్గర ఆనకట్ట ఎత్తు 6 ఇంచులు పెంచితే, మరో 150 క్యూసెక్కుల నీటి సామర్థ్యం పెరుగుతుందని ఇంజినీర్ల పరిశీలనలో వెల్లడించారు. ఆనకట్టను పటిష్టం చేసి, ఎత్తు 6 ఇంచులు పెంచి, దిగువన ఆనకట్ట దెబ్బతినకుండా బకెట్ మరమ్మతు చేయాలని సూచించారు. 2009లో వచ్చిన వరదలతో ఆనకట్ట దిగువన ఉండే బకెట్లు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతు చేయకుంటే ఆనకట్టకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉన్నది. వీటితో పాటు పిల్ల కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు సైతం దెబ్బతిన్నాయి. దీంతో వచ్చే కొద్దిపాటి నీరు కాల్వల్లో నుంచి వృథాగా పోతున్నది. ఈ పనులన్నీ ప్యాకేజీ-2లో చేపట్టేందుకు అధికారులు గతంలోనే ప్రతిపాదించారు. ప్రస్తుతం ప్యాకేజీ-2లో బ్రిడ్జీల మరమ్మతు జరుగుతున్నది. ఈ సీజన్‌లో నీరు విడుదల చేసే సమయానికి బ్రిడ్జీలు, కాల్వల మరమ్మతులను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.

సుగ్లాంపల్లిలో గంజాయి పట్టివేత

సుల్తానాబాద్ రూరల్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లి సబ్‌స్టేషన్ సమీపంలోని రహదారిపై శనివారం గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 2కిలోల 760 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన సర్వం రాము, రాజారామ్ చౌదరి, పంచులాల్ మొండే బతుకు దెరువు కోసం పెద్దపల్లికి వచ్చి, వేర్వేరు షాపుల్లో పని చేస్తున్నారు. అయితే వీరికి వచ్చే జీతం సరిపోకపోవడంతో పంచులాల్ మొండే వారికి గంజాయి అమ్మితే డబ్బులు బాగా వస్తాయని ఆశ చూపించాడు. దీంతో మిగతా ఇద్దరూ గంజాయి విక్రయించేందుకు ఆసక్తి చూపారు. ఈ క్రమంలో వీరు రాజస్థాన్ నుంచి 2కిలోల760గ్రాముల గంజాయిని తీసుకొని, రైలులో వచ్చి, పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో దిగారు. పక్కా సమాచారం మేరకు సుల్తానాబాద్ పోలీసులు సుగ్లాంపల్లి రహదారి వద్ద తనిఖీలు నిర్వహించగా, ఈ ముగ్గురు వ్యక్తులు బ్యాగుతో అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

నానమ్మను తిట్టాడని తాతను చంపేశాడు



రాజయ్య మృతదేహం

మేడిపల్లి: జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని పోరుమల్ల అనుబంధ గ్రామమైన గుండ్లపల్లిలో ఓ తాతను మనుమడు గొంతు నులిమి చంపాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొంక పెద్ద రాజయ్య అలియాస్ కొంక పెద్ద నర్సయ్య (65) ప్రతి రోజూ కల్లు తాగి వచ్చి భార్య కొంక లస్మవ్వను తిడుతుండేవాడు. శుక్రవారం రాత్రి కొంక పెద్ద రాజయ్య మద్యం తాగి వచ్చి లస్మవ్వను తిడుతుండగా మనుమడు కొంక శేఖర్ ఎందుకు తిడుతున్నావంటూ ఘర్షణకు దిగాడు. వారి మధ్య మాటామాటా పెరుగడంతో కోపోద్రిక్తుడైన శేఖర్ రాత్రి పెద్ద రాజయ్య గొంతు నులిమి చంపాడు. శనివారం ఉదయం సంఘటనా స్థలానికి మెట్‌పల్లి సీఐ సురేందర్, కోరుట్ల ఎస్సై కృష్ణకుమార్ చేరుకొని విచారణ చేశారు. మృతుడి కుమార్తె పంబాల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సురేందర్ తెలిపారు.

ఆఖిరాట ఆడేశాడు


డాఫ్నె షిప్పర్స్

లండన్: జమైకా చిరుత ఉసేన్ బోల్ట్ ఫైనల్ కౌంట్‌డౌన్ అయిపోయింది. కెరీర్‌లో ఇదే తనకు చివరి ఈవెంట్ అని ప్రకటించిన బోల్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆఖరి రేసు ఆడేశాడు. మీరు పొద్దున లేచి చూసేసరికి బోల్ట్ పోటీపడిన 4.100 మీటర్ల రేసు ఫలితం కూడా వచ్చేసుంటుంది. ఈ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఇప్పటికే తానాడిన 100 మీటర్ల వ్యక్తిగత రేసులో స్వర్ణం చేజార్చుకొని కాంస్యానికి పరిమితమైన బోల్ట్.. రిలే ఈవెంట్‌లో మాత్రం నిరాశపరుచను అని రేసుకు ముందురోజు చెప్పాడు. అనుకున్నట్లుగానే, బోల్ట్ సారథ్యంలోని జమైకా జట్టు పురుషుల 4X100 మీటర్ల రిలేలో హీట్స్‌ను విజయవంతంగా అధిగమించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. రెండో హీట్స్ నుంచి పోటీపడ్డ టైక్వాండో ట్రేసీ, జులియన్ ఫోర్టె, మైకెల్ క్యాంప్‌బెల్, బోల్ట్‌లతో కూడిన జమైకా బృందం 37.95 సెకన్లలో రేసు ముగించి ఈ సీజన్‌లో తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదుచేసింది. బోల్ట్ జట్టుకు గట్టి పోటీదారుగా భావించిన జస్టిన్ గాట్లిన్, మైక్ రోడ్జెర్స్, బీ జే లీ, క్రిస్టియన్ కోల్‌మన్‌లతో కూడిన అమెరికా బృందం రికార్డు టైమింగ్‌తో ఫైనల్‌కు దూసుకెళ్లింది. అమెరికా జట్టు ఈ సీజన్‌లోనే అత్యుత్తమ టైమింగ్‌ను నమోదుచేస్తూ 37.70 సెకన్లలో రేసును ముగించి తన హీట్స్‌లో టాప్‌లో నిలిచింది. బ్రిటన్ జట్టు 37.76 సెకన్లతో రెండో అత్యుత్తమ టైమింగ్ ప్రదర్శన చేయగా, బోల్ట్ బృందం మూడో అత్యుత్తమ టైమింగ్, ఫ్రాన్స్ బృందం (38.03 సెకన్లు) నాలుగో అత్యుత్తమ టైమింగ్‌తో ఫైనల్ చేరాయి.

భారత రిలే జట్లకు నిరాశ:
భారత్‌కు చెందిన పురుషులు, మహిళల రిలే జట్లు 4X400 మీటర్లలో ఫైనల్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించాయి.

షిప్పర్స్‌దే 200 మీటర్ల కిరీటం

మహిళల 200 మీటర్ల రేసులో నెదర్లాండ్స్ స్టార్ అథ్లెట్ డాఫ్నె షిప్పర్స్ టైటిల్ నిలబెట్టుకుంది. 25ఏండ్ల షిప్పర్స్ ఫైనల్ రేసును 22.05 సెకన్లలో ముగించి మొదటిస్థానంలో నిలిచి వరుసగా రెండోసారి స్వర్ణం ఎగురేసుకుపోయింది. షిప్పర్స్ కంటే సెకనులో 300వంతు తేడాతో వెనుకబడిన ఐవరీకోస్ట్ అమ్మాయి మేరీ జోస్ రజతంతో సరిపెట్టుకుంది. బహమాస్‌కు చెందిన షానె మిల్లర్ కాంస్యం అందుకుంది.


4X100 మీటర్ల రిలేలో పరుగెడుతున్న బోల్ట్

ఖేల్

“గతంలో నేను చాలా రక్షణాత్మకంగా ఆడేవాడిని. అందుకే అనుభవం ఉన్నా టెస్టుల్లో విఫలమయ్యా. కానీ ఇప్పుడు నా దృక్పథం మారింది. నా సహజ సిద్ధమైన ఆటను మొదలుపెట్టా. ఈ చిట్కా బాగా పని చేస్తున్నది. వికెట్ కాస్త నెమ్మదిగా ఉంది. అనుకున్నంత బౌన్స్ రావడం లేదు. నేను దూకుడుగా ఆడతానని అందరికీ తెలుసు. అందుకే అంతే దూకుడుగా వికెట్ సమర్పించుకున్నా. స్లిప్‌లో క్యాచ్ ఇస్తే డిఫెన్సివ్ స్టైల్. ఇది నేను ఆడే విధానానికి విరుద్ధం. స్క్వేర్‌లెగ్‌లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యా. చివరి రెండు సెషన్లలో ఆరు వికెట్లు పడటం ఇదే తొలిసారి. ఔట్ ఫీల్డ్ వేగంగా లేదు. కాబట్టి పరుగులు చేయడం అంత సులభం కాదు. అయినా కూడా మేం మంచి స్థితిలోనే ఉన్నాం. లోయర్ ఆర్డర్‌లో కూడా పరుగులు చేసే బ్యాట్స్‌మెన్ ఉన్నారు.

- శిఖర్ ధవన్

షూటింగ్‌లో భారత్‌కు కాంస్యం

అస్తానా: ఆసియా షాట్‌గన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మరో పతకం దక్కింది. శనివారం జరిగిన పోటీల్లో పురుషుల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో భారత జోడీ కాంస్య పతకం సాధించింది. షీరాజ్, మైరాజ్ అహ్మద్ ఖాన్, అంగద్ వీర్‌సింగ్‌లతో కూడిన భారత త్రయం ఫైనల్స్‌లో 375 పాయింట్లకు 347 స్కోరు చేసి మూడోస్థానంతో కాంస్యం అందుకుంది.

ఒలింపిక్స్‌లో మెరుగైన ప్రదర్శనకు మూడు ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: రాబోయే మూడు ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్ల ప్రదర్శన మెరుగుపర్చేందుకు ఎనిమిది మంది సభ్యులతో కూడిన ఒలింపిక్ టాస్క్ ఫోర్స్ కమిటీ ఓ నివేదికను రూపొందించింది. ఇందులో మూడు కీలక ప్రతిపాదనలు చేసింది. జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, హాకీ మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హాతో కూడిన బృందం రూపొందించిన ఈ నివేదికను శనివారం క్రీడాకార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్‌కు అందజేసింది. ‘అథ్లెట్లను కేంద్రంగా చేసుకోవడం, కోచ్ నాయకత్వంలో నడువడం, వ్యవస్థలను మెరుగుపర్చడం’ వంటి అంశాలపై దృష్టిసారించాలని కోరారు. క్రీడా పరిపాలన, స్పోర్ట్స్ సైన్స్, క్రీడల సంస్కృతిని మరింతగా అభివృద్ధి చేయాలని సూచించారు.

భారత్ నుంచి ‘ఆసియా కప్’ తరలింపు

న్యూఢిల్లీ: ఓవైపు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అభ్యంతరాలు.. మరోవైపు భారత ప్రభుత్వం పాకిస్థాన్ జట్టుకు వీసాల మంజూరు విషయంలో నిర్ణయం ప్రకటించకపోవడంతో అండర్ -19 ఆసియా క్రికెట్ కప్ టోర్నీ భారత్ నుంచి తరలిపోయింది. సీమాంతర ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న కారణంగా పాకిస్థాన్‌తో అన్ని రకాలు సంబంధాలను తెంపుకున్న భారత్ .. క్రీడలకూ వారిని అనుమతించడం లేదన్న విషయం తెలిసిందే. దీంతో పీసీబీ బెంగళూరులో జరి గే అండర్-19 ఆసియాకప్ టోర్నీ వేదిక మార్చకపోతే ఈ టోర్నీని బహిష్కరిస్తామని చెప్పింది. శనివారం జరిగిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు పీసీబీ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఈ వేదికను మలేసియాలోని కౌలాలంపూర్‌కు మార్చారు.


ధవన్ (119)

నిలబడి.. తడబడి!

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 329/6

ధవన్ వీరోచిత సెంచరీ ■ ఆకట్టుకున్న రాహుల్

ఓ దశలో భారత్ స్కోరు 39.2 ఓవర్లలో 188/0. కానీ..
ఆట ముగిసేసరికి 329/6.. అంటే కేవలం 50.4 ఓవర్లలో
141 పరుగులకు కీలకమైన 6 వికెట్లు చేజార్చుకున్న టీమ్‌ఇండియా
మూడో టెస్టులో భారీస్కోరు చేసే అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకుంది.
ఆరంభంలో ఓపెనర్ల శుభారంభంతో పట్టుబిగించినట్లే కనిపించిన విరాట్‌సేన..
మిడిలార్డర్ వైఫల్యంతో శ్రీలంకకు పుంజుకునే అవకాశం ఇచ్చింది.
ఓ అరుదైన రికార్డుకు అడుగు దూరంలో ఉన్న భారత్..
రెండోరోజు ఎంత స్కోరు చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది!


రాహుల్ (85)

పల్లెకెలె:

సొంతగడ్డపై శ్రీలంక బౌలర్లు తొలిసారి ఆకట్టుకున్నారు. భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్‌ను కీలక సమయంలో వికెట్లు తీసి నియంత్రించారు. ఓపెనర్లు శిఖర్ ధవన్ (123 బంతుల్లో 119; 17 ఫోర్లు), లోకేశ్ రాహుల్ (135 బంతుల్లో 85; 8 ఫోర్లు) భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పినా.. చివరి రెండు సెషన్లలో బ్యాట్స్‌మెన్ నిరాశజనక ప్రదర్శనతో తొలిరోజు ఆట ముగిసేసరికి టీమ్‌ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 6 వికెట్లకు 329 పరుగులు చేసింది. సాహా (13 బ్యాటింగ్), హార్దిక్ పాండ్యా (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. పుష్పకుమార 3, సందకాన్ 2 వికెట్లు పడగొట్టారు. సస్పెండ్ అయిన జడేజా స్థానంలో కుల్దీప్ యాదవ్‌కు భారత్ అవకాశం ఇవ్వగా..ఆతిథ్య జట్టు మూడు మార్పులతో బరిలోకి దిగింది.

ఓపెనర్ల శుభారంభం..
టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు ధవన్, రాహుల్ మరోసారి అద్భుతమైన శుభారంభాన్నిచ్చారు. పిచ్‌పై పచ్చిక ఉన్నా, నాణ్యమైన బౌన్స్ కనిపించినా.. లంక స్వింగ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. వీలైనప్పుడల్లా బంతిని బౌండరీకి తరలిస్తూ వేగంగా పరుగులు సాధించారు. ఫలితంగా 55 బంతుల్లో 50 పరుగులు, 18 ఓవర్లు ముగిసేసరికి 100 పరుగులు టీమ్‌ఇండియా ఖాతాలోకి చేరాయి. క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని విడదీసేందుకు చండిమల్.. రెండు ఎండ్‌ల నుంచి స్పిన్ అస్త్రాన్ని ప్రయోగించాడు. ఓవైపు పెరీరా, మరోవైపు సందకాన్ బంతిని టర్న్ చేసే ప్రయత్నం చేసినా.. ధవన్-రాహుల్ మంచి ఫుట్ వర్క్‌తో పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో ధవన్ 45, రాహుల్ 67 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేశారు. రాహుల్‌కు ఇది వరుసగా ఏడో ఫిఫ్టీ కావడం విశేషం. ఈ సందర్భంగా గుండప్ప విశ్వనాథ్, ద్రవిడ్‌ల రికార్డు (6 హాఫ్ శతకాలు)ను అతను అధిగమించాడు. ఓవరాల్‌గా లంచ్ వరకు భారత్ 27 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 134 పరుగులు చేసింది.

‘మూడే’శారు..
లంచ్ తర్వాత లంక బౌలర్లు బాగా పుంజుకున్నారు. చకచకా మూడు వికెట్లు తీసి భారత్‌ను కట్టడి చేశారు. అప్పటి వరకు నిలకడగా ఆడిన ధవన్-రాహుల్ ఒక్కసారిగా జోరు పెంచే ప్రయత్నంలో వికెట్లను సమర్పించుకున్నారు. ఇన్నింగ్స్ 40వ ఓవర్‌లో పుష్పకుమార బంతికి భారీ షాట్ కొట్టే ప్రయత్నంలో రాహుల్.. మిడాఫ్‌లో కరుణరత్నే చేతికి చిక్కాడు. దీంతో తొలి వికెట్‌కు 188 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇప్పటివరకు విదేశీ టెస్టుల్లో అత్యధిక భాగస్వామ్యం (173) రికార్డును ధవన్-రాహుల్ సవరించారు. 1993లో ప్రభాకర్-సిద్ధూ ఈ రికార్డును నెలకొల్పారు. చతేశ్వర్ పుజార (8)తో జతకలిసిన ధవన్.. 107 బంతుల్లో ఈ సిరీస్‌లో రెండో శతకాన్ని సాధించాడు. అతని కెరీర్‌లో ఇది ఆరో టెస్టు శతకం. రెండో వికెట్‌కు 31 పరుగులు జత చేశాక ధవన్ ఇచ్చిన క్యాచ్‌ను స్క్వేర్ లెగ్‌లో చండిమల్ నేర్పుగా అందుకున్నాడు. ఆరంభం నుంచి క్రీజులో ఇబ్బందిగా కదిలిన పుజార.. ఇన్నింగ్స్ 51వ ఓవర్‌లో వెనుదిరిగాడు. దీంతో కోహ్లీ (42), రహానే (17).. 235/3 స్కోరుతో టీ విరామానికి వెళ్లారు.

విరాట్ విఫలం..
రెండో సెషన్‌లో మూడు వికెట్లు పడటంతో భారత్‌పై ఒత్తిడి నెలకొంది. క్రీజులో ఉన్న విరాట్, రహానేలతో ఇది స్పష్టంగా కనిపించింది. లంక స్పిన్నర్లను ఎదుర్కోవడంలో ఈ ఇద్దరు తడబడటంతో సింగిల్స్ కూడా రాలేదు. చివరకు ఒత్తిడిని అధిగమించలేకపోయిన రహానే.. ఓ చెత్త బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఈ ఇద్దరి మధ్య నాలుగో వికెట్‌కు 35 పరుగులు సమకూరాయి. ఇక అశ్విన్ (31), కోహ్లీ ఎదురుదాడికి దిగినా.. లంకేయులు పట్టువదలకుండా పోరాడారు. ఇన్నింగ్స్ 79వ ఓవర్‌లో విరాట్‌ను ఔట్ చేసి మ్యాచ్‌ను ఆధీనంలోకి తెచ్చుకున్నారు. సాహా, అశ్విన్ చెరోసారి డీఆర్ఎస్ నుంచి బయటపడ్డారు. మరో రెండు ఓవర్లలో తొలి రోజు ముగుస్తుందనగా అశ్విన్ అనవసరంగా వికెట్ సమర్పించుకున్నాడు. ఈ సెషన్‌లోనూ 3 వికెట్లు తీసిన లంక.. భారత్‌ను నియంత్రించడంలో బాగా సఫలమైంది.

1 ఒక టెస్టు సిరీస్‌లో రెండు సెంచరీలు చేయడం ధవన్‌కు ఇదే మొదటిసారి. ఇప్పటి వరకు ఆరు శతకాలు చేసిన శిఖర్.. ఐదు విదేశాల్లోనే సాధించడం విశేషం.

గత నాలుగేండ్లలో లంక గడ్డపై తొలి వికెట్‌కు అత్యధిక పరుగుల(188) భాగస్వామ్యాన్ని నెలకొల్పిన తొలి జంట ధవన్-రాహుల్. బంగ్లా జోడి తమీమ్-సౌమ్య సర్కార్ 118 పరుగులతో రెండో స్థానంలో ఉన్నది.

3 సెహ్వాగ్ తర్వాత లంకపై మూడు శతకాలు చేసిన రెండో భారత ఓపెనర్ ధవన్.

6 ఈ మ్యాచ్‌లో భారత్ 17.4 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసింది. 2001 నుంచి ఇప్పటి వరకు వేగవంతంగా వంద పరుగులు చేయడం ఇది ఆరోసారి.

7 ఈ సీజన్‌లో రాహుల్‌కు ఇది వరుసగా ఏడో అర్ధసెంచరీ. ఈ ఫీట్‌ను సాధించిన ఆరో ఆటగాడు రాహుల్. ఎవర్టన్ వీకిస్, ఆండీ ఫ్లవర్, చందర్‌పాల్, సంగక్కర, రోజర్స్ ఈ జాబితాలో ముందున్నారు.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: ధవన్ (సి) చండిమల్ (బి) పుష్పకుమార 119, రాహుల్ (సి) కరుణరత్నే (బి) పుష్పకుమార 85, పుజార (సి) మాథ్యూస్ (బి) సందాకన్ 8, కోహ్లీ (సి) కరుణరత్నే (బి) సందాకన్ 42, రహానే (బి) పుష్పకుమార 17, అశ్విన్ (సి) డిక్‌వెల్లా (బి) ఫెర్నాండో 31, సాహా (బ్యాటింగ్) 13, హార్దిక్ (బ్యాటింగ్) 1,
ఎక్స్‌ట్రాలు: 13, **మొత్తం:** 90 ఓవర్లలో 329/6.
వికెట్లపతనం: 1-188, 2-219, 3-229, 4-264, 5-296, 6-322.
బౌలింగ్: ఫెర్నాండో 19-2-68-1, కుమార 15-1-67-0, కరుణరత్నే 5-0-23-0, పెరీరా 8-1-36-0, సందకాన్ 25-2-84-2, పుష్పకుమార 18-2-40-3.

గంటలో లక్షా 23 వేల కిక్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఖేల్ ప్రత్యేక ప్రతినిధి: తైక్వాండో క్రీడలో భాగ్యనగరానికి మరో గిన్నిస్ రికార్డు లభించనుంది. శనివారం 49 మంది సభ్యుల బృందం ఒక గంటలో లక్షా 23 వేల 79 కిక్స్ నమోదు చేసి కొత్త రికార్డును నెలకొల్పినట్లు తెలంగాణ తైక్వాండో బోర్డు కార్యదర్శి బొబ్బిలి తెలిపారు. గతంలో 49 మంది సభ్యులు కలిసి గంటలో 58000 కిక్స్‌తో గిన్నిస్ రికార్డు నెలకొల్పగా.. నగరంలోని బోడుప్పల్ పల్లవి మోడల్ స్కూల్‌లో జరిగిన ఈవెంట్‌లో మన బృందం ఈ రికార్డును సవరించినట్లు ఆయన తెలిపారు. ఈ రికార్డుకు సంబంధించిన అన్ని రకాల ఆధారాలను గిన్నిస్ బుక్ అధికారులకు పంపామని..త్వరలోనే అధికారిక గుర్తింపు రానున్నట్లు చెప్పారు.



ఆర్‌సీఏకు లలిత్ మోది గుడ్‌బై



క్రికెట్ పరిపాలనకు పూర్తిగా దూరం

న్యూఢిల్లీ: రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ (ఆర్‌సీఏ)లో ఐపీఎల్ మాజీ కమిషనర్ లలిత్ మోడి శకానికి తెరపడింది. నాగౌర్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి అతను శనివారం రాజీనామా చేశాడు. దీంతో పాటు క్రికెట్ పరిపాలనకు పూర్తిగా గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు. ఈ మేరకు బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రీకి లేఖ పంపాడు. రాబోయే తరాలకు అవకాశమివ్వాలనే ఉద్దేశంతోనే తను రాజీనామా చేసినట్లు మోది వెల్లడించాడు. ‘అసోసియేషన్‌లో కొత్త వారికి అవకాశం ఇవ్వాలని భావించా. క్రికెట్ పరిపాలనకు పూర్తి దూరంగా ఉండాలనుకున్నా. అందుకే అధ్యక్ష పదవికి రాజీనామా చేశా. వ్యక్తుల కంటే వ్యవస్థ గొప్పది. భారత క్రికెట్టే దీనికి నిజమైన ఉదాహరణ. మన క్రికెట్ అంటే నాకు ప్రాణం. నేను ఎల్లప్పుడూ దీనికి అభిమానిగా ఉంటాను’ అని మోది రాజీనామా లేఖలో పేర్కొన్నాడు. ఐపీఎల్‌లో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన మోదిపై బీసీసీఐ నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఇకనుంచైనా ఆర్‌సీఏకు కేటాయించిన నిధులను బీసీసీఐ విడుదల చేయాలని మోది విజ్ఞప్తి చేశాడు.

శ్రీనివాసన్‌ను అడ్డుకోరా?: మోడి పోతుపోతూ బీసీసీఐపై మరోసారి తన అక్కసును వెళ్లగక్కాడు. బోర్డు నుంచి తనను వెలి వేసిన అధికారులు.. శ్రీనివాసన్‌ను మాత్రం ఎందుకు అడ్డుకోవడం లేదని ఆరోపించాడు. ఈ విషయంలో బీసీసీఐ ద్వంద్వనీతిని చూపెడుతుందని విమర్శించాడు. భారత క్రికెట్‌లో శ్రీని ప్రమేయం ఉండొద్దని సుప్రీంకోర్టు చెప్పినా.. బీసీసీఐ చెవికి ఎక్కడం లేదని ధ్వజమెత్తారు.

ప్రపంచ రెజ్లింగ్‌కు భజరంగ్

పారిస్: ఆసియా చాంపియన్ భజరంగ్ పూనియా ఈనెల 21నుంచి పారిస్ (ఫ్రాన్స్) వేదికగా జరిగే ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఫ్రీస్టయిల్ కేటగిరీ 65కిలోల విభాగంలో భజరంగ్ పోటీపడనున్నాడు. శనివారం ఇక్కడ ప్రత్యేకంగా జరిగిన సెలెక్షన్ ట్రయల్స్‌లో రాహుల్‌ను 10-0తో ఓడించి భజరంగ్ జట్టుకు ఎంపికయ్యాడు. గతనెల సోనేపట్‌లో జరిగిన 65కిలోల సెలెక్షన్స్‌లో రాహుల్ విజేతగా నిలిచి ఫైనల్ ట్రయల్స్‌కు ఎంపికయ్యాడు. అయితే, ఆ తర్వాత వైరల్ ఫీవర్ కారణంగా భజరంగ్ ఫైనల్ ట్రయల్స్‌కు హాజరుకాలేకపోయాడు. దీంతో తాను కోలుకున్న తర్వాత ఫైనల్ ట్రయల్స్ నిర్వహించాల్సిందిగా భజరంగ్ అప్పట్లోనే రెజ్లింగ్ సమాఖ్యకు దరఖాస్తు చేసుకున్నాడు. తాజాగా నిర్వహించిన ఫైనల్ ట్రయల్స్‌లో రాహుల్‌పై గెలిచి భజరంగ్ ప్రపంచ బెర్త్ ఖరారు చేసుకున్నాడు.

బాబాకు మరో పతకం



నిజామాబాద్ స్పోర్ట్స్, నమస్తే తెలంగాణ: అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో జరుగుతున్న ప్రపంచ పోలీసు క్రీడల్లో మన రాష్ట్ర అథ్లెట్ మహ్మద్ బాబా మరో పతకం సాధించాడు. శుక్రవారం 400 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్యం నెగ్గిన బాబా.. శనివారం జరిగిన 110 మీటర్ల హర్డిల్స్‌లో రజత పతకంతో మెరిశాడు. భారత పోలీసు బృందం తరపున పోటీపడ్డ బాబా తన ఈవెంట్‌లో రెండోస్థానంలో నిలిచి సత్తాచాటాడు. నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డికి చెందిన బాబా కామారెడ్డి జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

టైటాన్స్‌కు మరో ఓటమి

బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ ఖాతాలో మరో ఓటమి. శనివారం జరిగిన మ్యాచ్‌లో యూపీ యోధా జట్టు 39-32తో టైటాన్స్‌పై గెలిచింది. టైటాన్స్ కెప్టెన్ రాహుల్ చౌదరి 12 పాయింట్లు సాధించినా, సహచరులు విఫలమవడంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. మరోమ్యాచ్‌లో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ జట్టు 29-25తో దబాంగ్ ఢిల్లీని ఓడించింది.

ఆనంద్‌కు రెండోస్థానం

సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ సింక్వెఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌ను రెండోస్థానంతో ముగించాడు. శనివారం వెస్లీ సో(అమెరికా)తో జరిగిన చివరిదైన 8వ రౌండ్‌ను ఆనంద్ డ్రాగా ముగించాడు. దీంతో టోర్నీలో మొత్తంగా 9పాయింట్లకు 5.5 పాయింట్లు స్కోరు చేసిన ఆనంద్ సంయుక్తంగా రెండోస్థానంలో నిలిచాడు. మాగ్జిమ్ వాషెర్ లాగ్రావె (ఫ్రాన్స్) 6పాయింట్లతో చాంపియన్‌గా నిలిచాడు.

యువీకి చోటు దక్కేనా!

న్యూఢిల్లీ: శ్రీలంకతో పరిమిత ఓవర్ల సిరీస్‌కు భారత జట్టు ఎంపికపై సందిగ్ధత కొనసాగుతున్నది. ఎవరికి విశ్రాంతి ఇవ్వాలి, ఎవర్ని జట్టులోకి తీసుకోవాలన్న దానిపై సెలెక్టర్లు ఎటూ తేల్చులేకపోతున్నారు. డాషింగ్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ఆఖరి అవకాశం కోసం ఎదురుచూస్తుండగా, కర్ణాటక బ్యాట్స్‌మన్ మనీష్ పాండే ఈ సిరీస్‌పై భారీ ఆశలు పెట్టుకున్నాడు. కెప్టెన్ కోహ్లీ, రహానే విశ్రాంతి అవసరం లేదని ఇప్పటికే స్పష్టం చేయడంతో బ్యాటింగ్‌లో ఎవరికి అవకాశం కల్పిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ధవన్, రాహుల్ మంచి ఫామ్‌లో ఉండటంతో నేరుగా వీరికి అవకాశం ఇస్తారా? అప్పుడు రోహిత్ పరిస్థితి ఏంటి? విండీస్‌లో రహానే, దినేశ్ కార్తీక్ బాగా ఆకట్టుకున్నారు. మరి ఈ ఇద్దర్ని కొనసాగిస్తారా? కెరీర్‌లో చివరి అంకంలో ఉన్న యువరాజ్, ధోనీని ఏం చేస్తారు? సెలెక్టర్ల నిర్ణయం ఎలా ఉండబోతుందో ఆదివారం స్పష్టంకానుంది.



నేపాల్‌లోని బిరాట్‌నగర్ విమానాశ్రయంలో వరదనీరు

వరద బీభత్సం

త్రిపురలో నిరాశ్రయులయిన 4500 కుటుంబాలు

అగర్తలా, ఆగస్టు 12: భారత్‌లోని త్రిపురతోపాటు నేపాల్, చైనాలో శనివారం వరదలు బీభత్సం సృష్టించాయి. త్రిపురలోని మూడుజిల్లాల్లో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమయింది. వర్షాల వల్ల ఆకస్మిక వరదలు రావడంతో దాదాపు 4500 కుటుంబాలు నిరాశ్రయులైనట్లు అధికారవర్గాలు తెలిపాయి. రెండువేలకు పైగా కుటుంబాలకు రాష్ట్ర రాజధానిలోని వివిధ ప్రభుత్వ భవనాల్లో ఆశ్రయం కల్పించారు. పశ్చిమ త్రిపుర కలెక్టర్ మిలింద్ రామ్‌తెకేతో కలిసి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి బాదల్ చౌదరి ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. హౌరానది వంతెన వద్ద శుక్రవారం ఏర్పడ్డ లీకేజీలను వెంటనే మరమ్మత్తు చేయించినట్టు మంత్రి చెప్పారు. హౌరా నదిలో ప్రమాదకరస్థాయికి మించి నీరు ప్రవహిస్తున్నదని తెలిపారు. ఖోవాయి జిల్లాలోని చాలాప్రాంతాలు నీట మునిగాయని బాదల్ చౌదరి పేర్కొన్నారు.

అస్సాంలో వరద పరిస్థితులు తగ్గుముఖం

అస్సాంలో వరద పరిస్థితులు తగ్గుముఖం పట్టినట్టు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఏఎస్డీఎమ్ఏ) శనివారం ఒక నివేదికలో తెలిపింది. '19జిల్లాల్లోని సుమారు 11 లక్షల ప్రజలు వరదల వల్ల ప్రభావితమయ్యారు. ఈ ఏడాది వరదల వల్ల జరిగిన ప్రమాదాల్లో 89మంది మృతి చెందారు. ప్రస్తుతం 1752 గ్రామాలు వరద నీటిలోనే ఉన్నాయి. లక్ష ఎకరాల పంట నష్టం సంభవించింది. వరదల వల్ల పలు జిల్లాల్లో రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు సుమారు 2,600మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి' అని ఏఎస్డీఎమ్ఏ తన నివేదికలో వివరించింది.

నేపాల్‌లో 36 మంది మృతి

నేపాల్‌లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. పలు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు కొండచరియలు విరిగిపడటంతో సుమారు 36 మంది మృత్యువాతపడ్డట్టు శనివారం అధికారులు తెలిపారు. వందలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయని చెప్పారు. నీరు చేరడంతో బిరాట్‌నగర్ విమానాశ్రయాన్ని మూసివేశారు.

భారీ వర్షాలతో చైనా అతలాకుతలం

బీజింగ్: భారీ వర్షాలతో చైనా అతలాకుతలం అవుతున్నది. శనివారం వందలాది విమానాలను రద్దు చేసినట్లుగా అధికారులు ప్రకటించారు. భూకంపం వచ్చి వారం రోజుల గడువ కముందే అదే ప్రాంతంలో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. షాంఘై, జియాంగ్సు ప్రావిన్సులోని నాన్‌జింగ్, జెజియాంగ్‌లోని హాంగ్జూ, యాంగ్జూ నది డెల్టా ప్రాంతాలు వరదలవల్ల ప్రభావితం అయ్యాయి. భారీ వర్షాల కారణంగా మధ్య చైనాకు చెందిన హునన్ ప్రావిన్స్‌లోని యాయాంగ్ కౌంటీ గ్రామంలోని జలాశయం గోడ కూలిపోవడంతో భారీ వరద గ్రామాలను ముంచెత్తుతున్నది. దీంతో వందలాది ఇండ్లు వరదల్లో కొట్టుకుపోయాయి.

రెండోసారి కెన్యా అధ్యక్షుడిగా కెన్యట్టా ఎన్నిక

నైరోబీ: కెన్యా అధ్యక్షుడు ఉహురు కెన్యట్టా రెండోసారి తిరిగి ఎన్నికయ్యారు. కెన్యట్టాకు 54.27 శాతం ఓట్లు వచ్చాయని, ఆయన ప్రత్యర్థి రయిలా ఒడింగాకు 44.74 శాతం ఓట్లు వచ్చాయని ఎన్నికల సంఘం చైర్మన్ వాఫులా చెబుకట్టి ప్రకటించారు. దీంతో అధ్యక్షుడు కెన్యట్టా మద్దతుదారులు సంబురాల్లో మునిగిపోయారు. కానీ ఓటమి పాలైన రయిలా ఒడింగా మాత్రం ఎన్నికలను తిరస్కరించారు. అధికార పక్షం రిగ్గింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు.

గజరాజు వేటకు హైదరాబాద్ షూటర్

16 మందిని చంపిన మదపుటేనుగు ● 16 నుంచి అలీఖాన్ 'ఎలిఫెంట్ ఆపరేషన్'



ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: జార్ఖండ్‌లోని గిరిజన ప్రాంతాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న మదపుటేనుగును అణిచేందుకు హైదరాబాద్ రెడ్‌హిల్స్ ప్రాంతానికి చెందిన ప్రముఖ షూటర్ నవాబ్ షఫాత్ అలీఖాన్‌ను రంగంలోకి దించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బుధవారం నుంచి షఫాత్ అలీ ఖాన్ 'ఎలిఫెంట్ ఆపరేషన్' ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఈ మగ ఏనుగు జార్ఖండ్‌లో 11మందిని, బీహార్‌లో ఐదుగురిని బలి తీసుకుంది. బీహార్‌లోని బొరియో, మాండ్రో, టల్జారి తదితర గిరిజన నివాసిత ప్రాంతాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నది. హుప్తా గ్రామంలో కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి యశ్వంత్‌సిన్హా ఫామ్‌హౌజ్‌పై కూడా దాడి చేసింది. ఈ ఏనుగును ట్రాంక్విలైజ్ (మత్తు ఇంజక్షన్‌ను) చేసేందుకు ప్రయత్నించిన అటవీ అధికారులు విఫలమయ్యారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడు మహావత్‌లను (ఏనుగులను ఆడించేవారిని) తీసుకొచ్చినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఏనుగును షూట్ చేసేందుకు జార్ఖండ్ అటవీశాఖ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ అనుమతించారు. ప్రత్యేక పరిస్థితుల్లో కొన్ని షరతుల మేరకు వన్యమృగాలను కాల్చి చంపడానికి ప్రభుత్వాలు అనుమతి ఇస్తుంటాయి. ఈ నేపథ్యంలో నవాబ్ షఫాత్ అలీఖాన్‌ను జార్ఖండ్ ప్రభుత్వం సంప్రదించింది. మత్తు ఇంజక్షన్‌ను గురిచూసి జంతువు శరీరంలోకి షూట్ చేయడంలో ఆయన దిట్ట. 1964లో పన్నెండేండ్ల వయసులో ఒలింపిక్స్‌లో షూటింగ్ పోటీల్లో పతకాన్ని సాధించిన అలీఖాన్.. ఆ తర్వాత అడవుల్లో ప్రమాదకర జంతువుల వేటలో నిష్ణాతుడిగా పేరు తెచ్చుకున్నారు. 2014లో ఉత్తరప్రదేశ్‌లో నరమాంసానికి అలవాటుపడ్డ పెద్దపులులను అక్కడి ప్రభుత్వం అనుమతితో మట్టుబెట్టారు. బీహార్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఆయన ఇప్పటికే ఎన్నో వైల్డ్ యానిమల్ ఆపరేషన్లను నిర్వహించి దేశంలో ఒకే ఒక్క వైల్డ్‌లైఫ్ షార్ప్ షూటర్‌గా పేరు తెచ్చుకున్నారు.

డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటించాలి

- వీ ఏ ఫౌండేషన్ సదస్సులో వక్తల పిలుపు



హైదరాబాద్‌లో వీఏ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న తమిళ నాడు మాజీ గవర్నర్ కే రోశయ్య, వేదికపై కె నర్సింహారెడ్డి, జీఆర్‌సీ రెడ్డి, ఎంఎస్ బీనా, డాక్టర్ శ్వేత తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డ్రగ్స్ భూతాన్ని అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, ఈ మహమ్మారిపై యుద్ధం ప్రకటించి తరిమేయాలని వీ ఏ ఫౌండేషన్ సంస్థ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న వక్తలు పిలుపునిచ్చారు. డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా విస్తృత స్థాయి ప్రచారం జరుగాలని, ప్రజలలో అవగాహన పెంచాలని తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య సూచించారు. 'డ్రగ్స్ సమస్య- పౌర సమాజం' అనే అంశంపై వీ ఏ ఫౌండేషన్ శనివారం హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ ప్లానిటోరియం నిర్వహించిన సదస్సులో రోశయ్యతో పాటు ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ శశికుమార్, కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్, పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి, నమస్తే తెలంగాణ పత్రిక సంపాదకుడు కట్టా శేఖర్‌రెడ్డి, గోవా ఎన్‌ఐటీ డైరెక్టర్ డాక్టర్ జీఆర్‌సీ రెడ్డి, వీఏ ఫౌండేషన్ అధ్యక్షుడు కట్టా నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోశయ్య ప్రసంగిస్తూ, చదువుకోవాల్సిన విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో 27 కాలేజీలు, 26 పాఠశాలల్లో సుమారు 1000 మంది విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటుపడ్డారన్న సమాచారం దిగ్భ్రమ కలిగిస్తున్నదన్నారు. డ్రగ్స్‌ను అడ్డుకోవటంలో ఇప్పటికే ఆలస్యం జరిగిందని చెప్పారు. మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ మత్తులో మునిగిన సమాజం నాగరిక సమాజం అనిపించుకోదన్నారు. గంజాయిసాగును చట్టబద్ధం చేసేందుకు అమెరికా వంటి దేశాలు ఇండియాపై ఒత్తిడి తెస్తున్నాయని, దీనిని ఆదిలోనే అడ్డుకోవాలని పేర్కొన్నారు. ఒత్తిడితో యువత, కష్టాలు తట్టుకోలేక పెద్దలు మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారని పాట్నా జస్టిస్ నర్సింహారెడ్డి చెప్పారు. పిల్లలు చెడిపోతే దానికి తల్లిదండ్రులే కారణమని భావించాలని, పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎప్పుడూ ఉండాలని అన్నారు. కట్టా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ వ్యవహారం ఈనాటిది కాదని, చాలా ఏండ్లుగా నడుస్తున్న తతంగమేనని చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఈ స్థితికి చేరుకున్నామని అన్నారు. సినీ ఇండస్ట్రీతోపాటు, పలు కుటుంబాలు విధ్వంసమవడానికి డ్రగ్స్ కారణమని అందరికీ తెలిసినప్పటికీ గతంలో ఎవరూ పట్టించుకోలేదని, ఈ విషయాన్ని బయటపెట్టేందుకు ప్రయత్నించిన జర్నలిస్టులపై దాడులు సైతం జరిగాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక డ్రగ్స్ నిర్మూలనకు కృషిచేయటం మంచి పరిణామమని పేర్కొన్నారు.

పంద్రాగస్టు తర్వాత

కేంద్ర క్యాబినెట్ విస్తరణ

- కొందరికి ఉద్వాసన, కొత్తవారికి చాన్స్
- సీనియర్ నేతలకు గవర్నర్ పదవులు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు పూర్తి కావడం, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు కూడా ముగిసిపోవడంతో ఇక క్యాబినెట్‌లో మార్పులు, చేర్పులపై ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా దృష్టిని కేంద్రీకరించారు. స్వాతంత్ర్య వేడుకలు ముగిసిన తర్వాత వారం, పది రోజుల్లో క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ, గవర్నర్ల నియామకం, బీజేపీలో సంస్థాగత మార్పులు ఒకటి తర్వాత మరొకటి పూర్తి చేయనున్నారు. 2019 ఎన్నికలతోపాటు త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కొత్త మంత్రులు, గవర్నర్ల నియామకం, పార్టీ పదవుల ఎంపికపై ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కేంద్రీకరించారు. గుజరాత్ నుంచి తొలిసారి రాజ్యసభకు ఎన్నికైన అమిత్ షా పార్టీ అధ్యక్షుడిగా వచ్చే లోక్‌సభ ఎన్నికలపై ప్రధానంగా దృష్టి సారిస్తారు. గుజరాత్ మాజీ సీఎం ఆనందీబెన్ పటేల్, కేంద్ర మంత్రి కల్‌రాజ్ మిశ్రాలను గవర్నర్లుగా నియమించే అవకాశం ఉన్నది. మనోహర్ పారికర్ గోవా సీఎంగా వెళ్లడం, వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నికవడం, అనిల్ మాధవ్ దవే మరణించడంతో వారు నిర్వహించిన శాఖలను ఇతర మంత్రులకు కేటాయించారు. డోక్లాంలో ఉద్రిక్తతలు నెలకొన్నా జీఎస్టీపైనే ప్రధానంగా దృష్టి సారించడంతో జైట్లీ పూర్తిస్థాయిలో రక్షణశాఖ బాధ్యతలు నిర్వహించలేకపోయారని బీజేపీ వ్యాఖ్యానించింది. దీంతో రక్షణశాఖకు పూర్తిస్థాయి మంత్రిని నియమిస్తారని తెలుస్తున్నది. ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీని అధికారంలోకి తేవడంలో కీలక పాత్ర పోషించిన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్, ఎంపీ భూపేంద్ర యాదవ్‌లకు క్యాబినెట్‌లో చోటు కల్పించడంగానీ, పార్టీలో కీలక బాధ్యతలు గానీ కేటాయించొచ్చు. హిమాచల్ ప్రదేశ్ సీఎం అభ్యర్థిగా కేంద్ర మంత్రి జేపీ నడ్డాను ఎంపికచేస్తే, ఆ శాఖను మరొకరికి కేటాయించే అవకాశముంది. దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరణ కోసం తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ వారికి క్యాబినెట్‌లో చోటు కల్పించే ఆలోచన ఉన్నట్లు సమాచారం. ఏపీలో విశాఖపట్నం ఎంపీ కంభంపాటి హరిబాబుకు సహాయ మంత్రి, అన్నాడీఎంకేలోని రెండు గ్రూపులు విలీనమైతే ఒక క్యాబినెట్, ఒక సహాయ మంత్రి పదవితోపాటు ఒడిశాలో పార్టీ బలోపేతానికి ఆ రాష్ట్ర నేతలకు మోదీ తన క్యాబినెట్‌లో చోటు కల్పిస్తారని వినికిడి. అలాగే జేడీయూకు ఒక మంత్రి పదవి ఇస్తారని వార్తలొచ్చాయి. ఇక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ స్థానే వేర్వేరు గవర్నర్లను నియమించాలన్న ఆలోచన ఉన్నా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదని వినికిడి. ప్రస్తుత ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను కశ్మీర్ వ్యవహారాలు చక్కదిద్దేందుకు ఏర్పాటు చేసే వ్యూహాత్మక కమిటీ కన్వీనర్‌గా నియమించాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తున్నది. తమిళనాడు గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావును ఆ రాష్ట్ర పూర్తిస్థాయి గవర్నర్‌గా నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

10 కోట్ల పార్కుస్థలం కబ్జాకు యత్నం!

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఫోర్జరీ డాక్యుమెంట్లతో రూ.10 కోట్ల విలువైన పార్కుస్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదుచేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 9లోని తాత్వి ఎన్‌క్లేవ్ సొసైటీకి సుమారు 900 గజాల పార్కుస్థలం ఉంది. దీన్ని పక్కాప్లాన్‌తో కబ్జా చేయాలని కొందరు స్కెచ్ వేశారు. రవీంద్రనాథ్ అనే వ్యక్తి ఆ స్థలం తనదేనంటూ కొన్ని పత్రాలు సృష్టించి, వాటి సాయంతో భవనం అనుమతుల కోసం జీహెచ్ఎంసీకి దరఖాస్తు చేసుకున్నాడు. రవీంద్రనాథ్ పార్కుస్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని సొసైటీవాసులు సీసీఎస్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీసీఎస్ డీసీపీ అవినాష్ మహంతి తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఓయూ దూరవిద్య అడ్మిషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జీ రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(పీజీఆర్ఆర్సీడీఈ)లోని అన్నికోర్సుల ప్రవేశాలు ఇకపై ఆన్‌లైన్‌లో జరుగనున్నాయి. శనివారం ఓయూ గెస్ట్‌హౌస్‌లో వీసీ శిరందాస్ రామచంద్రం, సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ చింత గణేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు ఆన్‌లైన్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. రిజిస్ట్రేషన్ నుంచి అడ్మిషన్లు, పరీక్ష ఫీజు చెల్లింపులు ఆన్‌లైన్‌లోనే కొనసాగుతాయని వీసీ తెలిపారు. అన్ని కోర్సులకు 16 నుంచి ఆన్‌లైన్‌లో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ప్రవేశ ప్రక్రియలో భాగంగా ఈ ఏడాది మాత్రం ఒకసారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం పీజీఆర్ఆర్సీడీఈ కార్యాలయానికి రావాల్సి ఉంటుందని, వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్టడీ సెంటర్లలోనే వెరిఫికేషన్ చేపడుతామని చెప్పారు. విద్యార్థులకు సందేహాలుంటే హెల్ప్ డెస్కును సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పీజీఆర్ఆర్సీడీఈ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ శివరాజ్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రావు, పీఆర్వో డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

డోక్లాంపై పరిణతి ప్రదర్శిస్తున్న భారత్


- అమెరికా రక్షణ రంగ నిపుణుడు హోల్మెస్ ప్రశంస

వాషింగ్టన్, ఆగస్టు 12: డోక్లాం వివాదంలో చైనాతో భారత్ పూర్తి పరిణతితో వ్యవహరిస్తున్నదని అమెరికా రక్షణ రంగ నిపుణుడు జేమ్స్ ఆర్ హోల్మెస్ వ్యాఖ్యానించారు. చైనా మాత్రం అనవసర దూకుడు ప్రదర్శిస్తున్నదన్నారు. అమెరికా నావికా యుద్ధ కళాశాల వ్యూహాత్మక విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జేమ్స్ ఆర్ హోల్మెస్ భారత్ వైఖరిని ప్రశంసించారు. డోక్లాం ముక్కోణ జంక్షన్‌లో చైనా సైనికులు రోడ్డు నిర్మాణం చేపట్టకుండా భారత సైన్యం అడ్డుకోవడంతో రెండు దేశాల మధ్య 50 రోజులుగా ఉద్రిక్తత నెలకొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌తో వివాదం కొనసాగాలని చైనా కోరుకుంటే అసాధారణ పరిస్థితులకు దారి తీస్తుందని హోల్మెస్ వ్యాఖ్యానించారు. ఒకవేళ భద్రతాపరమైన సముద్ర తీర వ్యూహం అమలు చేయాలని చైనా కోరుకుంటే తన భూభాగాలపై సరిహద్దులను కాపాడుకోవాలని అప్పుడు పొరుగు దేశాలు ఆక్రమించుకున్నాయని ఆరోపించే ఉండదని ఆయన స్పష్టం చేశారు.

అవయవదానంతో మరణానంతరం కూడా 'కొత్త జీవితం'

యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక 'ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్' సర్జరీలు

ఈరోజు (ఆగస్ట్ 13) జాతీయ అవయవదాన దినం (నేషనల్ ఆర్గాన్ డొనేషన్ డే). అవయవదానం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మనిచ్చే ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషనుకు ఆధారం. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి వైద్య నిపుణులు కొత్త జీవితాన్ని అందించేందుకు తోడ్పడుతున్న మానవీయ నిర్ణయం. పలు కారణాల వల్ల శరీరంలోని అవయవాలలో ఏదైనా పూర్తిగా విఫలమై పని చేయలేని స్థితికి చేరినపుడు దాని స్థానంలో దాతల నుంచి సేకరించిన ఆరోగ్యకరమైన అవయవాన్ని అమర్చటమే అవయవమార్పిడి (ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్). మూలకణాలు (స్టెమ్‌సెల్స్) మొదలుకుని మూత్రపిండాల దాకా కాలేయం, పాంక్రియాస్, గుండెవంటి శరీర అంతర్భాగంలోని ముఖ్య అవయవాలను ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు మార్చివేయగలుగుతున్నారు. అయితే ఇది జరిగి, వ్యాధిగ్రస్థులు ప్రాణాపాయం నుంచి బయటపడాలంటే వారికి అమర్చేందుకు ఆరోగ్యకరమైన అవయవం అందుబాటులోకి రావాలి. ఈ రకంగా అవయవాల దానం, వాటి మార్పిడి శస్త్రచికిత్స మనుషుల్లోని అరుదైన దాన గుణం, ఆధునిక వైద్య శాస్త్రం కలిసి అందుబాటులోకి తెచ్చిన అవకాశం. సశాస్త్రీయ అద్భుతం. ఆర్గాన్ డొనేషన్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఏమిటి? ఇది ఎన్నిరకాలు. ప్రస్తుతం ఇది ముఖ్యమైన చికిత్సా విధానాల్లో ప్రధానమైనదిగా ఎలా రూపొందుతున్నది?



అవయవ దానం- మార్పిడి సర్జరీ ఎన్ని రకాలు?

అవయవ దానం, దానిపైన ఆధారపడిన మార్పిడి ఆపరేషన్లూ రెండు రకాలు. మొదటిది, మరణించిన దాత (కెడావరిక్ డోనార్) దేహం నుంచి సేకరించిన అవయవాన్ని పొందటం. రెండో మార్గం సజీవ దాత నుంచి కాలేయం, మూత్రపిండం వంటి అవయవాలను పొందటం.

కెడావరిక్: మరణించిన దాత నుంచి గుండె, కాలేయం, మూత్రపిండం వంటి అవసరమైన అవయవాన్ని జీవన్‌దాన్ ద్వారా పొందటానికి అవకాశం ఉంటుంది. ఇందుకోసం బ్రెయిన్ డెడ్ వ్యక్తి కుటుంబం అవయవదానానికి అంగీకరించటం లేదా ఆ వ్యక్తి తన మరణానంతరం అవయవదానానికి లిఖిత పూర్వకంగా ఆమోదం తెలిపి ఉండటం అవసరం. అవయవాలు కావలసిన వారు తమ పేరు నమోదు చేసుకొంటే వారి ఆరోగ్య సమస్య తీవ్రత, అవసరం ఆధారంగా జీవన్‌దాన్ సంస్థ కెడావరిక్ అవయవ కేటాయింపును చేస్తుంటుంది.

లైవ్ డోనార్: సజీవదాత నుంచి అవయవం పొందే విధానంలో ఆరోగ్యకరమైన కాలేయం ఉన్న వ్యక్తి ఎవరి నుంచైనా కాలేయంలోని కొంత (కనీసం 25 శాతం), రెండు మూత్రపిండాలలో ఒకదానిని దానం పొందవచ్చు. ఈ రకంగా వ్యాధిగ్రస్థమై పనిచేయలేని స్థితిలో ఉన్న కిడ్నీని, కాలేయాన్ని తొలగించి దాని స్థానంలో ఆరోగ్యకరమైన మరో మూత్రపిండాన్ని, లివర్‌ను వ్యాధిగ్రస్థ వ్యక్తికి కుటుంబ సభ్యులు, రక్తసంబంధీకుల్లో ఏ వ్యక్తి అయినా మూత్రపిండాన్ని, కాలేయాన్ని దానం చేయవచ్చు.

సింగిల్ & మల్టీ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్: శరీరంలోని పనిచేయని స్థితిలో ఉన్న ఒకే అవయవాన్ని మార్చే సింగిల్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్. ఒకటి కంటే ఎక్కువ అవయవాలు పూర్తిగా పనిచేయలేని స్థితికి చేరుకున్నప్పుడు వ్యాధిగ్రస్థుడిని రక్షించేందుకు అవసరమైన సమయంలో వాటిని ఒకే సారిగాని, నిర్దిష్ట వ్యవధి - విరామంతో విడివిడిగా గానీ మార్చే మల్టీ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్. కాలేయం, కిడ్నీలు, గుండె, ఎముక మజ్జలకు తీవ్రమైన వ్యాధులు సోకి ఏ చికిత్స, సర్జరీ ద్వారా కూడా వాటిని పునరుద్ధరించటానికి అవకాశంలేని స్థితిలో అవయమార్పిడి ఆపరేషన్ ఒక్కటే పరిష్కారం. వ్యాధిగ్రస్థుల ఆరోగ్య అవసరం, అవకాశాన్ని బట్టి ఒకేసారిగాని, కొంత వ్యవధి తీసుకుని ఒక దాని తరువాత మరొకటిగాని ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేయించుకోవటానికి సిఫార్సు చేస్తున్నారు. మల్టీ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఫలితాలు ఒక్క అవయవం మార్పిడి చేసినప్పటి ఫలితాలకు తీసిపోని విధంగా ఉంటున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. అందువల్ల వ్యాధిగ్రస్థ వ్యక్తి ఆరోగ్య అవసరం దృష్ట్యా ఒకేసారి రెండు అవయవాల మార్పిడి చేయించు కోవటానికి వెనుకాడాల్సిన అవసరంలేదని స్పష్టం చేస్తున్నారు.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్స్
యశోద హాస్పిటల్స్, హైదరాబాద్
సికిందరాబాద్- సోమాజిగూడ - మలక్ పేట
ఫోన్: 81210 22333

అవయవాల కొరత వినియోగంలో సమస్యలు

మనదేశంలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషనుకు తీవ్రమైన అవయవాల కొరత కొనసాగుతుంది. అవయవ దానాల సంఖ్య చాలా తక్కువగా ఉండటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతున్నది. మనదేశంలో ప్రతీ 30 లక్షల జనభాకు కేవలం ఒక్క అవయవదానం జరుగుతుండగా అంతే జనాభాకు క్రొయేషియా దేశంలో ప్రపంచంలోనే అత్యధికంగా 119 మంది, అమెరికాలో 81 మంది అవయవదానం చేస్తున్నారు. మార్పిడికి అవసరమైన అవయవం లభించక పోవటం కారణంగా మన దేశంలో ఏటా 5 లక్షల మంది నిస్సహాయంగా చనిపోతున్నారు. మరోవైపు దేశంలో ప్రధాన నగరాలలోని ముఖ్య ఆస్పత్రులకు చెందిన అన్ని ఐ.సి.యూ.లో కలిపి ఏ రోజు చూసినా 8–10 మంది బ్రెయిన్ డెడ్ వ్యక్తులు ఉంటున్నారు. వీరి కుటుంబాలు అవయవ దానానికి అంగీకరించే పక్షంలో ప్రతీ నగరంలో రోజుకు కనీసం 72 మంది అవయవాలు అవసరమైన స్థితిలో ఉన్న వ్యక్తులకు ప్రాణదానం జరుగుతుంది.

మిగిలిపోతున్న గుండె, ఊపిరితిత్తులు:

అదే సమయంలో అవయవదానాల ద్వారా సమకూరిన అవయవాలలో కొన్నింటిని ఉపయోగించుకోవటం పట్ల తగిన చైతన్యం లేకపోవటం కూడా సమస్యగా ఉంది. దేశవ్యాప్తంగా పరిమిత సంఖ్యలోనైనాన అందుబాటులోకి వస్తున్న కెడావరిక్ అవయవాలలో గుండె, ఊపిరితిత్తులు పూర్తిగా వాడుకోలేకపోతున్నాం. ఇందుకు ప్రధానకారణం గుండె, ఊపిరితిత్తుల మార్పిడి ఆపరేషన్ల గూర్చి ప్రజలలో అవగాహన లేకపోవటం, మూత్రపిండాలు, కాలేయం మార్పిడి సర్జరీల వలెనే గుండె, ఊపిరితిత్తుల మార్పిడి ఆపరేషన్లు కూడా విజయవంతం అవుతున్నాయి. అయితే కాలేయం, కిడ్నీ మార్పిడి సర్జరీలు పెద్ద సంఖ్యలో జరగటం, ఆరోగ్యం బాగుపడిన ఆ వ్యాధిగ్రస్థులు సాపేక్షికంగా త్వరలో రోజువారీ వృత్తి ఉద్యోగ జీవితాలలో చేరుతుండటంతో వాటికి విస్తృత ప్రచారం లభిస్తోంది. తక్కువ సంఖ్యలో నిర్వహించే గుండె, ఊపిరితిత్తుల మార్పిడి ఆపరేషన్లు ఆ ప్రచార హోరులో వెనుకబడిపోతున్నాయి. అవయవం ఒక్కటయినా, ఎక్కువ అయినా ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్లు చేయటానికి సుశిక్షితులైన సర్జన్లు, ఇతర నిపుణులతోపాటు అత్యాధునిక వైద్యపరికరాలు, వసతులు గల ఆస్పత్రులు అవసరం. అవయవం ఒక్కటయినా, ఎక్కువ అయినా ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్లు చేయటానికి సుశిక్షితులైన సర్జన్లు, ఇతర నిపుణులతోపాటు అత్యాధునిక వైద్యపరికరాలు–వసతులు గల ఆస్పత్రులు అవసరం.

యశోద హాస్పిటల్స్‌లో ఎందుకు?

ఇటువంటి ప్రపంచస్థాయి సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకుని ఆపరేషన్ థియేటర్లు–శస్త్రచికిత్సానంతర సేవలు–అనుభవం గల సర్జన్లు–డాక్టర్లు ఉన్న హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వహించగలుగుతున్నాయి. అంతర్జాతీయ వైద్యసంస్థలు, అభివృద్ధి చెందిన దేశాలలోని వైద్యకేంద్రాలలో పనిచేసిన అనుభవంతో స్వదేశానికి తిరిగి వచ్చిన సూపర్ స్పెషలిస్టులతో కూడిన వైద్యబృందం సహకారంతో యశోద ఆస్పత్రులలో అవయవమార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ఇటీవలే ఓ పదమూడు సంవత్సరాల బాలికలు కంబైన్డ్ హార్ట్–లంగ్ సర్జరీ (గుండె–ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్స)చేశారు. ఇప్పటికే 2700 పైగా ట్రాన్స్‌ప్లాంటేషన్లు పూర్తిచేసిన అనుభవం గల వైద్యనిపుణులు గల ఈ ఆస్పత్రి ఏటా 16వేలకు పైగా గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. లైవ్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలకు నిర్వహణకు సంబంధించి దక్షిణాధిన యశోద హాస్పిటల్ గ్రూపు అగ్రస్థానంలో నిలుస్తోంది.

శశిశేఖర్‌కు రాజ్యసభ టీవీ అదనపు బాధ్యతలు



న్యూఢిల్లీ, ఆగస్టు 12: రాజ్యసభ టీవీ చానెల్ సీఈవో గుర్దీప్‌సింగ్ సప్పాల్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆయన స్థానంలో ప్రసార భారతి సీఈవో శశి శేఖర్ వెంపటికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాజ్యసభ సచివాలయ డిప్యూటీ కార్యదర్శి అమిత్ కుమార్ సర్క్యులర్ జారీ చేశారు. రాజ్యసభ టీవీ చానెల్ ప్రసారాల బాధ్యతలు శశిశేఖర్‌కు అప్పగించడం శుభపరిణామం అని ప్రసార భారతి చైర్మన్ ఏసూర్యప్రకాశ్ ట్వీట్ చేశారు.

అభివృద్ధి పనుల వేగం పెంచాలి

- కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అభివృద్ధి పనుల వేగాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని కేంద్ర కార్మిక, ఉపాధికల్పనశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో గృహ నిర్మాణం, ఆరోగ్యం, విద్యారంగాలలో అభివృద్ధి కార్యక్రమాల అమలును ఆయన శనివారం హైదరాబాద్‌లో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, రెండు పడక గదుల ఇండ్ల పథకానికి కేంద్రం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నదని, పీఎంఏవై పథకం కింద తెలంగాణకు 1,51,155 ఇండ్లను, గ్రేటర్ హైదరాబాద్‌కు 32,091 ఇండ్లను కేటాయించిందని చెప్పారు. ఇందుకు రూ. 1715 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇండ్ల నిర్మాణ పథకం పురోగతిపై త్వరలో మంత్రి కేటీఆర్‌తో సమావేశం కానున్నట్లు చెప్పారు. కరీంనగర్– ముంబై మధ్య దక్షిణ మధ్య రైల్వే త్వరలో ఒక కొత్త రైలు సర్వీసును ప్రారంభిస్తుందని దత్తాత్రేయ తెలిపారు. ఎంఎంటీఎస్ రెండో దశ పనులు 2018 డిసెంబర్ చివరి నాటికి పూర్తి కావాల్సి ఉన్నదని, ఈ పథకానికి భూసమస్యలు ఏవైనా ఉంటే రక్షణమంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌పై భారం తగ్గించడానికి చెర్లపల్లి, నాగులపల్లి స్టేషన్లను విస్తరిస్తామని చెప్పారు. సమావేశంలో బీజేపీ శాసనసభ్యులు జీ కిషన్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు జవాన్ల మృతి

- ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు.. పాక్ కాల్పుల్లో మరొకరు

శ్రీనగర్/ పూంచ్, ఆగస్టు 12: జమ్ముకశ్మీర్ సరిహద్దుల్లో శనివారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు సైనికులు మృతి చెందారు. సోపియా జిల్లాలోమిలిటెంట్లు దాగి ఉన్నారన్న సమాచారం అందుకుని భద్రతాదళాలు గాలింపు చేపట్టాయి. భద్రతాదళాలను చూసిన మిలిటెంట్లు జరిపిన కాల్పుల్లో ఐదుగురు జవాన్లు గాయపడ్డారు. వారిలో ఇద్దరు మరణించారని పోలీసులు తెలిపారు. పూంచ్ సెక్టార్ పరిధిలోని నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం నిష్కారణంగా శనివారం సాయంత్రం ఐదు గంటల వరకు రెండుసార్లు కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన సుబేదార్ జగ్రాంసింగ్ తోమర్ (42)చికిత్స పొందుతూ మరణించాడు. తోమర్ మధ్యప్రదేశ్‌లోని మొరెనా జిల్లా తార్సానా గ్రామ వాసి అని అధికారులు వివరించారు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. అంతకుముందు ఉదయం 5.15 గంటల నుంచి గంటన్నరసేపు పాక్ సైన్యం విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో గోహ్లద్ కల్రాన్ గ్రామ వాసి అయిన మహిళ (40) మృతి చెందిందని రక్షణశాఖ అధికార ప్రతినిధి చెప్పారు.

పాక్‌లో బాంబు పేలుడు: 17 మంది మృతి

- 20 మందికి గాయాలు

కరాచీ, ఆగస్టు 12: పాకిస్థాన్‌లోని క్వెట్టా నగరంలో శనివారం జరిగిన శక్తిమంతమైన బాంబు పేలుడులో 17 మంది మరణించగా, 20 మందికి పైగా గాయపడ్డారు. అత్యంత భద్రత గల పిషిన్ బస్టాప్ పార్కింగ్ స్థలం వద్ద బాంబు పేలుడు జరిగింది. ఈ పార్కింగ్ స్థలంలో నిలిపిన వాహనంలో అమర్చిన బాంబును పేల్చేశారని బలూచిస్థాన్ రాష్ట్ర హోంమంత్రి మీర్ సర్ఫ్‌రాజ్ బగ్టీ చెప్పారు.